

భారతీయ ప్రతిభ

రచయిత

గౌ. శ్రీ కల్లూరి చంద్రమౌళి, బి. యస్సి. (ఎబర్డీన్)

స్థానిక శాఖామాత్యులు - మద్రాసు రాష్ట్రము

తొలిపలుకు

గౌ. శ్రీ పాకాల వెంకట రాజమన్నారు

ప్రధాన న్యాయమూర్తులు, హైకోర్టు - మదరాసు

సంపాదకుడు

ఉభయభాషా ప్రవీణ

పం. వల్లమూడి వెంకటరత్నము

'సందేశమాల'

స్వామ్యములు
పం. వడ్లమూడి వెంకటరత్నము
'సందేశమాల' - తెనాలి

ప్రథమ ముద్రణము : విరోధి - సంక్రాంతి - ౧౯౫౦
ద్వితీయ ముద్రణము : వికృతి - గ్రీష్మము - ౧౯౫౦
వెల : రెండు రూపాయలు

ప్రచురణ
ది మోడరన్ పబ్లిషర్స్ - తెనాలి

తొలిపలుకు

మనకు స్వాతంత్ర్యము లభించినది మొదలు మన బాధ్యతలు హెచ్చినవి. సమస్యలు పెరిగినవి. సంఘర్షణ ఎక్కువైనది. ధనము నార్జించుటకన్న ఆర్జించిన ధనమును కాపాడి, వృద్ధిచేసి, సద్వినియోగము చేయుట ఎట్టి కష్టతరమో అట్టి స్వాతంత్ర్య విషయమున గూడ. ఈ స్వాతంత్ర్యమును సార్థక మొనర్చి భారతదేశ వైభవమును స్థాపించి, వికసింప జేయుటకు ముఖ్యముగ నావశ్యకములు మూడు:

భారతీయ ప్రతిభయందుగౌరవము,విశ్వాసముఒకటి.
భారతీయ సంస్కృతి పోషణ రెండు.
భారత సందేశ వ్యాప్తి మూడు.

భారతీయ ప్రతిభ, భారతీయ సంస్కృతి, భారత దేశ సందేశము—అని ఊతపదములుగ నుపయోగించుట అలవాటైపోయినది గాని వాని నిజస్వరూపము తెలిసినవారు అనేకులు లేరు. ఈలోపమునకు ముఖ్యకారణము ఈవిషయములను గురించి ఇంగ్లీషు భాషలో ఏవో కొన్ని గ్రంథములు తప్ప దేశభాషలలో ఎక్కువగా గ్రంథములు లేకపోవుటే. ఈకొరత

దీర్ఘటకు శ్రీ చంద్రమౌళిగారు ఈ పుస్తకమును తెలుగున రచించినందులకు వందనీయులు. ఇట్టి గ్రంథము తెలుగున వేరొందు లేదనుకొందును.

వీరు అనుసరించిన పద్ధతిలో మిక్కిలి కొనియాడ దగిన యంశము ఒకటి చెప్పక తప్పదు. ప్రతి విషయమును గురించి ఆంగ్లమున ప్రఖ్యాత విద్వాంసులు రచించిన గ్రంథములనుండియు, ఇతర పురాతన రచయితల గ్రంథముల నుండియు విపులముగ నాధారములు నేర్చి కూర్చినారు.

శైలి మృదు మధురము. విషయము ఉత్కృష్టము. పద్ధతి నవీనము. ఇంత మంచి గ్రంథమును ఆంధ్రలోకమునకు సమర్పించిన శ్రీ చంద్రమౌళి గారు స్థాన మాత్రముననే గాక నిజముగ గౌరవనీయులు. ఈ తొలిపలుకు వారికి నా యభివందనము.

మద్రాసు
5_1_50

(సం) పా. వెం. రాజమన్నారు

భారతీయ సంస్కృతీ
మహితులకు

X

పీఠిక

సకల భౌతికసంపదలతో, సంస్కృతీవైభవముతో, ఆధ్యాత్మిక తేజస్సుతో ఖండ ఖండాంతరముల విఖ్యాతిని బడసిన ప్రాచీన భారత తేజస్సును నేటి భారతీయ యువకులే విస్పష్టముగ గ్రహింపలేకుం డుట శోచనీయము. గ్రహించినవారును దాని నాద రించి యనుసరింపకుండుట విచారకరము. ప్రాచీన వైభవము నేకరువు పెట్టి దానినెల్ల గుడితనముగ స్వీక రింపవలయుననిగానీ, నవీన ప్రాభవమునెల్ల నాశ మొనర్పవలయుననిగానీ మా మతముగాదు. ప్రాచీన రత్నములను నవీన విజ్ఞానముతో సానబట్టి భావ్య న్నతికి బలిష్ఠమైన పునాదులు వేయ బ్రబోధిం చుటయే మా యభిమతము.

అనంత సత్యములు ఆర్య సాంప్రదాయములు వాంఛనీయములు. పై పై వన్నెలకు బ్రమసి పాశ్చాత్య వ్యామోహమునకులోనైన భారతీయ యువకులను ప్రాక్పశ్చిమ ధర్మములను బరిశీలించి, సమన్వయించి, దాని ననుసరించి తమ జీవితములను చక్కదిద్దుకొనుడని హెచ్చరించుచున్నాము.

పాశ్చాత్యులను గూర్చి వారి పెద్దలు చెప్పిన మాటలను, భావములనే యిందుదాహరించితిమి. వారిని తృణీకరింపవలయుననిగానీ, మనముస్వీకరింప

దగిన గుణము వారియందు లేదనిగానీ పలుకుట పిడి వాదము. ప్రాచీన భారత ధర్మములాధారముగ నవీన విజ్ఞానమును సేకరించుటయు, ప్రాక్పశ్చిమ ధర్మ సమ్మేళనముతో భావిభారతాభివృద్ధికి పాటువడు టయు సమంజసము. ఈ భావములు ఏకొందరలో నైన రేకెత్తింపగల్గినచో ఈ గ్రంథ రచనోద్దేశము సఫలమగును.

కోరినంతనే తొలిపలుకు వ్రాసియిచ్చిన ప్రధాన న్యాయమూర్తులు గౌ. శ్రీ రాజమన్నారుగారికి ధన్యవాదములు.

స్వాతంత్ర్య సంగ్రామావసరముల నప్పుడప్పుడు కారాగారములనుండి నా వ్రాసిన వ్యాసములను ఈ గ్రంథ రూపమున సంతరించిన మిత్రులు "సందేశమాలా" సంపాదకులు శ్రీ పం. వడ్లమూడి వెంకటరత్నముగారికి కృతజ్ఞుడను.

విజ్ఞాన స్వరూపులు, విశ్వకళా పరిషన్నేతలు నయి తమ యమూల్యాభిప్రాయములతో నాదరించిన విమర్శకాగ్రగణ్యులు, గురుస్థానీయులయిన శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారికిని మిత్రరత్నమగు డాక్టరు వి. శ్రీకృష్ణగారికిని అభివాదనములు.

— రచయిత

కృతజ్ఞత

స్వాతంత్ర్య సమరాంగణములందు సత్యాగ్రహము సలుపునప్పుడును, కారాగారములందు కడగండ్లబడునప్పుడును, రాష్ట్రపరిపాలనాకార్యములందు ప్రధాన పదవుల నుండి భారము వహించునప్పుడును భారతీయ సంస్కృతిని గ్రహించుటకై, అనుసరించుటకై, వ్యాప్తియొనర్చుటకై ప్రయత్నించు ప్రాజ్ఞులు గౌ. శ్రీ చంద్రమౌళిగారు.

ఇట్టి వీరి గ్రంథరత్నమును – ప్రాచీన భారత సంస్కృతికి పరిశుభ్రమగు నద్దమువంటిదానిని – సర్వస్వామ్యములతో సంతరించుట 'సందేశమాల'కు పరమసంతోషము.

ఈ యవకాశము మాకు గల్పించిన శ్రీ చంద్రమౌళి గారి సౌహార్దమునకు శ్రద్ధాంజలులు.

బాల్యమునుండియు కళారాధనమున ప్రజ్ఞావంతులై, ధర్మసూక్ష్మ నిర్ణయమున దత్పరులయ్యు భాషా దేవతారాధనమునకు బరువులెత్తు భక్తాగ్రగణ్యులు గౌ. శ్రీ రాజమన్నారుగారు.

కార్యభారమున తీరిక లేక యుండియు తమ 'తొలి పలుకు'తో నీగ్రంథ సువర్ణమునకు దావి గల్పించిన శ్రీ రాజమన్నారుగారి సహృదయతకు సంస్తుతులు.

అత్యల్పకాలమునందే యీ గ్రంథమునకు ద్వితీయ ముద్రణావసరము గల్పించిన యాంధ్ర మహాజనుల యౌచిత్య సంపదకు సాధువాదములు.

— సంపాదకుడు–'సందేశమాల'

UNIVERSITY OF MYSORE

C. R. REDDY
Pro-Chancellor

West lake
Yelwal Road
MYSORE,
21st April 1950.

My Dear Chandramouli,

I am so sorry I have delayed acknowledging receipt of your book 'భారతీయ ప్రతిభ' and responding to your kind letter sent along with it.

I must congratulate you on this excellent little book and even more on the fine mastery of Telugu prose – a very difficult art – which you have displayed. I like it in every way; for its inspiring subject matter; the attraction of your style; its scholarship without pendantry; and patriotic impulse and fervour.

I specially commend the fact that you have avoided the bizarre and vulgar గ్రామ్య భాష and kept to the classical, which will be understood and appreciated for all time to come and in all parts of the Andhra Desa.

With my sincere congratulations and the hope that you will write many more books in our lovely Telugu,

I remain,
Yours Sincerely,
(Sd.) C. R. REDDY.

ANDHRA UNIVERSITY, WALTAIR

Dr. V. S. KRISHNA,
Vice-Chancellor

23-2-1950

భారత దేశము సర్వ విషయములను స్వాతంత్ర్యమును బొంది పరిపూర్ణాభ్యుదయమును గాంచ వలసిన యిక్కాలమున, భారతీయ నాగరికత యొక్క స్వరూప స్వభావములను భారతీయులెల్లరును తప్పక గుర్తింపవలయును. ఆత్మ గౌరవము గల ప్రతి వ్యక్తియు తన జాతి యందలి ప్రతిభను తెలిసికొనిన గాని యా గౌరవము సార్థకమును సవిశ్వాసమును గాజాలదు. ఈ విషయమున శ్రీ చంద్ర మౌళిగారి గ్రంథము ఆంధ్రలోకమున కెంతయు నుపయోగించునని చెప్పక తప్పదు. భారత నాగరికతలోని యనేక విషయములు 'భారతీయ ప్రతిభ' యను వీరి గ్రంథమున చక్కగా వివరింపబడినవి. ప్రాచ్య పాశ్చాత్య విమర్శకుల యభిప్రాయములను సోదాహరణముగా క్రోడీకరించుచు, నవ్యమును భవ్యమును నైన విధమున నీ గ్రంథము వ్రాయం బడినది.

శైలి సులభమై సలక్షణమైన భాషతో గూడి యున్నది.

దీని నాంధ్రులెల్లరును జదివి యానందింతురుగాక.

23-2-1950} (Sd.) V. S. KRISHNA,
Vice-Chancellor

XV

విషయసూచిక

భారతదేశము – నైసర్గిక స్వరూపము	౧
భారతము ఏకదేశమే	౧౮
భారతీయ ప్రకృతి రహస్యము	౩౨
భారతీయుల నిత్యజీవిత విధానము	౩౭
నాగరికత యననేమి ?	౫౧
లలితకళలు – స్వదేశ మతము	౬౭
భారతీయ సంస్కృతి	౮౩
సంస్కృతిదాత	౯౭
స్త్రీలు	౧౦౧
త్రివేణీ సంగమము	౧౨౬
భారతదేశ సందేశము	౧౩౩

ఓం

వందేమాతరం

భారతదేశము

నైసర్గిక స్వరూపము

మన భారతదేశము సహజ సౌందర్య శోభితము. ప్రకృతి లక్ష్మీసంపన్నము. ప్రాగ్దక్షిణ పశ్చిమములందు విశాల మహాసముద్రములు వ్యాప్తములై పరివేష్టించి యున్నవి. ఉత్తరదిశయందున్న తోన్నత హిమవత్ పర్వత శ్రేణులు స్వర్గ లక్ష్మీతో సరసములాడుచు గంభీరముగ ప్రకమ్మికొని యున్నవి. ఇట్టి సముద్ర పర్వతములచే రక్షితమై భారతదేశము స్వాభావికముగ ఏక ఖండముగ ప్రకాశించు చున్నది.

సంతత శైత్య మయమై, సౌందర్యమున కునికియై కాంతి పుంజములతో కళకళలాడు హిమాలయ పర్వతములును, గంగా, యమునా, సింధు, బ్రహ్మపుత్రా, గోదావరీ, కృష్ణా, కావేరీ ఆది మహానదీ ప్రవాహములును, ఉన్నత పీఠ భూములును, విశాలతరములగు మైదానములును, సాంద్రారణ్యములును, విపుల ఖనిజసంపదయు, రుచ్య ఫలములును, పరిమళ పుష్పములును, సుగంధద్రవ్యము లును గలిగి ప్రపంచమున ప్రఖ్యాతి గాంచిన దీ దేశమే.

దేశరక్షణమునకు హిమాలయములు పెట్టని కోటలు. ఇందలి హిమరాశి సూర్యకరముల గిలిగింతలచే దట్టమగు దిటతనమును గోలుపోయి పలుచ పలుచనై కరగికరగి ద్రవీభూతమైజాలువారి సర్వనదులకు జీవనమునొసగి వానిని జీవనదుల నొనరించు చున్నవి. నిర్మల సూర్యరశ్మి షడ్ఋతువులందును సముద్ర జలముల గ్రోలి సమయానుకూలముగ వర్షముల నాదరించుచు దేశమును జలసంపన్నముగావించు చుండును.

ఇందలి మూలికలు – ఓషధులు రోగ నిరోధ నివారణములు గావించి ప్రజల యారోగ్యమును గాపాడు చుండును.

ప్రకృతిసౌందర్యము నొక-చోనధికముగ గాంచవలయునన్న హిమాలయ ప్రాంతములే తగిన ప్రదేశములు. ఇవి మన భారతదేశమునకు పెట్టని కోటలు. సౌందర్యముల మూటలు. ఆధ్యాత్మికపు బాటలు. కవికి కవిత్వము, గాయకునకు గానము, దైవోపాసకునకు దివ్యత్వము నొక్కసారి ప్రసాదింపజేయగల సామర్థ్యము గలవి. ఇందలి పర్యటనము కఠినమైనను మార్దవమును, ప్రయాసమైనను విశ్రాంతిని, భయావహమైనను ఆనందమును గలుగజేయును.

"హిమాలయముల నెక్కసారి గాంచినవ్యక్తి వానిని మఱువజాలడు. వీనిని బోలినవానిని మరి చూడజాలడు".

— ఎల్ఫిన్‌స్టన్: (హిందూదేశచరిత్ర)

ఈ భారత భూమినున్న మహానదులు—మానవ, పశు, పక్షి, సస్యాదులకు వలయు నిఱురసమాధుర్యముగల జలమును సమృద్ధముగ నొసగును. నావల రాకపోకల వసతులు చేకూర్చును. నూతన లంకలను నిర్మించును. వేసవిని చలబఱచి జీవికి హాయి నొసంగును. వండలిరేవడలత్రోయ భూసారమును బెంపొందించును.

ఇందలి మైదానములు సస్యశ్యామలములై, పచ్చిక బీళ్ళతో, వివిధఫలపుష్పములతో, సకల ఔషధములతో సుఖసంపదల జేకూర్చుచు మనస్సున కానందము నొసగుచుండును.

ఇచ్చటి యరణ్యములో! మనకు కలప, లక్క, రబ్బరు, గందపు చెక్క మున్నగువానిని విరివిగ ప్రసాదించును. వర్షముల బెంపొందించును. పశుపోషణమునకు ఇవి పరమ ప్రయోజనములు.

వెండి, బంగారము, రాగి, యినుము, బొగ్గు మున్నగు ఖనిజ సంపద యిందు విపులముగ గలదు.

ఎద్దులు, ఆవులు, గొఱ్ఱెలు, మేకలు, గుఱ్ఱములు, గాడిదలు, ఏనుగులు, పావురములు, గువ్వలు, కోళ్లు మున్నగునవి యనంతముగ నిందు గలవు.

వివిధ ధర్మములను విశ్వసించుచు, ననేక సంప్రదాయముల ననుసరించుచు, పరస్పర సహాన స్నేహభావములతో ప్రవర్తించుచుండు ప్రజా సమూహమే యీ దేశ ప్రధాన సంపద. ప్రపంచమున నైదవ వంతగు నలువది కోట్ల మానవుల నీ దయామయి యగు భారతమాత యావశ్యక వస్తువుల నెల్లనిచ్చి యనురాగముతో నల్లారు ముద్దుగ నాదరించుచుండును. ఒక్క మానవులనేగాదు; ప్రపంచమున మూడవ పాలు పశువులను, పలురకము లగు పక్షి సంతతులనుగూడ నీ భారతి ఆదరభావముతో పాలించుచు, పోషించుచు నుండును.

పరదేశములందు పండని యెల్లపంటలు, ఫలపుష్ప శాకము లిందు ఫలించును. అప్పటికప్పుడు తయ్యారైన పదార్థముల ననుభవింపజేయుట కీ దేశమే అర్హమైనది. ఇంతటి ప్రకృతి సంపచ్ఛాయమానమగు దేశము ప్రపంచమున మరెద్దియును లేదు. కావుననే పరదేశీయు లెల్లరు నీ దేశమును 'భూలోకస్వర్గము' అని కీర్తించిరి.

ఇక మనవారో, యిందలి అమూల్య మోహరత్నాదులను
జూచి 'రత్నగర్భ' యని స్తుతించి యుండిరి.

ప్రాచీన భారతదేశము

భారతదేశము ప్రాచీనకాలమున సిరిసంపదల కొల
వాలము. సత్య, ధర్మములకు శోభనమూర్తి. సంస్కృతీ
నాగరికతలకు మేలుబంతి. శాస్త్రములకు, కళలకు జన్మ
స్థానము. ఆమె విజ్ఞానవీచికలు ప్రపంచమున నలుదెసల
విరివిగ వ్యాపించి ప్రపంచమున కొక నూతనతేజస్సును,
సందేశము నొసగెను. మత సారస్వతములు, శాస్త్ర
కళలు, కుటీరపరిశ్రమలు, వ్యవసాయము మున్నగు సర్వ
జ్ఞాన, విజ్ఞానముల కీ దేశమే పుట్టినిల్లు.

"ప్రకృతియొసగగల సంపద, శక్తి, సౌందర్యములలో
భాగ్యవంతమగు దేశమును, కొన్ని ప్రాంతములు భూలోక
స్వర్గముగ నున్న దేశమును, ప్రపంచమంతలి అన్ని
ప్రక్కల నన్వేషించి నేను భారతదేశమువంకకే ప్రత్యే
చూపుచున్నాను. మానవుని మానసిక వికాస సమస్య
తో యాకాశముక్రింద నభివృద్ధి గాంచినవన్నను, బెక్కు
జీవితసమస్య లెక్కడ బరిష్కరింపబడినవన్నను, తత్సమ
స్యల పరిష్కార మెందుజరిగెనన్ననను, పేటో, కాంటుల
జదివినవారి దృష్టి యెచ్చటి కాకర్షింపబడ్డవలెనన్ననను నేను

భారతదేశమువంక ప్రేలెత్తిచూపుచున్నాను. గ్రీకు, రోము, సెమిటిక్, యూదుల భావములతో బోషింపబడిన ఐరోపీయులమగు మనము మన బాహ్యాంతర జీవితములను ఇంకను నిరుషముగ - సమగ్రముగ - సర్వతోముఖముగ వేయేల ఇంకను స్వచ్ఛముగ, మానవోచితముగ సంస్కరించుకొని శాశ్వత జీవితమును బడయుటకు వలయు రసాయన మేదేశ సారస్వతమున లభించునాయని పరిశీలించితిని. పరిశీలించి యిది లభించెడిచోటు భారతవర్షమేయని ప్రేలెత్తిచూపుచున్నాను" —మ్యాక్స్‌ముల్లర్:
("హిందూదేశము మనకేమి నేర్పగలదు' పుట ౮)

"ఆకర్షణీయమగు ప్రకృతిదృశ్యములును, సారవంతమగు భూములును, సాంద్రారణ్యములును, ఎత్తైన పర్వతములును, కొన్ని మహానదులును, పటుతరశీతలత్వమును, చెట్టుచేమలులేని ఎడారులును, చెమ్మలేని యిసుకమైదానములును, తీవ్రోష్ణదివసములును గలదై యితరములగు అన్నిదేశముల ప్రధానచిహ్నములతో భారతదేశము వెలుగొందుచున్నది. మానవత్వమునుగాని, ప్రకృతిని గాని పఠించువిద్యార్థికి నేటికిని అద్భుతసౌందర్యమును, ఆకర్షణమును ప్రదర్శించి సర్వదేశములకు రాణిగ నున్నది భారతదేశమే." —హరవిలాస శారద.

"మనజాతికి (పాశ్చాత్యులకు) మాతృభూమి భారత దేశము. యూరపుభాషలకు మాతృభాష సంస్కృతము. మనతత్త్వశాస్త్రము (Philosophy) న కామెయే తల్లి. అరబ్బులద్వారా విపులముగ లభించిన గణితశాస్త్రమున కామెయే జనని. బుద్ధభగవానుని మూలమున క్రైస్తవ మతాదర్శముల కామెయే జనయిత్రి. గ్రామ పరిపాలనముద్వారా మనస్వపరిపాలనమునకును, ప్రజాపాలనమునకును ఆమెయే జన్మదాత్రి. ఆ భారతమాత పెక్కు విషయముల మనకెల్లరకు మాతృదేవియే."

—విల్ డ్యూరంటు: (అమెరికా ప్రఖ్యాత విజ్ఞాని)

"భారతదేశమున సర్వము విచిత్రము. వినోదమయము. విలాసవిహార యోగ్యము. రసపుత్రస్థానమందలి వీరావేశపరులగు రసపుత్రులు, పవిత్రవారణాసియందలి నిశ్చల దైవభక్తిపూరితులగు బ్రాహ్మణులు, అశ్వారూఢులై, పౌరుషమును వెలిగక్కు మహారాష్ట్రులు, ఏనుగులపై శాంతముగ ప్రయాణ మొనర్చునవాబులును ఇందుగలరు. ఈ ప్రఖ్యాత పవిత్రదేశమునందు ప్రకృతిగూడ విచిత్రమయమై వివిధ రీతుల వెలుగొందుచున్నది. భారత దేశ విపుల వృక్షసంపదను, ఝుంఝూమారుతములను గాంచుము! సంతత హిమమయమగు హిమాలయముల

గంభీరతను, చెమ్మాయైననులేని యెడారులను చూచుమము!
విశాలమైదానములను, ఎత్తైనపర్వతశ్రేణులను కన్గొనుము!
మరియు నన్నిటికిని మేటియై వెలుగొందు ఆమె చరిత్ర
ప్రాచీనతను, ఆమెను స్మరించి కీర్తించు కావ్యసంపదలను
తిలకింపుము!" ——కౌంటు జారన్సు, జర్మా.

"గ్రీసుదేశపుతత్వ సిద్ధాంతముల కెవరితత్వసిద్ధాంతములు మేలుబంతులో, ప్లేటో, థేల్సు, పైథాగరసులు ఎవరిపవిత్ర గ్రంథములకు శుశ్రూషగావించిరో, అట్టియార్య ఋషులనుబోలినవారు మరెచటగన్పింపగలరు? ఈనాటికిని పాశ్చాత్యప్రపంచమునకెల్లనచ్చెరువొనరించు గ్రహగతి విజ్ఞానదక్షులగుజ్యోతిషులెందుగాననయ్యెదరు? మనమన్న నలకు పాత్రములైన కట్టడముల ననల్ప శిల్పముల చిత్రింపగల అట్టిశిల్పులెక్కడగలరు? రాగస్వరభేదములుగల్పించి ఆనందమునుండి దుఃఖమునకు, దుఃఖరసమునుండి చిరునగవులకు మనస్సు నుర్రూతలూగించునట్టి గానకళావిదులింకెచటనైన నున్నారా?"

——కల్నల్ టాడ్ : (రాజస్థానము.)

"భరతఖండమువంటి ప్రఖ్యాతదేశము ప్రపంచమున వేరొండు లేదనిన కాదనువారుండరు. వివిధ ప్రకృతి

దృశ్యములగాంభీర్యమునసేమి, సస్యపరి సమృద్ధియందేమి
యీ దేశమున కేదేశమును సాటికాదు."

—మేజ్ పండితుడు.

"భారతదేశము భగవదనుగ్రహము గలిగిన కొలది దేశములలో నొకటియనియు, నైసర్గికవస్తుసముదాయము నందును, శిల్పకళలయందును, పండితుల రచనములందును ఉత్తమమునైనవి సమృద్ధముగగల్గిన దేశమనియు చిర కాలమునుండి ప్రసిద్ధిగాంచినది."

—(ఎన్ సైక్లోపీడియా బ్రిటానికా. పుట ౪౭౬.)

నాటి భారతీయులకు విశేషముగ శిల్పనైపుణ్యముండెడిది. కళాచాతుర్యముండెడిది. శాస్త్రపరిజ్ఞానముండెడిది. తమ దేశమునందే పండిన ప్రత్తి, నార, పట్టు మున్నగు పదార్థములతో ప్రశస్తమైన వస్త్రాదులనేసి, పరదేశముల కంపి యమితధనమార్జించుకొనెడివారు. విలువగలసరకుల నిచ్చి, వెండి బంగారముల దెచ్చుకొనెడివారు. అప్పుడెంతో రాజ్యబలముగల రోముదేశముకూడ 'అయ్యో! మన ధనమంతయు భారతదేశము లాగుకొనిపోవుచున్నదే!' అని పరిదేవనము నొందెడిదట. పలుతమతెలివితేటలచే దేశములోని ద్రవ్యములతో మంచి మంచి సరకులు కల్పించి, స్వదేశవిదేశములకువిక్రయించి ధనమార్జించెడి వారు. విపణవీధులనాకర్షించి ప్రఖ్యాతిని గాంచెడివారు.

వారికి చేతినిండ పని, కడుపునిండ తిండి, ఒడలినిండ బట్టయు నుండెడివి.

"అనేకాంగ్లవర్తకులును, తదితరులును తమ పడవలనిట ప్రతి సంవత్సరమును కట్టించుకొనుచున్నారు. ప్రశస్తముగ బెరిగిన ముమరుకర్ర యిచట గావలసినంత యున్నది. తీరమునందు దివ్యమైన యినుమున్నది. లంగరు మున్నగు నినుపసరకు లీ దేశస్తులు మిక్కిలి నేర్పుతో జేయుచున్నారు. సుప్రసిద్ధ నౌకానిర్మాతలిట ననేకులున్నారు. పడవలు నిర్మించి, వాని గడలిపై విడుచుటలో వారికంటె నెకువ కుశలుల నీ ప్రపంచములో నేనెచటను జూడలేదు. తెరచాపలు, ఓడ పగ్గములు, నూలి నిచ్చెనలు మున్నగు నావికోపకరణములను వారుచేయు పద్ధతి కడు ప్రశస్తమైనది."

—'బాలసోరు'లోని పాశ్చాత్య వణిక్ప్రతినిధులు లండను లోని The Court of Directors కు వ్రాసిన ఉత్తరము.

"ఓ ప్రాచీనభారతవర్షమా! గౌరవాదరములతో నీకు నమస్కరించుచున్నాను. నేటికిని, నీ ప్రాచీనచింతనములకు ప్రణమిల్లుచున్నట్టియు, నానాటి గిడసబారి శుష్కించుచున్నట్టియు, ఆజాతి విధ్వంసకము, ఆదేవ విధ్వంసకము, ఆయాత్మ విధ్వంసకమునగు నాపాశ్చాత్య ప్రపంచమునకు

నీబోధనమువలన నాశ్చర్యముగలుగుగాక!"—పియెరెలోటీ.
పరాసుదేశపు ప్రఖ్యాత విద్వాంసుడు. (౧౯౧౮ ఆగస్టు ఆర్యపత్రిక)

"స్వర్గము భారతదేశమునన్నదని యెవరైన నెక్కిక
వక్కాణించుచో నాశ్చర్యము జెందకుము. స్వర్గము హిందూ
దేశముతో సరిపోల్చుటకు పనికిరాదు."

—అబ్దుల్లావసఫ్ (తజ్జియతులంసాక్)

"మానవునిమనస్సు ఎంతవిశాలముగ వ్యాపింపగలదో
యా యంతమును హిందువులు కనుగొనినారు."

—హ్యూనింగ్‌సతి. (Ancient & Medieval India.)

"భారతీయులు సరళతగల సుఖజీవులు. యజ్ఞములందు
సోమరసమును దప్ప, వారు మత్తుపదార్థముల నెప్పుడును
సేవింపరు. వీరి ప్రధానాహారము బియ్యము. స్త్రీలకు
సంపూర్ణస్వాతంత్ర్యముగలదు. స్త్రీలు వేదములుపఠింతురు.
సన్యాసినులుగనుందురు. భారతీయులు రాత్రులందుతలుపు
లకు తాళములవైచుట నెరుగరు. ఒడంబడికవ్రాతలుగాని,
చట్టములుగానిలేవు. చట్టవ్యవహారములనన్నిటిని ప్రఖ్యాత
సాంప్రదాయికమగు పంచాయతీవిధానమునసే నిర్ణయించు
కొందురు. పాటలీపుత్ర ప్రజలు చిత్రవిచిత్ర రత్నమయ
ములగు నక్షత్రములతో గూడిన మజినులను ధరింతురు. గౌరవ
కుటుంబములకు జెందినవారు ఛత్రములతో విహరింతురు.
సామాన్యులు తలపాగలు ధరింతురు." —రాలిన్‌సన్.

ంంతి సంlలో ఇంగ్లండునకు యుద్ధనావలు హిందు
వులు కట్టిపెట్టెడివారు. భారతీయులగు నావికా నిర్మాతల
నుండి నమూనా లర్థించి తెచ్చుకొనెడివారు.

"జలసమృద్ధమై సేద్యము ప్రశస్తముగా జరుగుచున్నట్లు
నాకగపడిన భారతదేశభాగములలో నిది (భరతపురసంస్థా
నము) యొకటి. పొలములలోపైరు పరమసుందరముగా
నున్నది. ప్రత్తిపంట ప్రశస్తముగానున్నది. పండిన చెఱుకు
లప్పుడేకోసి బయలుచేసిన విశాలక్షేత్రములును, అనేకము
లైనచెఱుకుగానుగలును నేజూచినాను. అన్నిటికంటెను దేశ
భాగ్యమునకివి యమోఘదృష్టాంతములు. ప్రజాబాహు
ళ్యమంతగా లేదుగాని పల్లెలన్నియు మిక్కిలి మంచిస్థితిలో
నున్నవి. మరమత్తులు బాగుగా జరుగుచున్నవి. కంపెనీ
యధికారములోనున్న రాష్ట్రములు జూచి రాజపుత్రస్థాన
ములో నింపైన యిట్టివ్యాపారములు చక్కగాసాగుచుండు
ప్రదేశముండునని నేననుకొనలేదు. దీనినిబట్టి భరతపుర
ప్రభువు ప్రజల దనబిడ్డలవలె జూచుకొని పరిపాలనము
చేయు నసాధారణ ప్రజావంతుడనియైన నూహింపవలెను.
లేదా బ్రిటిషు రాష్ట్రములందలి పరిపాలనావిధానము
స్వదేశప్రభువుల పరిపాలనముకంటె ప్రజాసౌఖ్య విషయ
మునను, దేశాభ్యుదయ విషయమునను దక్కువ యను

కూలముగా నున్నదనియైన నూహించుకొనవలెను.''

—బిషప్ హీబర్.

౧౭౦౦ సం॥ క్రితము గ్రీకురాయబారి మెగస్తనీసు భారతమును గాంచి విస్మయముజెందిన విధము గనుడు.

''వివిధాహారపదార్థములును విపులముగగల భారతీయులు విగ్రహపుష్టి సౌష్ఠవములతోడను, ప్రౌఢదృష్టుల తోడను కళకళలాడుచుండుట గాంతుము. పరిశుభ్రమగు వాయువులను బీల్చుచు, పవిత్రమగు జలమును గోలు జాతికి సహజలక్షణమగు కళానైపుణ్యమునందు వీరుసిద్ధహస్తులు. కృషిఫలితముగ భూమినుండిలభించుసర్వ ఫలములను బడయుదురు. ఇచ్చట వెండి,బంగారము,రాగి, యినుము మున్నగులోహములు విపులముగ దొరకును. యుద్ధములకు, నితరప్రయోజనములకు కావసినంత తగ రము మున్నగులోహములు లభించును. మహానదుల జలప్రవాహములతో నెల్లపంటలు పండింతురు. ఇట్లు వర్షించుచుండుట విసుగు గల్గింపవచ్చును. కాని భారత దేశమున క్షామము నెన్నడుగానము. ఆహారపదార్థముల లోకొప్పడును—ఈషణ్మాత్రమైనను గానము. క్షామములు రాకుండువిధానములనేభారతీయులాచరింతురు. యుద్ధకాల మున పరదేశములలోపంటలనష్టపరచుట, సారవంతమగు భూముల నాశమొనర్చుట గావింతురు. కాని ఎట్టి భీకర

యుద్ధపరిస్థితులందునను, భారతసైనికులు వ్యవసాయము జోలికిపోరు. పైరు, పంటల నాశ మొనర్పరు. జీవనాధారులగు రైతులను పవిత్రులుగ భావించి యిరుకక్షుల యోధులు వారిజోలికిబోని నీతినియమములకు కట్టుపడి యుందురు. మరియు పరస్పరము శత్రువులభూములను దహన మొనర్చుటగాని, చెట్లనునఱుకుటగాని వీరెఱుగరు."

—మ్యాక్ కిండ్రిల్: (ప్రాచీనహిందూదేశము.)

"దేశములో ప్రయాణముచేయుచున్న పరదేశికి చక్కగా సాగుబడిచేయుచున్న క్షేత్రములు, పాటుపడి పనిచేయు ప్రజలతో కిటకిటలాడు ప్రదేశములు, కంటి కింపుగా కట్టబడి అభివృద్ధిలోనుండు పట్టణములు, విపుల వ్యాప్తిగల వాణిజ్యము, ఎటుదిరిగిచూచినను ప్రజాసంతుపిని సూచించులక్షణములు కంటబడును.....టిప్పునకు కలంకమాపాదించు సమలుగాని, నుడులుగాని యెవరి నోటను వినబడెడివిగావు." —లెఫ్టినెంట్ కలనల్ మూర్.

"ప్రజలయర్థప్రాణములిట(వంగదేశమున)సురక్షితములు. సరకుతోబోవువర్తకుడైననుసరే సామాన్య పథికుడైనను సరేయీదేశములోప్రభుత్వజాగరూకతచే సురక్షితముగా ప్రయాణముచేయగలడు. దమ్మిడిఖర్చులేకుండ, అరికులు వెంట వచ్చి యంగరక్షకులై యతని నొక మజిలీనుండి

యొకమజిలీకి గొంపోదురు. ధనవంతమగు 'డక్కా' మండ
లపుభూములన్నియు సాగులోనున్నవి. ప్రజలకు నిష్పక్షపా
తమైనన్యాయము దొరకుచున్నది. పరిపాలకుడగు 'జస్టంత
రాయడు' సద్విద్యాశిక్షితుడైనప్రభువు. ఏమలాంతఃకర
ణుడు. ఋజుమార్గవర్తి. విసుగుగొనక, శ్రమకోర్చి, అప్ర
మత్తుడై తన పరిపాలనకృత్యమునుచేసికొనుచు ప్రజా
సౌఖ్య స్వాస్థ్యములొనగూర్చుచున్నాడు. ప్రభుత్వము
వారెవరికో కొందఱకు సర్వగ్రాహకముగా సరకుల జటి
కిచ్చుపద్ధతి యతడు కొట్టివేసినాడు. ధాన్యములపై
పన్ను వేయుట మానివేసినాడు." —హాల్వెల్.

"ప్రశస్తమగుకృషివిధానము, సాటిలేని వస్తునిర్మాణ
నైపుణ్యము, నిత్యజీవితావసరవస్తువులను, విలాసవస్తువు
లను నిర్మించు సుకుమారహస్త కౌశలము, చదువు,
వ్రాత,గణితములుబోధించుపాఠశాలలును,దయాదాక్షిణ్య
ములు, దానధర్మములతో గూడిన అతిథిసత్కారము,
పరిపూర్ణ విశ్వాస గౌరవ సరళత్వములతో గూడిన స్త్రీ
స్వభావముతోస్త్రీలు. మెలగుటలే నాగరికజాతుల లక్ష
ణములగుచో పాశ్చాత్యజాతులకు భారతీయులుతీసిపోరు.
కాని నాగరికత ఎగుమతి దిగుమతులుగావించు వ్యాపా
రమే యగుచో భారతదేశముకంటె నాంగ్లదేశమే మిన్న
యని నాభావము." —సర్థామస్మన్రో, (మద్రాస్గవర్నర్.)

"మహారాష్ట్రలదేశము నేజొచ్చినపుడు కృతయుగము నాటి యకాపట్యానందముల మధ్యమున నేనుండినట్లు నాకుదోచినది. ప్రకృతిసహజ సౌందర్యమచట నింకను మారిపోలేదు. యుద్ధపీడలింకను వారినిజెనకలేదు. ప్రజలు పూర్ణారోగ్యవంతులుగను, చిత్తోల్లాసము గలవారుగను నాకు జూపట్టిరి. అత్యంతమైన యతిథి సత్కార మాదేశములో సర్వజనసామాన్యమైన సదర్మముగా నాకుగాన్పించినది. 'వచ్చినాకున్న దేమోయథేష్టముగననుభవింపుము' అనియానందముతో నాహ్వానించుచున్నట్లున్నే హితులకు, ఇరుగుపొరుగువారికి, అపరిచితులగు వైదేశికులకు, అందరకునచ్చటి ప్రతిగృహము సుగమమై సిద్ధముగానుండును."

—అంక్వెటిల్ డూపెట్రాడ్.

"తమ యింటిలోపులకు తాళములు వైచికొనుటయు, ఒడంబడికలకు పత్రములను వ్రాసికొనుటయు భారతీయుల కగత్యములేదు. వారంత నిజాయితీ మనుష్యులు''.

—స్టాబో.

"ఆర్జవము, న్యాయబుద్ధి భారతీయులవిశేషగుణములు. ధనవిషయమున నెక్కువైనను నక్రమముగస్వీకరింపరు. న్యాయవిషయమున తమ హక్కుల నెక్కువగ వదలుకొనియైనను సామరస్యముకొఱకు ప్రయత్నింతురు. ఋజుత్వము వారి ప్రధానలక్షణము."

—యువాన్ చ్వాంగ్.

"సత్యమును సక్కాణింపవలెనన్న భారతదేశమే నాకు పుణ్యభూమి. పాశ్చాత్యశాస్త్రముల కన్నిటికిని హైందవ తత్త్వశాస్త్రము తల్లివేరు. సర్వమతములకును భారత ధర్మ ముత్పత్తిస్థానము. భారతదేశము ఆధ్యాత్మిక విద్యకు మాత. నాగరికతకు ఊయెల. భారతదేశపు వ్యక్తిత్వము, అతీంద్రియానుభవములు నాదేశధర్మమునందేగలవు. భారతీయుడు మతమునే భుజించును. మతమునే పానమొనర్చును. మత మునే పీల్చును. మతమునందే నిద్రించును."

—ఆనిబిసెంటు.

"భారత ప్రజలు ప్రపంచమందలి యితర జనులందరి కంటెను ఎక్కువ పాటుపడి పనిచేయువారు. వారి భూము లలో నత్యధికభాగము సారవంతమై పుష్కలముగా ఫలించును."

—మేగ్డనాల్డు మంత్రి.

ప్రాచీనకాలము నుండియు భారతదేశము మతము, శాస్త్రములు, కళలు మున్నగు విద్యలందేగాక, వర్తక వ్యాపారములందును, అర్థసంపదయందును, విపులవిజ్ఞానము లందును సమ్మానముల బడసి ప్రఖ్యాతిని గాంచెను. ఈస్టిండియా పరిపాలన కాలమునగూడ భారతదేశ మన్ని విధముల ఔన్నత్యమును గాంచి యుండెను.

భారతము ఏకదేశమే

పాశ్చాత్య చరిత్రకారులు, రాజకీయవేత్తలు తమ యజ్ఞానమువలననో, ద్వేషమువలననో లేక స్వార్థము కొఱకు బుద్ధిపూర్వకముగనో మనదేశమునుగూర్చి అసత్యప్రకటనములును, దుష్టప్రచారములును గావించుచున్నారు. కొలదిమంది భారతీయులు వీరి ననుకరించుట విచారకరము, గర్హ్యము. రాగద్వేషములకు గురిగాక యథార్థమును ధైర్యముగ ప్రకటించుట సత్యాన్వేషకుల ప్రధానలక్షణము. పరులను విమర్శించునపుడు విషయములు విపులముగ స్వీకరించి, స్పష్టముగ గ్రహించి, ఉదార భావముతో తర్కించి విమర్శింపవలెను. తమనిర్ణయములు బలిష్ఠాధారములపై సహేతుకముగ నుండవలెను.

'భారతదేశ మేనాడును ఏకదేశముగ బరిగణింపబడ లేదు. ప్రాచీనకాలమునుండియు భారతీయులకు జాతీయత లేదు. నేటి జాతీయ భావము పాశ్చాత్య పాలకుల సాహచర్య ఫలితమే' యని కొందరు నుడువుచున్నారు. భారతదేశ మేకదేశమే యని ధ్రువపఱచు శాస్త్రసమ్మతములు, సహేతుకములు నగు పెక్కునిదర్శనములున్నను, సత్యాన్వేషకులగు ప్రాక్పశ్చిమ చరిత్రకారులు పెక్కురు

ప్రబల నిదర్శనములచే బలపఱచుచున్నను ఈ యసత్య ప్రచారమింకను సాగుచుండుట కేవలము మన బానిస తనపు ఫలితమే యని నుడువక తప్పదు.

కాని మన సంస్కృతి, నాగరికత, సాంప్రదాయాచారములు, సహజ భౌగోళికస్థితి హిందూదేశపు ఏకత్వమును సర్వదా మనకు ప్రదర్శించుచునేయున్నవి. దీని నేవిధము గను కాదనజాలము. ఇట్లు కాకుండ చేయను లేము.

వైదిక కాలమునుండియు నీదేశపు సంస్కృతి నాగరికతలు పరంపరా ప్రవాహములే. ఆర్యావర్తము, భరత ఖండము మున్నగునవి యీ మనదేశమునకు ప్రసిద్ధ నామములు. ప్రతియార్యుడును నిత్యము తన సంధ్యావంద నమున గీర్తించునది యీదేశమునే, ఇందలి నదులనే. (భరతవర్షే, భరతఖండే) ఇక్ష్వాకులు, కౌరవపాండవులు, గుప్తరాజులు, అశోకుడు, అక్బరు మున్నగువారెల్లరు నీదేశము నొక్కదేశముగనే పాలించిరి.

"భారతదేశము సముద్రములతోడను, పర్వతముల తోడను చుట్టబడి వివాదములేని భౌగోళికైక్యమును ప్రదర్శించుచు న్యాయముగ నేక నామముతోడనే పిలువ బడుచున్నది. పెక్కు విషయములందు పరదేశనాగరికతలకు దీని నాగరికత విభిన్నముగ నున్నను తన సాంఘిక, వైజ్ఞ

నిక, జీవిత విషయములందు ఐక్యమును బ్రదర్శించి యేక దేశమేయను భావమును ధ్రువపఱచుచున్నది."

—విన్సెంటుస్మిత్.

"భారతదేశపు లౌకత్వము ధార్మిక సంస్కృతులకు సంబంధించినదే గాని కేవలము రాజకీయము మాత్రమే గాదు. ఈయైక్యము కనీసము 2000 సం॥ లనుండి సారస్యతమునను, జాతీయతను గలదే గాని క్రొత్తదిగాదు. ఇది హిందూదేశమని కాక ఆర్యావర్తము, భరతవర్ష మనియే పిలువబడెను. అశోకుడు జంబూద్వీపపురాజనిపించుకొనెను. భారతీయులు తమ దేవస్థానములను, పుణ్యక్షేత్రములను, పుణ్యనదులను, ఉత్తరమున హరిద్వారము, బదరీకేదారములను, దక్షిణమున కంచి రామేశ్వరములను, పడమర ద్వారకను, తూర్పున జగన్నాథమును స్తుతింతురు. ఈవిధమగు మత సంస్కృతుల ఐక్యము ౧౬ శతాబ్దముల వరకు నిరంతరాయముగ వచ్చినది. కాని యిది క్రీస్తునకు తరువాత ౮ వ శతాబ్దియందు మాత్రము అరబ్బులచే కొలదిగ విచ్ఛిన్నమొనర్పబడెను"

—అనిబిసెంటు.

'ఈదేశ మొక పెద్దభూభాగము. ఇందు వివిధ మతములు, భాషలు, తెగలు, ఆచారములు గలవు. కావున దానినొక ఖండ మనదగునే గాని దేశ మనజనదు.' అని

కొందరు వాదింతురు. పైన చేర్కొన్న విషయములెల్లను సత్యములే గాని యీ దేశమును ఖండమనుట మాత్రము సత్యదూరము. దేశము దేశమేగాని ఖండమెట్లగును?

రైళ్ళలో, విమానములలో దేశము నటునిటుచూచి, మిడిమిడి జ్ఞానమున పిడివాదము గావించుచు, వ్రాయువ్రాత లందుపటుత్వముండజాలదు. పైపైనగాన్పించు భిన్నత్వము నందు లీనమై, సజీవమై, కాలక్రమముగ వర్ధిల్లిన నాగరికతా సంస్కృతుల యైక్యమే దేశైక్యమును ప్రదర్శించుచున్నది. పరదేశీయుల క్రూరములగు దాడులను, వికృత సంఘర్షణములను పటుత్వముతో నెదుర్కొని, తన నాగరికతా సంస్కృతులతో తన యైక్యమును కాపాడుకొనుటయేగాక పరుల సుగుణములను గుర్తించి జీర్ణించుకొన్న దేశమిద్దియే. ఈదేశపు నాగరికతా సంస్కృతులకు కేంద్రము ఆర్యజీవన పథము. ఇంచుమించేమి సర్వతోముఖాభివృద్ధి బడయుచున్నది. ఈనాటికిని ఈకీలకము బలీయముగనే యున్నది. ప్రాచీనకాలమునుండియు నింతటి ప్రజలీదేశము నేకముగనే భావించిరి.

తీర్థయాత్రలు, పుణ్యక్షేత్రపర్యటనములు, ఆటపాటలు, ఆహారవస్త్రనియమములు, గృహపరికరములు, మత నైతిక రాజకీయ ఆర్థిక ప్రబోధము లిట్టియైక్యమునే ప్రదర్శించుచున్నవి. భిన్నత్వమున నేకత్వమును గాంచుటయే

భారత విజ్ఞాన వికాసఫలితము. సంస్కృతినాగరికతల నిగ్గు. నిత్యజీవితలక్షణము. ప్రకృతి వైచిత్ర్యమునందు పరబ్రహ్మమును గాంచుటయే భారతీయుని గమ్యస్థానము. 'ఏకమ్ సద్విప్రా బహుధా వదంతి' యనునదే భారత విజ్ఞానమున పరమావాక్కు. వివిధనదులు వివిధప్రాంతముల జన్మించి వంకరటింకరగ ప్రవహించుచు తమ గమ్యస్థానమగు సాగరమునే చేరును. విధులు వివిధములైనను ధర్మమొక్కటియే. భగవంతుని ప్రార్థించి ప్రత్యక్షమొనర్చుకొనుటకును, రాజునెడ ప్రవర్తించు విధానమునకును, బంధుమిత్ర సేవకాతిథుల నాదరించుటయందును ఒకే లక్ష్యము గలదు. రాజకీయ ఆర్థిక నైతిక మతములందు సామరస్యమును ప్రదర్శించును. పెద్దలు, పిన్నలు - సర్వజను లీ ధర్మమునకు కట్టువడియుండవలసినదియే. జాతిమత విభేదములతో ఈర్ష్యాద్వేషములు గలిగియుండక సహనశక్తిని ప్రదర్శించుచు, విజ్ఞాన నైతిక వికాసములెందున్నను వానిని స్వీకరించి మానవత్వమును ప్రబలజేసినది మన సంస్కృతియే.

భారతదేశము మన మాతృభూమి. ఇది కర్మభూమి, పుణ్యభూమి, స్వర్గమునకన్న మిన్న అని భావింతుము. 'ఇది దేవతలచే సంస్కరింపబడిన దేశ'మని మనువు నుడివెను.

"తమ పుణ్యకర్మముల ఫలితముగ పునర్జన్మమును
బొందవలసినపుడు దేవతలు భరతవర్షమునందే జన్మము
వాంఛింతురు." —విష్ణుపురాణము.

"వేలకొలది సంవత్సరముల యాధ్యాత్మిక చింతనమును, జీవితమును గలిగిన వ్యక్తులే భారతదేశమున జన్మించు నదృష్టమును బడయుదురు. తదితర దేశములకన్న భారత దేశమునందు జన్మించినవారికే ముక్తికెక్కుడవకాశములు గలవు. ఏలన: ఆధ్యాత్మిక చింతనములను, తపశ్శక్తిని బెంపొందించుకొను బెక్కవకాశముల నీదేశ మొసగును."

—రాధాకుముద ముఖర్జీ.

"భారతీయుల యాత్రాప్రాంతములు ఎత్తైన హిమవత్పర్వతములందును, నారికేళ వనరాజితములగు సముద్రప్రాంతములందును, లంకలందును, పర్వతగుహలు, లోయలందును, సాంద్రారణ్యములందును గలవు. ఈకారణమున యాత్రికులు తఱచుగ దేశమంతయు చుట్టి రావలసియుండును.

సంకుచిత రాష్ట్ర సంఘ భావములనుండి విముక్తిగావించి, విద్యావిహీనులగు సామాన్య ప్రజలందు గూడ విపుల విజ్ఞాన వివేకములను, సహన శక్తిని, రాజకీయాభివృద్ధిని బెంపొందించు నున్నత విధానమిద్దియే. ఇది భౌగోళి

కములగు హద్దులను విశాలమొనర్చి రాజకీయాభివృద్ధికి పునాదులు వైచును. తమ విశాల మాతృదేశము నేకదే శముగ గమనించి, ప్రేమించి పూజింపజేయును."

—రాధాకుముద ముఖర్జీ.

'ఓ గంగా యమునా గోదావరీ సరస్వతీ నర్మదా సింధు కావేరీ జలములారా! నే నర్చించు నీ జలమునందు మీరు ప్రవేశింపుడు' అనియే తన సంధ్యావందనమున ప్రతి యార్యుడును గీర్తించునది. తాను నివసించు చిన్న ప్రాంతమునుండి యావద్దేశము నామూలాగ్రముగ స్మరి యించుటయే యిందలి పరమార్థము.

భారతదేశమునందలి వివిధ జాతులు, భాషలు, మత ములు, సాంప్రదాయములుగన్న నివి దాని యేకత్వమును సుస్థిరములగు పునాదులపై గావించినవనియే ధ్రువపడును. జీవోన్నత స్థానమునకు పరిణామము గాంచినకోలదియు నవి యవయవ విభేదము విస్పష్టమగును. వివిధ కార్య ములకు భిన్న భిన్నావయవములు పూర్ణముగ నేర్పడును. శరీరమునందలి కన్ను, ముక్కు, చేయి, కాలు వేఱుగ నున్న నివియెల్లను శరీర సమష్టి పోషణ నిర్వహణమునందే మునిగితమ ప్రత్యేకవిధులనందులీనమొనర్చును. మొండెము వేరు, అవయవములు వేరు గాన శరీరికి ఏకత్వముగానీ,

వ్యక్తిత్వముగానీ లేదని వాదించుట యవివేకము, హాస్యాస్పదము. ఈ దేశమున వంగ,కళింగ,ఆంధ్ర, మహారాష్ట్రాది ప్రాంతీయులు వివిధభాషలతో వ్యవహరించుచున్నను, హిందూ బౌద్ధ జైన సిక్కు క్రైస్తవ మహమ్మదీయ మతస్థులున్నను వీరెల్లరు దేశ సౌష్ఠవమున కవసరమే.

ఒకే ప్రాంతమును, దానినిసమానముగా సేవించు నవకాశములే దేశనియమములు. ఒకే దేశమున నుండి, దాని నారాధించి, యది యొసగు ఫలితములననుభవించుచు, నభివృద్ధిగాంచు వారొకేభాష మాటలాడ నవసరములేదు. ఒకే దేవతనారాధింపవలసినయగత్యమునులేదు. భిన్నత్వమున నేకత్వమును గాంచుటే యున్నత సంస్కృతి నాగరికతల బ్రకటించును. వివిధరుచుల, రీతుల యాహారములు భుజించినను, నుడ్బాధను మాన్పి బలారోగ్యముల నొసగుటయే వాని ముఖ్యప్రయోజనము. నిత్యము మన జీవితములో గాంచున దిదియే. ప్రకృతి సర్వదా మనకు బోధించున దిదియే. దీనిని స్పష్టముగ గమనించియు సమ్మతింపకుండుటను, ఆచరింపకుండుట నేమనవలయునో మాకు గోచరించుటలేదు.

ఈనడుమ పాశ్చాత్యానపుపిడివాదములు ప్రబ్బరిల్లినవి. దేశమును ముక్కలుముక్కలుచేసెడు కుతంత్రములనుకొందరు

బలపరచియున్నారు. ప్రజలను వేరు వేరు చేయుచు ఐక్యమున కిది సాధనమందురు. దేశవిభజన యేదృష్టితోను పనికిరాదని పైన బేరొక్కొనిన కారణములు ధ్రువపరచుచున్నవి. అయిన నీవిషయమున పరదేశములెట్లు ప్రవర్తించినవో ఒక్కపరి తిలకింపుదము. గ్రేట్ బ్రిటన్, అమెరికా, జర్మనీ, ఇటలీ మున్నగు దేశముల చరిత్రను గాంచుదము.

స్వాతంత్ర్యోద్యమమునకు పూర్వము అమెరికా యేక దేశముగలేదు. అప్పటి పరిస్థితు లైక్యమున కనుగుణముగ లేవు. బొనిసలక్షణములు ఐక్యమును దూరపఱచును. "ఆంగ్లసంతతులమధ్య డచ్చి, జర్మన్, ఫ్రెంచి, స్వీడ్, స్కాచ్, ఐరిషుజాతులు భిన్నభిన్నములుగ వ్యాపించిపూర్తిగ విభేదములను ప్రబలజేసినవి. వివిధ ప్రభుత్వములు భిన్న లక్షణములను, భిన్నమత విశ్వాసములను, భిన్నవ్యాపార దృక్పథములను, సాంఘిక విభేదములను ప్రదర్శించుటచే విప్లవారంభమునందు వీరియేకత యసంభవమని పెక్కురకు గాన్పించెను." —లేకీ.

"ఉత్తరఅమెరికాయందలి వివిధములగు వలసప్రాంతములు అగ్నిజలములకన్నను మిన్నయైన భిన్నత్వము గలిగియున్నవి. పరస్పరము ప్రదర్శించు ఈర్ష్యాద్వేషముల కంతులేదు. జెర్సీలంకల వర్తకమునకై పెన్సిల్వేనియా

న్యూయార్కు నివాసుల యీర్ష్యాభివృద్ధికి అంతులేని యవకాశ మేర్పడెను. నడవడిలో, ఆచారమత విశ్వాసము లలో భిన్నత్వమును బ్రదర్శించు వలసలవారిని విచ్చలవిడిగ విడిచిపెట్టినచో – మానసిక తత్వము నాకుబోధపడినంత వరకు–దేశమందంతటను వెంటనే యంతఃకలహాములు చెల రేగెడివే. ఇట్టిసితినే ప్రబలనిచ్చినచో నీగ్రోలను, రెడ్ ఇండి యనులను నాతురతతో నంత మొందింప నెమురుచూచు చుండెడివారే."

—బర్నాబి.

"ఈ వలస ప్రాంతములను తమ తమ స్వేచ్ఛకు నేడో రేపో విడిచిపెట్టుచో అమెరికా రక్తప్రవాహ పూరితమై దారియు తెన్నునులేని దేశమయ్యెడిది."

—ఓటిస్.

జఫర్సన్ అమెరికా స్వాతంత్ర్య ప్రకటనమును గావించిన సమయమున నీగ్రోలు, నార్వే, ఫ్రెంచి, డచ్చి మున్నగు పెక్కు జాతులవారు పెక్కు భాషల మాట లాడుచు పరస్పర వైరుధ్యముగలిగియుండిరి. వాషింగ్టన్ కాలమున అమెరికాలో ఐక్యము లేనే లేదు. కెనడా వేరు గానే (నేటికిని) యున్నది. అబ్రహాము లింకను కాల మున నంతఃకలహాములు విచ్చల విడిగ చెలరేగెను. కొలదికాలము క్రితము క్లూక్లక్స్క్లాను ఉద్యమము ప్రబలి నీగ్రోలను, యూదులను, రోమను క్యాథలిక్కు–

లను వెడలగొట్టి తీవ్రప్రయత్నములు జరుగలేదా ? నేటికిని నీగ్రోలకు, రెడ్ ఇండియనులకు ప్రాతినిధ్యము సరిగలేదే ! అయినప్పటికి నమెరికా బలవత్తరమగు సంయుక్త ప్రభుత్వముతో వరిల్లుచుండుటలేదా ?

గ్రేట్ బ్రిటనులో శాక్సనులు, కెల్టులు, డేనులు, నార్మనులు శతాబ్దములకొలది నిరంతర పరస్పరయుద్ధము లతో హత్యలుగావింపుకొనుచు కాలముగడపిరి. ఇంగ్లండు స్కాట్లాండులు పారంపర్యముగ శత్రుదేశములు. టీ నదికన్నను మిన్నగ నీ రెండు ప్రాంతములను వీరి రక్త ప్రవాహమే విడివడ జేసెను. ఆ శతాబ్దములు ఎడ తెరపిలేని రక్తప్రవాహమును బహిరంపజేయుచు వచ్చిన వీరు ఆ శతాబ్దముల కితము మాత్రమే యేకదేశముగ కలియగలిగిరి. ఉభయులును నేడు గ్రేట్ బ్రిటనును తమ మాతృదేశముగ భావించి గర్వించుటలేదా ! ఇద్దాని స్వాతంత్ర్యమునకై తమ సర్వస్వమును ధారబోయుట లేదా ! గ్రేట్ బ్రిటనులోనే బ్రిటులలో మాటలాడిన భాషను వెల్ఛాసులలో మాటలాడరు. ఎబర్డీన్, రోండా జిల్లాలు వేరువేరు భాషలు మాటలాడుచున్నను ఆంగ్లేయులు తమ డౌనింగువీధి నుండి విశాల సామ్రాజ్యమును పాలించుచుండలేదా ?

తర

వివిధజాతులు, ప్రాంతములు గల యిటలీ దేశభక్తులు 'రోము' అను నేకనగరముక్రింద తమ జాతీయతను బ్రకటించుకొనిరి. ఇటలీని నేకదేశముగనే భావించి యందలి ప్రజలు తమ దేశభక్తిని బ్రకటించుచు దానియైక్యత్వమునకు తీవ్రకృషిని గావించుటలేదా!

జర్మనీలో నెక్కే మతమునకు జెందిన రోమను క్యాథలిక్కులు, ప్రొటెస్టెంటులు గొడ్డళ్ళతో సర్వదా తలలు బద్దలు గావించుకొనుచు, చిచ్చులతో కాల్చుకొనుచు, దారుణకృత్యములు గావించుచు జీవితములను గడపిరి. అయినను జర్మనీ యేకదేశముగాదా! అచటి ప్రజలు తమ పితృదేశాభివృద్ధికి నేకముగ కృషిగావింపరా!

ఈవిధముగ నెన్నియేని యుదాహరణములను జూప వచ్చును. పైన బేర్కొనిన ప్రాంతములు దేశము లెట్లయినవి? అందలి ప్రజలు దేశభక్తులుగ నెట్లుమారిరి? మనో వికాస ఐక్యభావపటిమచేతనేగదా! భావమే దేశమునందు ఐక్యమును జేకూర్చును. వాస్తవమునకు అమెరికా, గ్రేట్ బ్రిటన్, ఇటలీ, జర్మనీ యను నామములుగల ప్రాంతములు లేనేలేవు. అట్టిచోనివి దేశము లెట్లయినవి? పలు భీకర సంగ్రామములకు గురియైన వివిధ జాతులే జాతీయతను, దేశభక్తిని బ్రదర్శించుచు నభివృద్ధిని

గాంచుచుండ ప్రశాంత జీవితమును గడపు భారత దేశము ఒకే దేశము కాదని కొంద రేల ప్రచార మొనర్ప వలెను? ఐక్యము, సహజలక్షణ సామ్యము గల యిట్టి దేశమును వేరొక్కదానిని జూపుడు.

భారతదేశమున, పరప్రభువులు తమ యధికార ప్రాబల్యమును, నిరంకుశత్వమును నిలువబెట్టుకొనదలచి, 'విభజించి పాలించు' సూత్రమును సర్వదా యవలంబించి, కొందరు స్వార్థపరులను పైకెత్తి, దేశమున నైక్యము లేదని బోధించి విభాగమున కవకాశములేర్పరచిరి. జిన్నా నొక సాధనముగ వినియోగించుకొని పాకీస్థాన విభజనమును జేసిన దాంగ్లప్రభుత్వమే. కొంతకాలము అంబేద్కరు నగ్రస్థానమునకుంచి హరిజనులు హిందువులు కారను నవి వేర్పాటవాదమునుగూడ నాంగ్లప్రభుత్వము రేకెత్తించినది. కాని మనదేశనాయకుల యుదార త్యాగపటిమచే, విశ్వాస దానముచే నాయాట సాగనందులకు సంతసింపనగును. స్వయంనిర్ణయ సూత్రమనుసాకుతో మతపు పునాదులపై దేశమునువిభజింపవలెనను నసహజభావముల నలుమూలల ప్రవహింపజేసినదియునాంగ్లప్రభుత్వమే. మనలోకొందఱు స్వార్థపరులును మూర్ఖత్వముతో నిట్టి పిచ్చివాదములను సమర్థించిరి కాని స్వాతంత్ర్యసంపాదనముతో నివి మూల

బడ్డవి. ఐనను దేశము ముక్కచెక్కలుగా నుండవలసిన దేనా!

రష్యాలోని సంస్కృతి, స్వాతంత్ర్యము వేరు. పాకీస్థాన విభాగము వేరు. నేటికిని సోవియట్ రష్యాలో బెకు రాష్ట్రములకు విడిపోవుటకు హక్కులేనేలేదు.

భారతదేశము సర్వదా యేకదేశమే. ప్రతి భారతీయుడు దీనిని ప్రకటించి కీర్తింపవలెను. ప్రపంచ మిది వఱకే దీనిని గుర్తించెను. ఈయఖండ దేశభావమే భారతీయుల ధర్మము, ఆదర్శము, గమ్యస్థానము. ఇదియే సత్యము. దీనిని మనము సాధించి తీరవలయును.

ప్రథమమున భావసృష్టి. తరువాత దాని తీవ్ర ప్రచారము. తత్ఫలితముగ నీ భావమును మూర్తిమంత మొనర్చుట. ఇదియే ప్రతి భారతీయుని కర్తవ్యము.

దీనిని పాటించి పాలించిననాడే మన మాతృదేశము పున రుజ్జీవితమును బడసి సకలసంపదల కాలనాలమై విలసిల్లును. అందరకు క్షేమమును జేకూర్చి ఆనందము నందించును.

భారతీయ ప్రకృతి రహస్యము

'భారతదేశ మున్నదేశముగాన భారతీయులు సోమరులు, కామాతురులు, అని పెక్కురు పాశ్చాత్యులు వ్రాసిరి. దీనినిగూర్చి కొంచెమునిజానముగనాలోచింతము.

భారతదేశము ప్రకృతిసౌందర్యసంపన్నము. సిరిసంపదల కాలవాలము. ఈ దేశము తన యమూల్య ప్రకృతి సంపదను తన సంతతి కొసగుచున్నది. కావున భారతీయులు పాశ్చాత్యులవలె తమ నిత్యజీవితావసరములకు దేవులాడ నవసరములేదు. పొట్ట చేతబట్టుకొని పరుల వీడింపసక్కర లేదు. వారివలె నాహారమునకు శ్రమపడవలయు నగత్యము లేదు. అందువలన భారతీయులకెక్కువ విశ్రాంతి లభించుచున్న దనుట సత్యమే. కాని యిట్టి విశ్రాంతి లభించినది గావున వీరు సోమరులని పలుకుట సాహసము, అవివేకము. శారీరిక విశ్రాంతిని మానసిక వికాసమునకు విపులముగ వినియోగించినవారు భారతీయులే. కామచింతనమునకే శారీరికవిశ్రాంతిని వినియోగింపవలెననువాదస పాశ్చాత్యులకు పాడియేమో గాని భారతీయులకు మాత్రమట్టి తుచ్ఛభావములులేవు. ప్రకృతిచిత్ర విచిత్రమై సౌందర్యము, వికాసము, వికాసములను భారతీయుల కొసగుచున్నది.

కావునసే ప్రకృతి కన్యను భారతీయుడు మనసార తిలకించి ఆనంద సాగరమున మోలలాడుచున్నాడు.

భారత జీవిత విధాన విభాగసౌష్ఠవమును గాంచుము. బాల్యమున బ్రహ్మచర్య దీక్ష గైకొని, విద్యార్జనమును బూర్తిగావించు వఱకు నద్దానిని మనోవాక్కాయముల బాలింపవలెను. గురు సన్నిధానమున నీనిష్ఠను బలీయముగ బాలించుటయందే భారత విద్యావికాసము గలదు. కావున విద్యార్థి విధిపూర్వకముగ తన మనస్సును పవిత్ర విషయములందే ప్రవర్తింపజేసి వికసింపజేయును. గృహాశ్రమమునగూడ నిష్ఠతోగూడిన ద్వితీయ బ్రహ్మచర్యమును బాలింపవలెను. స్త్రీ సంభోగము కేవలము కామతృష్ణను దీర్చుకొనుటకు గాక సత్సంతానము బడయుటకే యని తలచి మెలగినవారు శరీర పోషణమునకు విశేష శ్రమ గావింప నగత్యములేదు గావుననే ఆత్మవికాసమునకు, ఆత్మోద్దీపనమునకు వారు కృషిగావించి ప్రఖ్యాతి గాంచిరి.

'పాశ్చాత్యులు సర్వదా శరీర శ్రమ గావింతురు గాన వీరికి నీచవాంఛలు, కామతృష్ణ తక్కువ'యని నుడువుట నీరసమగు వాదము. శరీర సుఖములకై పాటువడు వారియందే నీచభావములు, కామతృష్ణ, పాశవిక వాంఛలు విశేషముగ, విచ్చలవిడిగ ప్రబలుట సహజము.

భారతదేశపు ప్రకృతి సంపన్నయమే గాక సౌందర్య పూరితము. ఇందులకు భారతీయుడుకృతజ్ఞుడు. ప్రకృతికి సౌందర్యమును జేకూర్చునది దాని వివిధత్వమేగదా! సృష్టి వైచిత్ర్యమయము. భారతీయుడు ఈసృష్టివైచిత్ర్యమున సర్వదా లీనమై ఆనంద పరవశు డగుచుండును. అతడు ఉభయ సంధ్యలందు, రేబవళులందు, వివిధ మాసములందు, ఋతువులందు ప్రకృతిమాత్మగంభీరతను, సౌందర్యమును గాంచుచు దానితో నైక్యమగుచుండును. ప్రకృతిని సర్వదా – ధారారూపమగు ప్రేమతో పూజించి, యానందించుటయే భారతీయుని సహజస్వభావము. వీనిని 'ప్రకృతి పూజారి' యన్నను అతిశయోక్తిగాదు. ఇతడు సూర్యచంద్రులను, గ్రహనక్షత్రములను, భూమ్యాకాశములను, సముద్రతరంగములను, పర్వతశ్రేణులను, నదీ ప్రవాహములను, సాంద్రారణ్యములను గాంచి పవిత్ర హృదయముతో ఆత్మానుభూతి నలరచుకొనుచుండును. ఉషస్సంధ్యలు పవిత్రదృశ్యములు. ఇవి సచ్చిదానందమునకు దారిచేయు సోపానములు. పశుభావములను ప్రకోపింపజేయు శక్తులన్నిల్ల భారతీయుడు పవిత్రములుగ మార్చి ఆత్మోద్దీపనమున కాలంబనములుగ గావించుకొనును. పాశవికశక్తిని దైవికశక్తిగ మార్చును.

పవిత్రతలేని దేశమున వేదములుగాని, ఉపనిషత్తులు గాని, గీతలుగాని ఉద్భవిల్లవు. ఇందువలననే లోకమున 'సాధు హిందువు' అని వాడుకకూడ నేర్పడినది. ఈతడు తనచుట్టునుండు మానవులతోడనేగాక పశుపక్ష్యాదులతో - కీటకాదులతో - సకల జీవులతో - వస్తుసముదాయముతో సమరస భావమేర్పరచు కొనును. ఈ సమరసభావము స్నేహమును బెంపొందించును. సదాలోచనములను బలపరచును. సదాలోచనములు సత్కార్యములను బ్రేరేపించును. ప్రకృతియందలి నిఖిల వస్తుసముదాయముతో, జీవులతో నిరంతర సద్భావముతో మైత్రి గావించుకొనుటయే భారతీయుని లక్ష్యము.

భారతదేశమున నెక్కుభాషలు, తెగలు, మతములు గలవు. ఈ భిన్నత్వమునందు ఏకత్వమును గాంచుటయే భారతీయుని లక్ష్యము. ఇదియే భారతీయుని విజ్ఞాన వికాసమార్గము. హృదయవికాసపద్ధతి. ఈరహస్యమును భారతీయులతో పరిచయముగలవారు బాగుగ గమనింప గలరు. వివిధ దేవతలందు నొకే పరబ్రహ్మమును భారతీయుడు గాంచును. వేదకాలమునుండి నేటికిని నిరపరంపరగ వచ్చుచున్నది. నిశ్చలత్వమును, తీవ్రతమ చలనమును స్థూలదృష్టికి దుల్యములయ్యును గతివిషయమున

గడుభిన్నములు. పరమమూర్ఖుడును, పరిపూర్ణ జ్ఞానియు బాహ్యారూపమున సమానముగ గన్పింపవచ్చును. కాని వీరి తారతమ్యము మాత్రము విపరీతముగాదా ?

మానవుని యాంతరంగిక సౌష్ఠవమును, ఆత్మ వికాసమును గాంచినపుడే భిన్నత్వమును బ్రేమించి యందలి యేకత్వమును గమనింపగలము. ఏకరీతిగనుండు సమానాకృతులందు అందమెక్కడిది ? పాశ్చాత్యుల నాగరికత, విజ్ఞానము, కళ, సర్వాభివృద్ధియు నిట్టి సమానత్వమునే ప్రదర్శించును. ఇందందముగాని, మానసిక వికాసముగాని గన్పింపదు. దీనిని భారతదేశము హర్షించి స్వీకరించుట కల.

భారతీయుల నిత్యజీవిత విధానము

మానవ జన్మము బహుదుర్లభము. ఎన్నియో జన్మములు పశుపక్ష్యాది తిర్యగ్యోనుల కలిగినమీదగాని మనుష్య జన్మము లభింపదని భారత శాస్త్రములు పేర్కొనుచున్నవి. ప్రపంచమును శాసించు సర్వశక్తులును మానవ దేహమున సూక్ష్మరూపమును దాల్చి గుప్తమై యున్నవి. మానవ శరీరమునుగూర్చి విపుల పరిశోధనలు, ప్రశంసలు భారత శాస్త్రవేత్తలు గావించిరి. కేవలము అస్థి పంజర నిర్మాణమును, చర్మపు పొరల విషయము లును దెలిసినంతమాత్రమున శారీరిక శాస్త్రము దెలియు నని చెప్పజనదు. ఇందెన్నియో సూక్ష్మవిషయములు, తత్వములు లీనమై - పెనవైచుకొని యున్నవి. "శరీర మాద్యమ్ఖలు ధర్మసాధనమ్" అని పూర్వులు కీర్తించిరి. వారు సౌష్ఠవములగు నాహార విహారముల యాధారము లతో పరిశీలనలు గావించి, శాంత జీవితమును గడపి యానందము ననుభవించిరి. నేడు ప్రతివారు నశాంతి మధ్యమున - నగ్ని పర్వతములపై నివసించి దుఃఖమును, సంక్షోభమును జెందుచున్నారు. మన కబ్బిన యా యమూల్య జీవితమును శాంతియుతముగ - సుఖవంతముగ -

గావించుకొనజాలమా? శరీరమందలి యాంతరంగికోన్నత శక్తుల యనుభూతియే జీవితమునకు విలక్షణత నెసగి శాంతిని జేకూర్చును. నేడు శాంతిని గూర్చిన మాటల సందడి విశేషముగ గలదుగాని దానిని జేకూర్చు సుస్థిరాధారముల నిర్మాణమునకు చేయు ప్రయత్నములు మృగ్యము. అంతియకాదు. తద్వ్యతిరేక శక్తులును తాండవ మాడుచున్నవి.

మనుజుడు ఆహార విహార నియమములు బాగుగ పాలించి తృప్తి బడయవలెను. ఇది మొదటి ధర్మము. భారతీయుల సంస్కృతి నాగరికతలకిదియే మూలకందము. చక్కని బ్రహ్మచర్యము, శుచి యగు మితాహారములే సుఖ జీవనమును జేకూర్చును. శరీరమునకు పుష్టిని, తుష్టిని జేకూర్చి మానసిక వికాసమును, ఆత్మోద్దీపనమును గావించును. నేటి యువకులకు నిగ్రహములేని స్వేచ్ఛా విహారము, తుష్టిని పుష్టిని కలిగింపని పివి ధాహారములే నిత్య జీవనాధారము లైనవి.

పుస్తకపఠనమొనర్చుచు, గంభీరోపన్యాసముల నెసగి వా దోపవాదములు, తీవ్ర విమర్శనములు గావించుచు విద్యాధికులమని విర్రవీగినను, అధికారులమని యహంకరించినను, దళారి బేరములు గావించుచు ధనవంతులయి బొర్రలుపెంచినను, ఆహార విహార విషయములందు

నియమ నిగ్రహముల బాటింపని చో జీవితమున శాంతి గాని, సుఖముగాని పడయజాలరు.

ప్రాచీనులు బ్రహ్మచర్యమును తమ జీవితమున కంత టికి కేంద్రముగ - పునాదిరాయిగ గావించి యద్దానిని కడుంగడు శ్రద్ధతో పాటించి పాలించిరి. భారతీయ వర్ణాశ్రమములం దిది ప్రథమస్థానము నాక్రమించినది. బాల్యమున - విద్యార్థి దశయందు ప్రతివ్యక్తియు నిర్మల బ్రహ్మచర్యము నవలంబింపవలెను. ఇది లేనిదే విద్యాప్రబోధము గాని, విద్యాభ్యాసముగాని లేదు. యువకుడై, విద్యను పూర్తిచేయువఱకు మనోవాక్కాయములందు అష్ట దోషరహిత బ్రహ్మచర్యమును బూర్తిగ నవలంబించి యాచరింపవలెను. స్త్రీని స్మరించుట, కీర్తించుట, ఆటలాడుట, చూచుట, రహస్యముగ మాటలాడుట, తలంచుట, నిశ్చయించుట, సంభోగము అను నెనిమిదియు దోషములే. ('స్మరణమ్, కీర్తనమ్, కేలిః, ప్రేక్షణమ్, గుహ్యభాషణమ్, సంకల్పోఽధ్యవసాయశ్చ, క్రియా నిష్పత్తిరేవచ') బ్రహ్మచర్యము లేనిచో నాధ్యాత్మికాభివృద్ధినే గాక, కేవల నిత్యజీవితాభివృద్ధినైన గాంచుట కవకాశమే లేదు. వేదఋషులు దీనిని పాలించి, మంత్ర ద్రష్టలై ముక్తిగాంచిరి. ప్రాచీనార్య సంతతికి జెందిన

ప్రతివాడు దీనిని పాలించితీరవలసినదే. శక్తిని బడయనలె
నన్న బ్రహ్మచర్యమవసరము.

మనోవాక్కాయ కర్మలతో నెల్ల యవస్థలయందు సంభోగమును విడుటయే బ్రహ్మచర్యము. ("కాయేన మనసా వాచా సర్వావస్థాసు సర్వదా సర్వత్ర మైథున త్యాగమ్ బ్రహ్మచర్యమ్ ప్రచక్ష్యతే") —యాజ్ఞవల్క్యుడు బ్రహ్మచర్యపాలనము నాలుగువేదములు చదివినంత ఫలము నిచ్చును. ('ఏకతశ్చతురోవేదాః బ్రహ్మచర్యంతథైకతః')

శక్తిలేనివాడేకార్యమునగానిసఫలీకృతుడుగాజాలడు. శక్తిలేనివానినెలరు హీనునిగనే జూతురుగాని గౌరవింపరు. ఆత్మయు దుర్బలునికి లభ్యముగాదు. ("నాయమాత్మా బలహీనేనలభ్యతే"...—శ్రుతి.) శీలసంపత్తికినిదియే ప్రధానము. ఇంద్రియ నిగ్రహము బ్రహ్మచర్యమనబడును. ఈ యింద్రియ నిగ్రహమునుండియే సర్వశక్తులు నుద్భవిల్లుచున్నవి, ఓజస్సే సర్వశక్తులకు మూలము. వీర్యము నిశ్చలతజెంది, బిందురూపమును దాల్చినగాని ధారణాశక్తి గలుగజాలదు. ఈశక్తిలేనిదే కన్ను కాంచజాలదు. చెవి యాలకింపజాలదు. మనస్సు పనిచేయజాలదు. బుద్ధి నిర్ణయింపజాలదు. ఒక్క బిందుపతనము ప్రపంచమున నొక నూతనజీవిని సృష్టించుచున్నది. దాని నిగ్రహము

మోక్షము నెసగుచున్నది. ('మరణం బిందుపాతేన జీవితం బిందు ధారణాత్')

శాంతిని, కాంతిని, స్మృతిని, జ్ఞానమును, ఆరోగ్యమును, మంచిసంతతిని కోరువారు బ్రహ్మచర్యమును పాలింపవలయును. ('శాంతిం కాంతిం స్మృతిం జ్ఞానం ఆరోగ్యం చాపి సంతతిం యఇచ్ఛతి మహాదరం బ్రహ్మచర్యం చరేదిహ') —ధన్వంతరి.

ఇంద్రియనిశ్చలత, ఊర్ధ్వ రేతస్కతలే ఆత్మోద్దీపనమును జేకూర్చునవి. ఇందువలననే 'విద్యార్థి దశయందు పరిపూర్ణ బ్రహ్మచర్యముతోబాటు గృహస్థాశ్రమమునగూడ ద్వితీయ బ్రహ్మచర్యమును విధిగనియమించిరి. సంతానమును బడయుటకును, ధర్మార్థములను సాధించుటకు మాత్రమే స్త్రీ పురుషుల సాంగత్యమును విధించిరి గాని కేవల కామతృప్తిను దీర్చుకొనుటకు మాత్రమే గాదు. కామి ఆర్యసంతతికి జెందినవాడు గాడనియే మన పూర్వుల స్థిరాభిప్రాయము.

నవీన నాగరికతా వ్యామోహ పరవశులు బ్రహ్మచర్యమును అసంభవమనియు, నసహజమనియు భావించుట విచారకరము. 'బ్రహ్మచర్యమస్వాభావికము. దాని నవలంబించువారికి బెక్కుజాడ్యములుగూడ గలుగును.'అని

వాడింతురు. ఇట్లు వాదించువారికి బ్రహ్మచర్యమన
నేమియో తెలియ దనియు, వా రందలి సౌష్ఠవసౌభాగ్య
ములు గ్రహింపజాల రనియు చెప్పగలము. కేవలము స్త్రీ
సంభోగమే మైథునముగాదు. పైన బేర్కొనిన యష్టవిధ
ములగు మైథునములు విసర్జించుటయే బ్రహ్మచర్యము.
స్త్రీ పురుషులు_ముఖ్యముగ యువతీయువకులు_ఏకాంత
విలాసములు గావించుచో కామోద్రేకమునకు గురిగాక
మానరు. నవీనుల స్వేచ్ఛావిహారములు బ్రహ్మచర్య
నాశమునకు దారిదీయును. నేటి మనయువకులు నూటికి
ఎనుబదిమంది ప్రమేహవ్యాధులకు గురియగుట విచార
కరము. వీరియం దింద్రియపటుత్వము, దృఢత గానరాదు.
ఉద్రేకము వీరికింద్రియ పతనము గావించుచున్నది. ఇట్టి
వారి సంతానము దుర్బలమై, మనోనిగ్రహ శూన్యమై
శరీరవ్యాధులకు, మానసిక చంచలత్వమునకు గురిగాక
యేమగును ? అందువలననే స్వకీయాభివృద్ధియందు మైకు
రకు గాఢమగు విశ్వాసముగాని, ప్రయత్నముగాని,
పట్టువలగాని కానరాదు. అంతియగాక యనేకు లల్పా
యుస్సుననే భూలోకమును వీడవలసిన వారగుచున్నారు.

నేడు లోకమున సంతాన నిరోధ తాపత్రయము
ప్రబలినది. పెక్కుఁరు శాస్త్రవేత్తలు దీనిని శాస్త్ర సమ్మ

తముగ వాదించుటయు, ఆర్థిక వేత్తలనువారు దారిద్ర్య నిర్మూలనసాధనముగ ప్రదర్శించుటయు విచారకరము. ఇది దుర్బలులు, కామతృష్ణాపరులు గావించు వాదనయనియే నా భావము. నగ్నచిత్రములు, సినిమా యందలి నగ్న ప్రదర్శనములు, స్త్రీ పురుషుల కామ విహారముల ప్రకటనములు నేడు ప్రబలినవి. ఇవియెల్ల కామతృష్ణను, ఉద్రేకమును బెంపొందించునేగాని జాతికి పటుత్వమును, ఔన్నత్యమును జేకూర్చగలవా? నవీన నాగరికులు అదుపు లేని స్వేచ్ఛావిహారులైరి. ప్రాచీనుల శరీర సౌష్ఠవము, మానసిన వికాసము నేడు భ్రష్టత గాంచినవి. ప్రాచీనులందు గర్వింపదగిన బ్రహ్మచర్య శక్తుల సౌష్ఠవ వికాసములు నేడు నామమాత్రములైనవి. నేటి యువకులందు ధీశక్తి, మనోనిగ్రహములు శూన్యములు. నిశ్చలత, శాంతి నశించినవి. కార్యదక్షత లేదు. ఉద్రేకావేశములు పెచ్చు పెరిగినవి. నిరాశ, అపజయములు తాండవమాడుచున్నవి. కష్టసహిష్ణుత లేదు. సంకల్పము సన్నగిల్లినది. వీరు కేవలము దుర్బలులగు బానిసల సృష్టించుయంత్రములుగ నున్నారు. పరులు త మ్మాసడించి యవమానాపకారములకు గురి గావించుచున్నను, దానికి ప్రతిక్రియ గావించు మనో భావముగాని, సమాధాన మొసగు ధైర్యసాహసములు

గాని వీరికి లేవు. అవమానముల నందుకొని యూహ్యానిం చుటయే యీ దుర్బలజాతికి ప్రకృతియయినది.

ఇక నేటి మన నిరంతర ప్రయాణములు గాంచుడు. రైళ్ళలో, మోటారులలో గావించు తీవ్ర సంచారములు గాంచుడు. నరముల గదలించి, సడలించి యలసటను, ఆయాసమును, నిరుత్సాహమును బెంపొందించి శీఘ్ర మరణమునకు దారిదీయుచున్నవి. ఇంచువలన జీవిత నిర్వ హణమునకు నిత్యము పోరాటము గావించు శక్తికూడ లేక దరిద్రులై, శుష్కించి మరణించుచున్నారు.

ఇక నాహారవిషయము నాలోచింపుడు. ఆహార శుద్ధి యున్నయెడల నిర్మల బలముగలుగును. ("ఆహార శుద్ధౌ సత్వశుద్ధిః") యుక్తములగు నాహార విహారములు గల వానికే దుఃఖ నాశకమగుయోగము లభించునని భగవద్గీత చెప్పుచున్నది. ("యుక్తాహారవిహారస్య యోగోభవతి దుఃఖహా") కావున మన శరీరమునకు పుష్టిని, తుష్టిని జేకూర్చి సౌష్ఠవ వికాసముల నొసగు శుభ్రమగు నాహా రము మనకవసరము. శారీరిక సౌష్ఠవ నిర్మాణ నియమ ములే యాధ్యాత్మిక వికాసమునకు దారిదీయును. మనము భుజించు నాహారము, త్రాగు నీరు, పీల్చు గాలి వీనినుండి సారమును స్వీకరించి యన్నమయ కోశము పోషింపబడు చున్నది.

మరియు మన చుట్టునుండు జీవులనుండి వెలువడు సూక్ష్మాణువులుగూడ దీనికి తోడ్పడును. మనశరీరములు నిర్జీవపదార్థములనుండి సృష్టింపబడలేదు; పోషింపబడజాలవు. ప్రతి పదార్థమునందును నిగూఢ జీవశక్తులున్నవనియు, జీవకణములేని పదార్థము లేనే లేదనియు భారతీయుల శాస్త్ర నిర్ణయమును, దృఢ విశ్వాసమును గూడ. పదార్థము జీవాణువుల కలయికయే. ఒక స్వల్ప రజఃకణము పెక్కు సూక్ష్మజీవుల కూడికయే. ఒక రజఃకణమును 'దూరదర్శిని'తో బరీక్షించిన నందు పెక్కు సూక్ష్మజీవులు గన్పించును. మన శరీరమిట్టివాని సమ్మేళనమే. మననుండి సర్వదా యిట్టి సూక్ష్మజీవులను బయటికి విడచుచుందుము. లోపలికి స్వీకరించుచుందుము. మన మూర్ఖోగ్యమును వాంఛించుచు, శుభ్రమగు జీవాణువులను స్వీకరించుచు నశుభ్రములగు జీవాణువులను వెలికిబంపవలెను. మనము స్వీకరించుసర్వము శుచిగ, శుభ్రముగ, చైతన్యవంతముగ నుండవలె ననునదే భారతీయుల విశ్వాసము.

సర్వాణువులు జీవిత చైతన్య వికాసముల జెంది క్రమముగ నశించుట ప్రకృతి నియమము. ప్రతిది నిర్మాణావసను జెంది క్రమముగ శిథిలమగును. శుభ్రమగు నాహారమన జీవాణువులు గలిగిన - వికాసమును - అభివృద్ధిని

ఈయగలిగిన యణువ్రుల సమూహమేగదా! లేత యాకులు, కూరగాయలు, పండినపండ్లు, పక్వమైన గింజలు, దుంపలు మున్నగువానికి ప్రాణమును, జీవిత వికాసమును నుండును. వీనిని భుజించిన మనశరీరము గూడ జీవిత వికాసాభివృద్ధుల బడయును. ఇట్టివి వాడినను, ఎండినను, కుళ్ళినను వానియందలి జీవితము నశించునుగాన నా యాహార మశుభ్రత జెందును. ఇట్టి చచ్చుపదార్థములు జీవితమును నిర్మింపజాలవు.

మాంసము చచ్చినజంతువ్రులనుండి లభించుపదార్థము. వాని ప్రాణము పోయిన వెంటనే యిది నిర్జీవపదార్థమగును. కనుకనే కొలది కాలమునకే కుళ్ళి దుర్వాసన గొట్టును. కావున శిథిలానస్థ నందును. కాబట్టి మాంసాహారము జీవిత నిర్మాణమునుగాని, వికాసమునుగాని కలిగింపజాలదు. కందమూలములు, శాకఫలములు మున్నగు వానివలె మాంసాహారము శరీర జీవిత వికాసము నెసగ జాలదు. మాంసాహారమున నిర్మాణశక్తిగాని, జీవితముగాని లేదుగాన నద్దానిని భుజించువారు శీఘ్రముగ వ్యాధులకు గురియగుదురు. దీనిని భుజించిన గాయములు త్వరగ మానవు. జ్వరతీవ్రతయు శీఘ్రముగ నెక్కువగును.

ఇదేవిధముగ నిర్మల ద్రవపదార్థములును, శుభ్రమగు నీరమును ఆరోగ్యమును జేకూర్చును. పాలలో జీవకణ

ములు విరివిగ గలవు. కాన శరీర నిర్మాణమునకు, పుష్టికి నివి మెండుగ దోడ్పడును. మాగిన ద్రవములు అనారోగ్యకరములు. సారాయములు, మద్యరసము లిట్టివి గాన నివి శరీరమునకు హానిగావించును. వీని ద్రవము మాగి జీవకణములను నశింప జేయును. ఇది మనస్సును మాంద్యపఱచును. బుద్ధివికాసమునకు విషముపెట్టును. వేడి దేశములలో నివి మఱింత వేగముగ జీవిత నాశనమొనర్చును.

శుభ్రమగు గాలిలో ప్రాణవాయువుండును. మనము విషపుగాలిలో బొగ్గుపులుసుగాలి యుండును గాన దానిని దూరముగ వెడల గొట్టుటకు విస్తారమగు వాయువులేక-మరల దానినే పీల్చిన ననారోగ్య మేర్పడును. ఇంతియ గాక వెలుపలికి విడిచినగాలిలో చచ్చిన కణములుండును. వీనినే మరల పీల్చిన నవి మన శరీరమునకు హాని జేకూర్చును.

నేటి మన యాహారమును గాంచుడు. ఇది యారోగ్యకరమైనది గాదు. జీవకణములతో శరీరనిర్మాణమును గావించునదిగాని, పుష్టిని జేకూర్చునదిగాని కాదు. నేడు మనము విచ్చలవిడిగ భుజించు నాహార మశాస్త్రీయము. యంత్రములలో తయారైన తెల్లనిబియ్యమును నేటి

నాగరికు లనువారు విరివిగ వాడుచున్నారు. యంత్రపు టొరపిడిచే నందలి జీవాణువులు నశించుచున్నవి. పుష్టి నొసగెడు పదార్థములలోని సున్నము, భాస్వరము, మాంసకృత్తులు మున్నగు వాని నీ యంత్రములు లాగి వైచి పిప్పిని మాత్ర మొసగుచున్నవి. వీనిని భుజించుట చేతనే కాలి తీపులు, ఒడలి నెప్పులు, పొట్టలు పెరుగుట మున్నగు వ్యాధులు దేశమున ప్రబలినవి.

జావాపంచదార తెల్లగ కంటి కింపుగ నుండును గాన నింపుగ ప్రేమించి మెండుగ వాడుదుము. ఇది వెదురు, చెఱకుల సంయోగముచే నేర్పడిన సంకరజాతి చెఱకుగడది. ఈ చెఱకు రసమును శుభ్రపఱచుటలో పటిక, సున్నము, నీలిమంపులు విశేషముగ వాడబడుచున్నవి. ఇవియు జీవాణువుల నాశ మొనర్చు పదార్థములే. గడినేయి, కృత్రిమ తైలము, డబ్బాపాలు మున్నగునవి శరీర పటుత్వమును పాడుచేయుచున్నవి. దుర్బలత్వమును త్వరగ జేకూర్చి, జాతి క్షీణతను బెంపొందించుచున్నవి. మనము మంచుగడ్డనుగూడ విరివిగ వాడుచున్నాము. తత్ఫలితముగ దంతముల తీపులు, శీఘ్రముగ నూడిపోవుట జరుగుచున్నవి. గొంతు నెప్పులు ప్రబలుచున్నవి. సోడా, లెమనేడ్ మున్నగు పానీయము లెల్ల బొగ్గు ద్రవసమ్మిళితములే

గదా? ఇవి చేయని యపకారము లేవి? తేయాకు నందలి టానిన్ అను విష పదార్థము విష జ్వరముల ప్రబల జేయును. కాఫీయందలి కాఫిన్ మలబద్ధకమును, మాంద్యమును గలిగించును. పొగబీల్చుట ఫ్యాషనుగ మారినది. తత్ఫలితముగ నూపిరితిత్తుల వ్యాధులు, క్షయ ప్రబలుచున్నవి. మద్యరసము, సారాయము, మాంసాహారములు మానవులను దుర్బలులుగ గావించి, కామ క్రోధముల ప్రబలజేయుచున్నవి. ఇట్లు సర్వవిధముల నేటి యాంగ్ల నాగరికత మనలను నిర్వీర్యులగు బానిసలుగ గావించినది. మైకము జెందిన యవివేకులుగ తయ్యారు చేసినది.

మన వస్త్రములకు వేయు కృత్రిమ వర్ణములన్నియు వానియందలి శుభ్రతను నాశముచేసి మన శరీరములను పాడుచేయుచున్నవి. మనము ధరించు కాలి జోళ్ళు మన కమితముగ నష్టములను గలిగించుచున్నవి. ప్రాచీన భారత జీవితము నొక్కపరి విలోకింపుడు.

ప్రాచీన ఋషులు ఏ నదీ ప్రాంతములందో కుటీరములు నిర్మించుకొని నివసించిరి. వారు కంద మూల ఫలములు భుజించి పాలు ద్రాగెడివారు. నిర్మలమగు ప్రవాహజలముల స్నానమాడెడువారు. ప్రవాహజలమునేగ్రోలెడివారు. శుభ్ర

మగువాయువును బీల్చుచు పగలెల్ల చెట్లక్రింద కాలక్షేపము గావించెడివారు. పగలు చెట్లు ప్రాణవాయువును విడిచి, బొగ్గుపులుసు వాయువును గ్రహించునుగాన, వీరు బొగ్గుపులుసువాయువును విడిచి, ప్రాణవాయువును విస్తారముగ బీల్చు నవకాశముండెడిది. రాత్రులు కుటీరములందు నిద్రించెడివారు. వీరు బ్రహ్మచర్య వ్రతమును విధిగ పాలించిరి. ఈ విధముగ నాహార విహారములందు ప్రాచీన భారత జీవితము మాధుర్యమును, ఆరోగ్యమును, కుప్తతను గలిగి ఉన్నతమై - శాస్త్రసమ్మతమై - విపుల విశ్రాంతిని, పూర్ణశాంతిని ఇచ్చెడిది. వారు జాతిని పటుత్వవంతముగ - తేజోవంతముగ - నెనర్చి, ధైర్యసాహసముల కావలవాలము గావించిరి. విజ్ఞానమున కాటపట్టుగ జేసిరి. వారి యాలోచనములు ఉన్నతములు. జీవితము కుప్తము. ఈసౌష్ఠవమునే గ్రామనిర్మాణమున గాంతుము. వ్యవసాయవృత్తి, విశాల గృహములు, విహార ప్రాంతములు, ప్రాణశక్తి పూరితాహారము, దంపుడు బియ్యము, కోమలమగు శాకములు, ఆకు కూరలు, శుభ్రమగు పాలు, స్వచ్ఛమగు జలము, అనంతమగు శుభ్రవాయువు నెల్లరకు కావలసినంత సర్వదా లభించెడివి.

నాగరికత యనగనేమి?

పాశ్చాత్యులలో గ్రంథకర్తలు, చరిత్రకారులు, శాస్త్రవేత్తలు, మతబోధకులు పెక్కురు పెక్కు విధములగు తమ తమ చిత్తవైఖరి ననుసరించి నాగరికతను బెక్కు రీతుల నిర్వచించిరి. కాని వీరెల్లరు ప్రాగ్దేశముల వైలక్షణ్యముల గుర్తింపములో మాత్ర మేకీభవింతురు. కావున తామెట్లు ప్రవర్తించిన నదియే నాగరికతయని వీరిభావము.

"న్యాయము, మానవత్వము, జీవకారుణ్యము, ఇతరుల సమాన దృష్టితో గాంచి గౌరవించుట అనాగరకుల చిహ్నములు."

—హెవు బెల్లు.

"ఆంగ్లో క్రైస్తవ మతబోధకులు యూరపునందలి యితర జాతుల చరిత్రలనన్నిటి నీసడించుకొని వారిని క్రైస్తవ మతమున జేర్చుకొనిరి."

—బక్‌ల్.

తమ సాటివారగు ఐరోపీయుల యెడనే యిట్లు ప్రవర్తించిన యాంగ్లేయులు ఇక ప్రాగ్దేశీయులయెడ నెట్లు ప్రవర్తింతురో వేరుగ నుహువవలెనా? వారితరుల సుగుణములను గ్రహించు ప్రయత్నమైన గావింపకయే తమకర్థము గాని వెల అనాగరిక విషయములు, లక్షణములు అని నిర్ణయింపసాహసింతురు. ప్రపంచమండలి సర్వనాగరికత

లను పాశ్చాత్య నాగరికత చుట్టును ప్రదక్షిణము చేయు గ్రహములుగ వీరు భావించిరి.

భిన్న నాగరికతలను వానియందలి గుణములనుబట్టి నిర్ణయించి గౌరవించుట విజ్ఞానుల లక్షణము, ధర్మము. అదృష్టవశమున కొంతమంది పాశ్చాత్యులు తమ దృష్టితో గాక ప్రాచ్యులను వారి దృష్టితో బరించి ప్రదర్శించుట శుభసూచకము. నాగరకతను దాని ప్రధాన లక్షణము లను బట్టియే నిర్వచింపవలెను.

నాగరికత యన 'ధర్మమయమగు సక్రమ జీవితవిధానమును, తత్ఫలితములును' అని నుడువవచ్చును.

మానవ శ్రేయస్సును జేకూర్చు ఆదర్శాచరణముల సమ్మేళనమే సంస్కృతి. అనగా జ్ఞానమును ధర్మమునైక్య పఱచుటయే గీతాభావము. భౌతిక మానసిక ఆధ్యాత్మిక శక్తుల పూర్ణాచరణ ఫలితమే శ్రేయస్సు. సంస్కృతి పరమావధి స్వాతంత్ర్యసిద్ధి, స్వాతంత్ర్యజీవనము. సర్వేంద్రియముల సన్నిహితాభివృద్ధుల సమష్టి రూపమే సంస్కృతి యని భావము.

ఋజుమార్గము మానవుని శాంతి ప్రియునిగ గావించి సాంఘిక జీవితము నభివృద్ధికి దెచ్చును. ఈ యభివృద్ధియే ప్రవర్తనమును నిర్ణయించునది. సమానత్వము, ఐక్యము

నున్న తావ్రున నహంకారమునకును, అతిశయమునకును స్థానముండదు. స్నేహ సహనముల బెంపొందించుటయే నాగరికతా విశేషము. ఇదియే సంఘమును సౌష్ఠవముగ నున్నత సోపానమున నధిరోహింపజేయును. 'రక్షణకు, సుఖ జీవనమునకు గావించుకొను నెడంబడికయే స్నేహ' మని థామస్ హాబ్సు మున్నగువారు నుడివిరి. ఈ విధానము విధులకన్నను హక్కులకే యగ్రస్థాన మొసగును. నీతికంటెను రాచటికపు హక్కులకే ప్రాధాన్య మొసగును. ఇది బాహ్యాడంబరముల బలపజేయునే గాని యాంతరంగిక శుద్ధికి తోడ్పడదు. జ్ఞానమును బెంపొందింప వచ్చునుగాని సత్ప్రవర్తనమునకు దారిజూపదు.

'పాశ్చాత్యులది పాశవిక నాగరికత. ప్రాచ్యులది సాంస్కృతిక నాగరికత.' —ఆచార్య యల్. పి. జాక్సు.

పాశవిక నాగరికత ప్రపంచమును దోచుకొని నాశ మొనర్చును. ప్రపంచమునొక చైతన్య రహిత యంత్ర ముగ భావించి దానిని దోచుకొనును. సాంస్కృతిక నాగరికతయో ప్రపంచమును చైతన్య స్వరూపముగ భావించి, మానవాభివృద్ధికి దోహద మొసగుచు నద్దానిని ప్రేరేచి పూజింపజేయును.

పాశ్చాత్య నాగరికత ప్రేయమును, ప్రాచ్యనాగరికత శ్రేయమును బెంపొందించును. ప్రేయము ప్రపంచమును సర్వదా పీల్చి, పిప్పిచేసి యనుభవింపజేయును. ఇది అసురశక్తిని ప్రబలజేసి, స్వార్థమును, ఈర్ష్యాద్వేషములను ప్రజ్వలింపజేయును. భోగమును బెంపొందించును. ప్రపంచమునంతటిని కబళింప జూచును. శ్రేయమో! ప్రపంచమును ప్రేమించి వికసింపజేయును. మానవు నద్దానితోగూడివిహరింపజేయును. స్వార్థమునుమరపించి, అన్యోన్యప్రేమను బెంపొందించి త్యాగసంపద నభివృద్ధికి దెచ్చును. ఆధ్యాత్మిక శక్తులను వికసింపజేయును.

ప్రాచీనకాలమునుండియు భారతనాగరికత అంతరంగిక వికాసమునకు దోహద మొసగి, స్వార్థమునకు స్వస్తి చెప్పి పరమార్థమునకు ప్రాధాన్య మొసగెను. మానవుడు పాపి గాక పవిత్రుడు, సన్మార్గు డనియే భారతీయుల భావము. అప్పుడప్పుడజ్ఞానావరణముచే స్వార్థము ప్రకోపించినను, నద్దానిని త్రోసివైచి, వారుసౌహార్దమునే ప్రబలజేయ బద్ధకంకణులైరి. ఆత్మయందు సర్వభూతములను, సర్వభూతములందు ఆత్మను గాంచువాడు ఎవ్వరిని ద్వేషించును? విద్వాంసుడుగ భావింపబడు సామాన్య భారతీయునకుగూడ సత్యము నిత్యాచారగతము. భార

తీయుడు హక్కులకు ప్రాకులాడక నిజధర్మనిర్వహణము నకే నిరంతరకృషి గావించును. కావుననే రాజకీయాధికారముకన్న నీతియే వీరి జీవితమున విస్తరించినది.

నాగరికతను ఫలితమని నుడివితిమి. పాశ్చాత్యుల నాగరికత భోగముల ననుభవించుటయే. కాన వారు భాగ్య భోగ్యములకు బ్రాకులాడి, పరులను విచ్చలవిడిగ కొల్లగొట్టి, దోచుకొని యనుభవించుటయే నాగరికతాభివృద్ధిగ గణించిరి. శరీరమందలి సర్వావయవములు పరస్పర సహకారము గావించుకొనునట్లే నాగరికతయందలి వివిధాంశములు పరస్పరానుకూలముగ నుండవలెను. వ్యవసాయము, వాణిజ్యము, లలితకళలు, శాస్త్రములు, మతము మున్నగునవి నాగరికతకు ప్రధానాంగములు. వీనిలో వివిధ శాఖలుండవచ్చును.

"నాగరికత భౌతిక వస్తురాశి గాదు. ఆర్థికసంపదయు గాదు. సైనికబలమును, సామ్రాజ్యవిస్తరణమునుగూడ గాదు. కేవల పుస్తకపఠనమును గాదు. గొప్ప శాస్త్రవేత్తలు అనాగరికులపలె దోచవచ్చును. అయోమార్గములు, విమానములు, సముద్రపు రేవులు, నావలు నాగరిక జీవితమునకు సంబద్ధములు గావు."

—హెన్ట్రిక్ విలియమ్ వేన్ లూడ్.

పైన బేర్కొనిన సంపదలు నాగరికతయందు ప్రత్యేక స్థానమును - ప్రాధాన్యమును బడయవచ్చునుగాని యివి లేని వా రనాగరికులని నుడువుట యవివేకము.

కృషి, వ్యాపారములు నాగరికతకు ప్రధానాంగములై నంతమాత్రమున 'వ్యవసాయనాగరకత', 'వ్యాపారనాగరకత' యని చెప్పము. శరీరమునకు సర్వాంగము లవసరమయినంతమాత్రమున 'ముక్కుమనిషి', 'పొట్టమనిషి', 'కాలిమనిషి' అని నుడువుట హాస్యాస్పదము గాదా! శరీరమందలి అవయవములవలెనే సక్రమమగు ప్రధాన లక్షణముల పొందికయే నాగరికత. ఈ లక్షణములలో నెద్దాని నెన బలవంతముగ నితరులపై నంటగట్టిన నది వారియం దిముడక వికార రూపమును దాల్చును. పరుల లక్షణములు మనయందు చక్కని పొందికతో నందముగ నిమిడినప్పుడే వానిని స్వీకరింపవలెను. భిన్ననాగరికతల క్రమమగు పొందికయే జీవితవికాసము. దగ్గర పోలికలుగల జాతి చెట్ల కంటు గట్టవచ్చును గాని మామిడికిని, మఱ్ఱికిని అంటు గట్టవచ్చునా? ఒకే యాదర్శముగానీ, దానికి సన్నిహిత సంబంధముగానీ గల జాతుల నాగరికతల కలయిక కవకాశము గలదుగాని వ్యతిరేకాదర్శములుగల నాగరికతల నొకరిపై నొకరు బలవంతముగ నంటగట్టజనదు. అట్లు గావించిన వికృతఫలితములే లభించును.

భారత నాగరికతకు ఉదా రాశయములు, ఉన్నతాద
ర్శములు ప్రత్యేక లక్షణములు. ఇందలి సర్వాంగము
లీదేశమునందే యుద్భవిల్లెను. పరలక్షణములు తనయందు
క్రమముగ నిమిడినపుడు వాని నలంకారములుగ స్వీక
రించెను. దురదృష్టవశమున పరులు పెక్కుఁరీ దేశముపై
క్రూరములగు దాడులుగావించిరి. మననాగరికతను భగ్న
మొనర్ప బెక్కు క్రూరకృత్యములు గావించిరి. తమ
నాగరికతను బలవంతముగ నంటగట్టు దుష్టమార్గముల
నవలంబించిరి. కాని భారత నాగరికతలో ప్రత్యంగము
నను శక్తిమంతముగు చైతన్య ముండుటచే నిట్టి ప్రయత్న
ములెల్ల భగ్నమాయెను. నేటికి నిది తన ప్రాచీన ప్రాభవ
మును ప్రదర్శించుచునే యున్నది.

పాశ్చాత్యులకు ప్రాచీనతగాని, ప్రాచీన వస్తువులు
గాని పనికిరావు. సర్వదా నూతన వస్తు విషయములు
వాంఛింతురు. నూతనోత్పత్తులు, ప్రదర్శనములు గావించి
సంతతము మార్పులు వాంఛింతురు. వీరికి మార్పేయభివృద్ధి.
'అభివృద్ధియన ముందునకునడచుట. ప్రగతి యన వెనుకకు
బోవుట యని, వెనుకకుబోవుటయన గతకాలమునందువలె
జీవించుట యని, గతమును ద్రోసిపుచ్చి మార్పును వాంఛిం
చుటయే సరియనియు' పాశ్చాత్యుల మానసిక తత్వము.
వీరి శాస్త్రజ్ఞానము, కళాభివృద్ధి దీనినే ప్రదర్శించును.

'భారతీయులు తమ ప్రాచీన వైభవములను, ప్రాచీన జ్ఞానసంపదను గుర్తించి వానిని తమ జీవితమున జీర్ణించుకొనుచున్నారు గాన వీ రనాగరికులు. వీరికి నాగరక లక్షణములున్నచో మార్పునేల వాంఛింపరు?' అని కొందరు పాశ్చాత్యులు వాదింతురు. కాని భారతీయులు ఈ పరిణామము తాత్కాలిక మనియు, క్షణభంగుర మనియు భావింతురు, 'పశుబలమే యోగ్యము' అను భావముతో పాశ్చాత్యులు నేడు ప్రపంచమున ప్రబలిరి గాన నదియే యభివృద్ధియని వా రనుకొనవచ్చును.

'పశుబలమే యీ ప్రపంచమును పాలించుచున్నది. ఇకముందును సర్వకాలము పాలించుచుండు ననుట నిస్సంశయము. సాధుత్వము వట్టి దుర్బలత్వము. పశుబలము విజయవంతము.' — ఓలెఫ్‌రాజు.

'నేనే మానవుడను. నేనే సర్వమును' అను నహంకారము వీరియందు ప్రబలినది. కండ నాశ్రయించినది కావరముగాని కారుణ్యముగాదు. స్వార్థద్వేషములు విష వాయువులను, మారణయంత్రములను ప్రపంచ వాతావరణమున విచ్చలవిడిగ విరజిమ్ముచున్నవి. మనసునందలి సెగలే మహాసంగ్రామములందును, వ్యాపారములందును బగ బగ మండుచున్నవి. ఆర్థిక రాజకీయ సాంఘిక

జీవితములందు వికృత నృత్యములు గావించుచున్నవి. స్వార్థపరత్వము విలాస వ్యామోహములకు విజృంభించుచున్నది. దుర్వృత్తులన్నియు చేతులు గలిపి గజ్జెగట్టి నాట్యమాడుచున్నవి. ఇంద్రియములు పగ్గములు త్రెంచుకొని, యాత్మను వెనుకకు నెట్టి విచ్చల విడిగ పరుగులిడుచున్నవి. స్వేచ్ఛా ప్రవర్తనము స్వాతంత్ర్యముగాదు. గత ఐరోపా మహాసంగ్రామమును, నేటి ప్రపంచ సంగ్రామమును నిందులకు ప్రబల నిదర్శనములు. ఈ భీకర యుద్ధములు ఏక మతస్థులందే ప్రబలి ప్రపంచమును బ్రద్ధలు గావించుచున్నవి. సదాశయములను నేలగూల్చి, భ్రాతృత్వమును, సౌహార్దమును ప్రబోధించు ధర్మమును వెక్కిరించుచు తామ ప్రపంచ స్వాతంత్ర్యమునకు పోరాడుచుంటిమని పలుకుట వదరుబోతుదనమునే ప్రదర్శించును. పాశ్చాత్యులలో కొలదిమందికి జ్ఞాన వికాసము గలిగినది. వారు మన యాదర్శ సంపదను గ్రహింప గలుగుట శుభసూచకము. 'అహింసా పరమోధర్మః' 'సత్యం వద' 'ధర్మంచర', స్వస్తి ప్రజాభ్యః' అను హితబోధముల శరణు చొరవలదా ? పాశ్చాత్య లాదరించు క్రూర మారణ యుద్ధములకన్న నాత్మశాంతిని జేకూర్చు సత్యా హింస లానంద దాయకములని ధ్రువపడుటలేదా? ఎగురు పాటు జీవిత మధోగతి కీడ్చునని యు, శాంతిజీవిత మభి

వృద్ధికి దెచ్చునని యు వేఱుగ నుహువవలెనా? అభివృద్ధి యన మార్పుగాదే! ఏక ధాటిగ నున్నతికి బ్రవహించు ఋజుపర్తనమే అభివృద్ధి. విడబాటుగానీ, అతుకులుకానీ వటి పందెపుపరుగుగానీ అభివృద్ధిని జూపజాలవు గదా! "కేవల పరివర్తనము మాత్రమభివృద్ధిగాదు. ఏకాగ్రత, క్రమదృష్టియే అభివృద్ధి. ఏకాగ్రత ఉత్పత్తి స్థానమును, క్రమదృష్టి ఆదర్శమును బ్రకటించును. ఉత్పత్తి స్థానమే ప్రజల యాత్మ. ఆదర్శమే యాత్మానుభూతి. క్రమదృష్టి యాదర్శముచేతనే నిర్ణయింపబడవలెను. అభివృద్ధియన నాయూవర్శము నందుకొనుటి కాదిశకు జరుగు గమనము."

—ధీరేంద్రనాథరాయి.

మార్పు జీవితమును కలవరపఱచి కలోలములను గావించును. అభివృద్ధి జీవితమునకు స్థాయినొసగి శాంతిని జేకూర్చును. సంఘమునకు శాంతి నొసగునదే యభివృద్ధి. విచక్షణలేని పరిణామ పరంపరల వాంఛించుట యసంతృప్తిని ప్రబలజేయును. నిర్మాణవంతమగు స్థాయియే యభివృద్ధి. ఈ దృష్టితో జూచుచో పాశ్చాత్య నాగరికత కింకను నిలుకడ చిక్కలేదు. వీరి చర్య లింకను బాల్య చేష్టలే. వీరి నాదన లింకను వాచాలత్వములే.

ప్రతి నాగరికతయు కొన్ని ప్రత్యేక లక్షణములతో విరాజిల్లును. శరీరమందలి యవయవములవలె, నీ లక్షణ

ములు క్రమసాధనమునందు, నిర్ణీత ధర్మములు నిర్వహించు నపుడే నాగరికత వికాసమును గాంచును. పాశ్చాత్య నాగరికతకు జన్మస్థాన మొక ప్రాంతమని లేదు. వారి సొంత మేదో, పరులదెద్దియో గ్రహింప నం దవకాశములేదు.

"గ్రీకులనాటినుండియు పాశ్చాత్యనాగరికత పరుల నుండి యరువుగొని తెచ్చుకొన్నదే. వీని జీవితపు పునాదులు, వీని ప్రధాన లక్షణము లన్నియు పరులవేగాని స్వకీయములుగావు" —డాక్టరు జూన్ డ్యూవే.

గ్రీకులనుండి కళలను, శాస్త్రములను, హెబ్రూలనుండి నీతిశాస్త్రమును, వివిధ దేశములనుండి, వివిధ జాతుల నుండి వివిధవిషయములను పాశ్చాత్య నాగరికత గైకొనెను. గ్రీకుల శాస్త్రకళల దృక్పథము క్రైస్తవ నైతిక సిద్ధాంతములకు విరుద్ధము. గ్రీకుతత్త్వము హెబ్రూల మత సిద్ధాంతమునకు విరుద్ధము. పరస్పర సామరస్యము లేని భిన్న జాతుల భిన్నలక్షణముల రాశియే పాశ్చాత్య నాగరికత. కావునవే వీరి జీవితమున వివిధ విషయములు వివిధములగు కట్టడములుగ గాన్పించుచున్నవి. కళ, శాస్త్రము, నీతి, మతము, రాజకీయము ఒకదానినుండి వేరొకటి విడిపోయినవి. తత్ఫలితముగ నిర్మాణవంతమగు అంగసౌష్ఠవమునుగాని, ఆంతరంగిక సామరస్యమునుగాని

ప్రదర్శింపలేకపోయెను. అభివృద్ధి యన నున్నతాదర్శము గలయేకధారా ప్రవాహము. ఈప్రవాహమున కెచటనైన నొక యుత్పత్తి స్థానముండవలెను. పాశ్చాత్య నాగరికత కిట్టి జన్మస్థానమెద్ది? గ్రీకులు, రోమనులు, హెబ్రూలు, అరబ్బులు వీరికి నాగరికతా భిక్షపెట్టిరి. వీనికైనను పరస్పర క్రమవిధానముగానీ, ఐక్యముగానీ లేదు. నాగరికతకు జన్మస్థానము ప్రజలయాత్మ. అందుండి ప్రకటితమై యాదర్శముగ వికసించినపుడే నాగరికతకొక స్వరూప మేర్పడును. వివిధ జనస్థానములుగలది గావుననే పాశ్చాత్య నాగరికతా స్వరూపమునకు గానీ, అభివృద్ధికి గానీ ఒక యాదర్శములేదు. అందువల్లనే వారు వివిధ విధముల జీవితములను గడపుదురు. ఆదర్శమున జూపు విశ్వాసము ఆచరణమున మృగ్యము. భిన్నవిధానము వికృతరూప జీవితమునకు చిహ్నము. ఆదర్శములేని యభివృద్ధి యర్థరహితము.

శీలములేని గౌరవము, విజ్ఞానములేని హేతువాదము, శాంతిలేని భోగము నేటి పాశ్చాత్య నాగరికతకు ప్రధాన లక్షణములు.

నాగరికతయందలి కొన్ని లక్షణములను పాశ్చాత్యుల నభివృద్ధికి దెచ్చినమాట వాస్తవము. భౌతిక శాస్త్రము,

వ్యాపారము మున్నగు వానియందు వీరు ప్రావీణ్యమును బడసిరి. కొన్ని శాఖలలో నభివృద్ధి గాంచినంతమా త్ర మున సర్వతోముఖాభివృద్ధి గాంచిరని వాదింపజనదు. శరీరమున కొన్ని యవయవము లభివృద్ధి గాంచినంత మా త్ర మున శరీర మభివృద్ధి జెందినట్లా? పై పెచ్చు వికృత రూపము దాల్చదా? పాశ్చాత్యుల ప్రకృతి శాస్త్రముల యభివృద్ధి, వ్యాపార విస్తరత నీతిని, మతమును వెక్కిరించినవి.

"గత శతాబ్దమున మనము తీవ్రముగ ప్రకృతిశాస్త్రాభివృద్ధిని గాంచినను దాని స్వాదు ఫలముల బడయుటకు సాంఘికముగ, నైతికముగ అర్హులము గాము. అభివృద్ధి జెందుచున్న నాగరికత దృష్టితోగాని, క్రైస్తవ మత దృష్టితోగాని జూచిన నది యెంతయో గర్హింపదగిన వేళాకోళము."
—వాలేసు.

"వ్యాపారమున, రాజకీయమున, కుటుంబజీవితమున, మతజీవితమున, స్వదేశ పరదేశవ్యవహారముల తాండవ మాడుచున్న మన దోపిడి భావము నీతి మతములతోడ యుద్ధ మొనర్చుచున్నది."
—ప్రొఫెసర్ ల్యాడ్.

"నేటికిని మనలో బెక్కురు రాతియుగమునకు జెందిన వారేయనుట నిజము"
—వేస్‌లూడ్.

పాశ్చాత్య నాగరికత వ్యక్తికిగానీ, సంఘమునకు గానీ సుస్థిరాంతరంగిక శాంతిని జేకూర్పక, విశ్రాంతి నెఱుగని వికారచేష్టల బ్రకోపింపజేసి యుద్ధములను, స్పర్ధలను, దోపిళ్లను ప్రబలజేయుచున్నది. పాశ్చాత్యుడు విశ్రాంతి, నిలుకడ నెరుగని నిరంతరకృషి గావించుచుండును. యంత్ర మువలె పాటుపడుచు నలజడి గావించుచుండును. ఇందు వలన బెక్కు మార్పులు గలుగును. వీనినే యభివృద్ధియని పాశ్చాత్యులు గర్వింతురు. పాశ్చాత్యుల ప్రజా ప్రభుత్వపు సందడులు పరదేశములను కొల్లగొట్టుటకే. తమ దేశీయులకు సమానములగు హక్కులను, అవకాశములను బ్రసాదించినను నది యితరులకు నిరోధించుటకే. తమ సంక్షోభావ శిక్షణము పరదేశములను పాడుచేయుటకే. స్వదేశమునందు ప్రజాపాలనము, పరదేశమందు నిరంకుశ క్రూర పాలనము. వీనికి నూతన నామములనిడి, పైపై పూతలు పూసి దీనినే యభివృద్ధి, నాగరికత యని వారు విజృంభించుచున్నారు.

పాశ్చాత్యులు పట్టణవాసులు. వీరి కొక స్థిర నివాస ముండదు. ఒకపూట పూటకూలియింటభోజనము; వేరొక యింట నివాసము. తలచు ఒక పూటకూలి యింటినుండి వేరొక యింటికి, ఒక అద్దెయింటినుండి మరియొక యింటికి

మారుచుందురు. ఈ మార్పు వీరి ప్రాచీనమగు ననాగరిక తను బ్రదర్శించును. తమ ప్రక్కయింట నేమి జరుగునో వార్తాపత్రికలు చదివి తెలిసికొనవలసినదే గాని సాంగత్య జీవితముచే నెఱుగరు. మనమో పల్లెవాసులము. స్థిర వాసులము. పరస్పర పరిచయ సాంగత్య జీవితపథికులము. మన యంగవస్త్రధారులు వారి కనాగరకులు. తమవలె వేషములు వేయనివారు అనాగరికులని వారి భావము. కాని వారింకోని దిగంబరులను మన మే మనవలెను ? మన మే మన్నను ఇది వారికి నాగరిక చిహ్నమే. ఏలన: మా చ్పేగదా వారు వాంఛించునది ! మన శరీరములపై పచ్చలు పొడిపించుకొనుట యనాగరిక లక్షణము. కాని వారి స్త్రీలును, సైనికులును వివిధ మృగాకారములతో పచ్చలు పొడిపించుకొనుట నేటికిని గాంతుము. పెదవులకు, చెక్కులకు, కాళ్లకు కృత్రిమ వర్ణములువేసి 'యిది నవీన నాగరికతా చిహ్నము, పరిణామము' అందురు. కాని భారతీయులు కంటికి కాటుక పెట్టుట, ముఖమునకు పసుపు పూయుట, నుదుట కుంకుమ ధరించుట వారి దృష్టిలో ననాగరకత.

సామ్రాజ్య వాదులు, నిరంకుశాధికారులు, నిలువున మానవుల గాల్చి చంపువారు, అసత్య ప్రచారకులు

కపట శాంతిపత్ర ప్రదాతలు, కుత్సిత రాజకీయ తంత్రజ్ఞులు, భోగలాలస జీవితులును నేడు నాగరికులైరి. వీరి దృష్టిలో నితరదేశీయు లనాగరకులు.

పరుల క్రూరములగు దాడుల ఫలితముగ భారతీయులు కొన్ని శతాబ్దములనుండియు నభివృద్ధిగాంచజాలకపోవుట నిక్కువమే. పరులు మనల పీడించి, తమ స్వభావములు మనపై బలవంతమున నంటగట్ట ప్రయత్నించుట విచారకరమే. ఇందు కొంతవఱకు వారు జయము గాంచినదియు సత్యమే యని నుడువవలయును. కాని యిట్టి చావుబ్రతుకుల మధ్య భారతీయు లభివృద్ధిని గాంచి, వికసించు నవకాశమెద్ది? తమ నాగరికతా జ్యోతిని ప్రకాశింపజేయు వాతావరణమేది? ధర్మనిధిని రక్షించుకొనుటకే యుక్కిరిబిక్కిరి యగుచుండ, నిక దానిని పెంపొందించుకొనుటకు సావకాశమెక్కడ?

లలితకళలు - స్వదేశమతము

కళలేని మానవజీవితము కాంతిలేని సూర్యగోళము. ప్రతివానికి కళ సహజలక్షణము. మానవుని సర్వకార్యములందు నిది నిండి నిబిడీకృతమై యున్నది. ఈ విషయమున ప్రాచీన భారతీయ జీవిత మాదర్శప్రాయము. అతడు కళను మూర్తీభవింపజేసి తన నిత్యజీవితమును దేదీప్యమానముగ ప్రకాశింపజేసెను. భారతీయుల దేవాలయములు, బౌద్ధస్తూపములు, గుహల శిల్పములు, చిత్ర విచిత్ర వర్ణములతో జిత్రించిన పుష్ప, లతా, పత్ర, పశు పక్ష్యాదులు భారతీయుని కళావికాసమును అవ్యక్తనాదముతో జాటుచున్నవి. దక్షిణాదినిగల రామేశ్వర శ్రీరంగ మధుర దేవాలయములు, ఆంధ్రదేశమందలి యమరావతి, నాగార్జునకొండ మున్నగు బౌద్ధస్తూపములు, విద్యానగర దేవాలయ గోపురములు, అజంతా యెల్లోరా గుహలు ఇటులెన్నియో క్షేత్రములు భారతీయుల కళానైపుణ్యముల కాంతులు వెలిగ్రక్కుచున్నవి,

"ఉత్తమ భారతీయ శిల్పము ఉత్తమ గ్రీకు శిల్పము కంటె నధిక రసోద్దీపకము, సూక్ష్మేతర భావ ప్రేరకమునై యున్నది. ఈ కళాసాంప్రదాయమున నొక విధమగు నిండు

తనమును, ఆధ్యాత్మిక తత్వమును గలవు. ఇవి గ్రీకుల యంతరాత్మల నంటని విలక్షణములు." —ఇ. బి. హావెల్.

"గుహలు దొలిచి, కట్టడములు నిర్మించి, యందుచిత్ర విచిత్ర శిల్పములను నిర్మించుశక్తి యందు భారతీయులు పరిపూర్ణపండితులు. ఎవ్వరును వీరికి తుల్యులుగాజాలరు."
—డాల్బర్గ్‌రాజు.

ఇంతియేగాదు; భారతీయులు తమ సామాన్య గృహములను, గృహోపకరణములను, పాత్రలను, ప్రతి చిన్నవిషయమునను—తమ నిత్యజీవితమున—కళను తాండవింపజేసిరి. కడచిన ౬౦౦ సం॥ నుండి మన జీవిత వికాసమును పోషించి రక్షించిన దీ కళాసంపదయే. నేటి పట్టణములను, అందలి దుకాణములను గాంచుము. కన్ను పొదుచుకొన్నను కళ గాన్పింపదు. కళారహితములగు నున్నని భవనములు, తెల్లని గుడ్డలు, సాపైన నస్తుసము దాయమే నేటి మన పట్టణ ప్రదర్శనము. కళారహితముగ నున్నను కొంతకు కొంత మేలే గాని యివి యట్లు గాక కళాపతనమును ప్రదర్శించును. ఎచ్చటనైన భారతీయ కళా కౌశల కాంతులు వెదజల్లు వస్తువులు, పాత్రలు, బొమ్మలు, గుడ్డలు గన్పించుచో నవీన నాగరికులు వానిని పురాతనములుగ, మోటుగ భావించి నిరాదరముగ

ద్రోసివైచుచున్నారు. కళ యథార్థముగ మోటువానిచే బ్రదర్శింపను బడదు; వాని యామోదమును బొందదు. మన జీవిత వికాస కాంతుల వెదజల్లు వస్తుసముదాయము నేడు పాశ్చాత్యుల ప్రదర్శనములందును, మ్యూజియము లందును మూతపడియున్నవి. మటియు జర్మనీ, ఇంగ్లాండు, జపాను మున్నగు దేశీయులు వీనినమూనాలు తమ వస్తూత్పత్తికి వినియోగించుకొని వానినే మన నెత్తిని రుద్దుచున్నారు. అందువలన కోట్లకొలది లాభములు గడించుచున్నారు. పాశ్చాత్య నాగరికత యంత్రవ్యాపార నాగరికతయే. కావుననే యిది పెద్దపెద్ద యంత్రాలయముల నెలకొల్పి కళయందలి సృష్టిశక్తిని, జీవితవికాసమును హతమొనర్చినది. మనము దానిని గుడితనముగ ననుకరించుచు మన సహజ జీవితమును కళావిహీన మొనర్చుకొనుచున్నాము. కాని కొలది కాలమునుండి మనయందు వివేకము వికసించి, మన కళలను, స్వదేశ వస్తువులను గౌరవించి, పోషింప కృషిగావించుట శుభసూచకమే. చిత్ర విచిత్రములగు నమూనాలతో, వివిధాలంకారములతో, ప్రసిద్ధహస్తనైపుణ్యమును, నిర్మాణశక్తిని బ్రదర్శించు రత్నాలయమే భారతీయ లలితకళ. కాని యాంగమానసవికార రూపులగు భారతీయులు కొందఱు, ఆంగ్లుల ననుకరించిరే గాని యావేశపూరితమై, యాహ్లాదమును జేకూర్చు

నందచందముల కాకరమగు నొక్క వస్తువునైన నిర్మింప జాలకుండిరి. పై పెచ్చు వంశ పరంపరాగతమగు సర్వకళల నీసడించి వినాశ మొనర్చిరి. నేటి పట్టణములందలి యే దుకాణమునకైన నేగుము. అచ్చట నేమి గాంతుము! మన హస్త కౌశల నిర్మిత సుకుమార సుందర విగ్రహములను గాని, ఆనందావేశముల బురికొల్పు జీవిత వికాస సంపత్కరమగు వస్తుసముదాయమునుగాని, నిత్యజీవితావసరమగు లోహ పాత్రలు, రాతి - కొయ్యబొమ్మలు, వివిధ లతాసంపదతో గూడిన సున్నితములగు వస్త్రములు, రత్న కంబళములు, దేవతా విగ్రహములు మున్నగువానినిగాని గాంతుమా ? లేదు. అట్టు కాక కళాశూన్యములై, కాంతి రహితములై, తళతళ మెఱయుచు తక్కువజాతికి జెందిన, పెచ్చు ధరగల తాత్కాలిక జీవితముగల పాశ్చాత్య వస్తుసంపదను గాంతుము. విపణివీధి నిండుగ, పెచ్చు ధనమును గుంజుట కాధార రూపములగు వస్తువులే గాని, మానసిక వికాసమును, జీవిత వికాసమును జేకూర్చునవి గానరావు. గ్లాస్గో మల్లులు, పచ్చరంగుల నున్నని సారా పీపాలు, బూటు పాలిషులు, మార్కింగు సిరాలు, సబ్బులు, దువ్వెనలు, షేసుపౌడరులు, సెల్యులాయిడ్ బొమ్మలు, కాగితపు పుష్పములు, అందచందములు లేని యనవసర వస్తుజాలమే

మనకు గానబడును. మన యర్థశాస్త్రవేత్తలు, రాజకీయ వేత్తలు, శాస్త్రకారులు, పాశ్చాత్య సంప్రదాయ విద్యా పారంగతు లెల్లరు దీనినే మన సంపదగ, అభివృద్ధిగ, లక్ష్యముగ భావించి కీర్తింతురు. ఆర్థిక స్వాతంత్ర్యమే మన లక్ష్యమా! అర్థ సంపాదనమే మన కృషి కుచిత ఫలమా! కాని యివి కొలదిమంది మారు బేరగాండ్రను ధనవంతుల గావించునే గాని దేశమునందలి వివిధ వృత్తులను నాశనమొనర్చి ప్రజల నిరుద్యోగులుగ, దరిద్రులుగ గావించుచున్నవి.

మనకు జీవిత వికాసమునకు వలయు సర్వవిషయము లందును - ఆర్థిక సాంఘిక సౌష్ఠవమును, కళాకౌశల వికాసమును, ఆధ్యాత్మికౌన్నత్యమును బడయు స్వాతంత్ర్యము కావలయును గాని కేవల రాజకీయము మాత్రము గాదు. మనము వాంఛించునది యంత్రచలనమును గాక ప్రాణశక్తినే. అనుకరణమునుగాక సహజశక్తి ప్రకాశమునే. ఆత్మరహితమై, కళారహితమై, హృదయ రహితమైన వ్యాపార నాకరికతను గాక ఆత్మోద్దీపనమును జేకూర్చు శాంత జీవితమునే.

కళయం దేదేశీయులనుండియైన నొక నూతన వికాసము విస్తరిల్లినచో నది భారతీయులనుండియే యుద్భవిల్లి

ప్రపంచమున వ్యాపించిన దను విషయము మీరెఱుగు దురా? బోర్నియో, జావా, సుమత్రా, చైనా మున్నగు ఆసియా ఖండ ప్రాంతములందు భారతీయుల లలితకళా కౌశలమే నేటికిని ఉట్టిపడుటలేదా? మనము మనలను, మన పరిసరములను శుభ్రముగను, అందముగను నుంచు కొనినపుడే నీతి ప్రబలును. వీనిని జేకూర్చునవి లలిత కళలే. మనము మనకళ నెట్లు భ్రష్టమొనర్చితిమో యొక్క పరి తిలకింపుడు! గృహముల కప్పులకు తుత్తురు రేకులు, మేడలకు నున్నని సిమెంటు లాదులు, నున్నని దర్వాజాలు, ద్వారబంధములు, గోడలు, నీళ్లుడెచ్చుకొను కిరసనాయిలు డబ్బాలు, ఇంటి నిండ సాదా లోటాలు, కాఫీ పాత్రములు, జపాను సెల్యులాయిడ్ బొమ్మలు, కాగితపు పుష్పములు, లతలు, గాత్రస్వరమును జెఱచు గ్రామఫోనులు, దిగంబరత్వమును జూపించు ఉల్లిపొర వస్త్రములు ఈవిధముగ సర్వమును కళారహితము. ఇంతే గాదు; వేషమున, జుట్టున, కట్టున, నడకను, సర్వమున పరుల ననుకరించుటయే. ఇతరులనుండి యెరువు గొను టయే. ఆర్థిక వినాశమును, ఆత్మవిచ్ఛిన్నతను గావించుట కింతకు మించిన ప్రబల నిదర్శనము లేమి గావలయును? కళయందలి యీ నిర్లక్ష్యత, ఈసడింపు సున్నితములగు మన రుచులను బారద్రోలి, బలసౌష్ఠవములను దగ్ధి

మొనర్చి మన జాతిని పరులబిచ్చమువైనాధారపడు దుర్బలజాతిగ జేసినవి. లలితకళలే యార్థిక, సాంఘిక సమస్యలను బరిష్కరించి జీవితమునకు నూతనశక్తిని, దేశమునకు నూతన శోభను నెసగును. శాశ్వత వికాస జీవితములనెసగునవి కళాసంస్కృతులేగాని తాత్కాలిక, డాంబిక దృశ్యములుగావు. జీవిత సాఫల్యము లేని జాతి దేశము నెట్లు ప్రేమింపగలదు? నేటి మన దేశభక్తిశూన్యతను బ్రబలజేయునది యీ కళారహితానుకరణజీవితముగాదా?

ప్రాచీనకాలమున ప్రపంచమున కందచందము లొసగి జ్యోతినలె ప్రకాశించిన దేశము నేడు దుర్బలమై, జాతీయత్వమున కుంటు పడ్డది గావున పాశ్చాత్యులను తిరిపెమెత్తుట మానవలెను. స్వశక్తిపై కళలను పోషించి, వ్యాపారమును బెంపొందించుకొని స్వాతంత్ర్యమును బడయవలెను. కళాకౌశలము సృష్టిశక్తిని వికసింపజేసి విస్తరింపజేయును. ఈ శక్తియే మనయందు నిర్మాణశక్తిని, ఆచరణ శక్తిని ఉదయింపజేయును. కళాపోషణమే క్రమజీవితవికాసము. కళాపోషణమునందే వ్యాపారాభివృద్ధియు, వృత్తిపోషణమును లీనమైయున్నవి. మనము మురళిని, తంబురాను మాని పరుల హార్మోనియములు కొనుటయే తడవుగ మన వస్తు నిర్మాతల వృత్తి నశించినది. వారి యీ వ్యాపారము మంటగలసినది. మన లోహ

పాత్రములుమాని పరుల గాజు, పింగాణి పాత్రలకు ప్రాకులాడిన నాడే యీ వృత్తులు నశించి యీ వ్యాపారము కూలిపోయినది. మన సాలీలు, కుమ్మరులు, కమ్మరులు, వడ్రంగులు, మాదిగలు తమ తమ వృత్తులు గోల్పోయి దరిద్రులైరి.

పక్కారంగుల, వివిధఫల పుష్ప లతా చిత్రమయములగు మన రవశెల్లాలు, పీతాంబరములు, సరిగచీరలు, చిత్రవిచిత్ర లోహపాత్రములు మున్నగున వెల్ల పోషణలేక పొలసిపోయినవి. ఈ వృత్తులు నశించుటతోో నెల్లరు వ్యవసాయమున కెగబ్రాకి స్పర్ధలు-పోటీలు పెంపొందించుకొనిరి. కేవలము చౌకవస్తువులకు ప్రాకులాడి మ్యాంచెస్టరు, గ్లాస్గోల వంకకు మోరల నెగబట్టితిమి. యంత్రాలయములలో నెందఱు తల్లులు, పిల్లలు విధి విరామము లేక కష్టించుచున్నారో తెలియునా? వారు నివసించు గృహములు, వారి పరిసరములు మురికి కూపములే గదా! వీరి సౌకర్యములు గమనించువారులేరు. నీతిని గాపాడువారులేరు. ఆర్థిక లాభవాంఛ యింకెన్నియేని దారుణచర్యలకు గడంగును. ఈ కూలీలు నిరాధారులై, నిస్పృహజెంది మరణింపవలసినదే. ఆంగ్లదేశ జనసంఖ్యలో పదవవంతు యంత్రాలయములందు, చెరసాలలయందు, పిచ్చి యాసుపత్రులందు నశించుచున్నారు. తాత్కాలిక

లాభమునకు మానవశక్తిని వృథాపరుపరాదు. కళాశక్తిని బెంపొందించి మానవశక్తిని పోషింపవలెను. కళారహిత వస్తునిర్మాణ వ్యాపారములల్ప మనస్కుల నాకర్షింపజేయు నేమోగాని వారిని పశుతుల్యులుగ గావించును. నేడు దేశమున జాతీయవాదులు స్వదేశవస్తువులను, గృహ పరిశ్రమలను బోషింప ప్రజలకు త్యాగమును ప్రబోధించుచున్నారు. కాని యిందు త్యాగ మే మున్నది? భారతీయ కుటీర పరిశ్రమలను పోషించుట యన వారు తమ వస్తువులను తాము గౌరవించి యాదరించుకొనుటయే. తము తామాదరించుకొనుటలో త్యాగమెక్కడిది? ఇది స్వచ్ఛందజీవితమునకు దోహదమొసగును. ఆత్మవికాసమునకు దారిజూపును.

నేటికిని మన పల్లెలలో కళానైపుణ్యమును ప్రదర్శింప గల శిల్పులు పెక్కురుగలరు. వీరు తమ్మాదరించువారు లేక మరుగుపడియున్నారు. వారి కవకాశ మొసగుచో పాశ్చాత్యులను దిగ్భ్రమజెందించు పెక్కు చతుర కళా వస్తువుల నిర్మింపగలరు. మనము పాశ్చాత్యుల యుచ్ఛిష్టములకు మురిసిపోయి మన కళాకోవిదుల, వస్తునిర్మాతల నోట మట్టిగొట్టుచున్నాము. కాబట్టి మనలో సంపన్నులు పాశ్చాత్య వస్తువ్యామోహ తృష్ణల దగ్గులొక్కనక వస్తువుల మూల్య మెక్కువ యను సాకుజూపక మన పక్కా

రంగుల కాశ్మీ పీతాంబరములను, బందరు కలంకారీ వస్త్ర ములను, దిల్లీ పాలరాతి బొమ్మలను, కుంభకోణపు పాత్ర లను, విశాఖపురి దంతపు పనిముట్లను, మైసూరు చందన వస్తువులనే యెక్కువ మూల్య మిచ్చియైన కొనవలెను. కుటీరమున చిన్న దేవుని విగ్రహమును బూజించు పేద వానికిని, పెద్దదేవళమున పెద్ద విగ్రహమును బూజించు భాగ్యవంతునకును నెట్టి భేదమునులేదు. పేదలు, భాగ్య వంతులు శక్తి కొలది దేశవస్తువుల నాదరించి కొనుట యందే దేశ సంపద యభివృద్ధియు, స్వాతంత్ర్యవికాస మును గలదు. జాతీయ సంపద్రక్షథమున గాంచిన-చో నెక్కువకాలము మను ప్రియపు వస్తువులు శీఘ్రముగ నశించు పెక్కు చౌక వస్తువులకన్న లాభదాయకములు. శతాబ్దముల కొలదియు చెక్కుచెదరని ప్రాచీనపు కట్టడ ములు అత్యల్పకాలమున నశించు కొత్త కట్టడములకంటె మిన్నలుగావా? సంశ్లానుగతమగు హస్తనైపుణ్యమును, లావణ్యసౌకుమార్యములను ప్రదర్శించు మన ప్రాచీన వృత్తిసంపన్నులగు సాలె, కుమ్మరి, శిల్పి మున్నగువారు నేటి యంత్రములకన్న, యంత్రనిర్మాతలకన్న మిన్నలే గదా!

మన వాంఛలు తృణ తృణమును విచ్చలవిడిగ బెంపొం దించుటకన్న నిత్యావసర వస్తువుల నెల్లరకు ప్రసాదించు

టయే నిజమగు నాగరికత. కళలు ఆర్థిక సంపదను పెంచి జీవిత వికాసము నెసగును గాన వానినిఁ బ్రేమించి పోషింప వలెను. గత శతాబ్దమువఱకును మన గ్రామములు కుటీర వస్తు సంపన్నములై, కళాపూరితములై శోభిల్లినవి. ప్రజలందరు నిత్యజీవితమునకు వలయు నాహార పదార్థములు, వస్తుసముదాయములతో నిండి యుండిరి. ఇతరులను హృదయపూర్వకముగ నాహ్వానించి, యాతిథ్యమొసగి సత్కరించిరి. ఇది నాగరికత్వోన్నత్యమును బ్రకటించును. పాశ్చాత్య విద్యావ్యామోహము మన మనసునకు మత్తుగూర్చి మనలను గొత్తలమండల గావించినది. తత్ఫలితముగ స్వల్పకాలమునకే మన పరిశ్రమలన్నియు పాడుపడినవి. అసహ్యకరములును, అప్రయోజనములు నగు పెక్కు వస్తువులు పాశ్చాత్య మానసిక పుత్రుల గృహములు నలంకరించిన వాది మన సిరిసంపద లంతరాన మైనవి. మన 'జన్మహక్కు'ను, పాశ్చాత్య నాకరికతా వ్యామోహాంధకారమున - సగర్వముగ - మనమే గూల ద్రోచితిమి. మన జీవిత వికాసమును తాత్కాలికములగు మిరుమిట్లు గొలుపు మెఱుపులతో బేరమాడితిమి. మన సౌందర్యమును వ్యామోహ భ్రాంతులమై పై వేషము లకు బలి యొసగితిమి. మన స్వదేశి యుద్యమము కేవలము పాశ్చాత్య దృక్పథముతోడనే పునరుద్ధరింప

గూడదు. ఆర్థిక దృష్టితో పాశ్చాత్య మార్గముల ననుకరింపరాదు. మన జాతీయోద్యమము ఆర్థిక మూల్యముతో బాటు ఆంతరంగిక మూల్యమును, రాజకీయ స్వతంత్రతతో బాటు రాటుదేలిన సంస్కృతిని ప్రదర్శింపవలెను. కుటీర పరిశ్రమలు గావించువారు తమ యుదర పోషణమునకే గాక జాతి వికాసమునకుకూడ దోడ్పడుచున్నారను భావము మనలో బెంపొందవలెను. యంత్రములందు విరివిగ వస్తువుల నిర్మించుటయే గాక ఆచ్చూ పరిశ్రమలు గావించువారి సుఖమును గణింపవలెను. 'వస్తువుల కంటెను మానవులే విలువగలవా'రను నాదర్శమును మరువరాదు. ఆర్థిక నాగరికతా గమ్యస్థానము దుస్సహమగు శ్రమ జీవితముగాక శాంతియుతమగు విశ్రాంత జీవితమే యని మరువరాదు. కళారహితమగు వృత్తి మానవుని హృదయ వికాసమును జూపదు. మానవుని స్వార్థపరునిగ గావించి పశుతుల్యునిగ జేయును. జనుల రక్త మాంసములు పీల్చి, నిర్వీర్యుల గావించు యంత్రనాగరికత మానవాభివృద్ధి నెట్లు గావించును? దేశసంపదభివృద్ధి మానవుని పరిశ్రమఫలితము గాదా! పాశ్చాత్య విద్యాభ్యాసముచే నభివృద్ధిగాంచుచున్నామని భ్రమించుకవులు, ఉపన్యాసకులు, శాసనసభాసభ్యులు, అధికారులు, స్వతంత్ర వృత్తి పరులమని గర్వించు న్యాయవాదులు, వైద్యులు,

పాశ్చాత్య నాగరికతాకన్యక కూడిగ మొనర్చు సర్వ భారతీయులు తమ దగు సర్వము నీసడించి పాశ్చాత్యుల యంత్రనిర్మిత వస్తుజాలము నంతటిని మన విపణివీధుల నింపి, మన వృత్తుల నాశముచేసి, మన దేశభాగ్యమును సంగ్రహించి తాము భాగ్యవంతులైరి. పాశ్చాత్య కళా రహిత విధానములతో మన భవనములు నిర్మితమైనవి. అవి వారి వస్తుసముదాయముతో నింపబడెను. నవనవ విధానములకొఱకు శ్వేత జాతులను, ఆంగ్లో హైందవులను నాశ్రయించి పావనులము గా బ్రయత్నించితిమి. గ్రామ ఫోనులు, రేడియోలు మన గానైపుణ్య ప్రదర్శకము లైనవి. ఆంగ్ల గానసభల కేగబడి మన గాయకుల నోట దుమ్ముగొట్టితిమి. పాశ్చాత్యులవలె సర్వమాంసాహార ములు బల్లపైనిడి, కుర్చీలపై గూర్చుండి ఫోర్కులతో, చెంచాలతో, కత్తులతో దినసాగితిమి. విస్కీ, బ్రాందీ, చాంపెయనులను తీర్థములుగ పాన మొనర్ప దొడగితిమి. మన గోడల నగ్నదృశ్యములను, ఫ్రెంచిపటములను, ఇండ్లయెదుట రోమను విగ్రహములను, జపానీయుల కాగితముల-గుడ్డల పువ్వులను, తీగలను, సెల్యులాయిడు బొమ్మలను, కాళ్లకింద ఆంగ్లేయుల తివాసీలను, శరీర మునకు ఆంగ్లేయ వేషచిహ్నములగు సూటు, బూటు, టై, హేటులను గూర్చితిమి. మన వర్తకులు తమ

యార్థిక లాభమునకు వారి వస్తువుల నమ్ముటకో, వారి కంపెనీల నిండు నెలకొల్పి భాగముల బడయుటకో మొదలిడిరి. ఇది నిజమగు జాతీయతగాదు. జాతీయత యన జీవితమును క్రమ పథమున వికసింప జేయుట. ఇది హృదయ పుష్ప వికాసబంధురము. నీతిబద్ధము. జీవితకళను నీ హృదయ కమలమున జ్రించి వికసింప జేయ నేర్చుకొనుము. వికారమగు పరపీడన జీవితమును భస్మీపటల మొనర్చి హృదయవికాసము, కౌశలముతోడి జీవితాభివృద్ధిని గావించునదియే జాతీయత. దీనిని మరచి మన మానసిక దారిద్ర్యము, భావదాస్యములను గమనింపకుంటట విచారకరము. మనదేశమున నేటివఱకు పాశ్చాత్య పద్ధతులపై నిర్మింపబడిన సకల వస్తు సముదాయ మకస్మాత్తుగ, నొక్కక్షణమున నాశమయినను మనము దరిద్రులముగామనియే నా విశ్వాసము. ఆత్మ విశ్వాసము నశించిన సృష్టిశక్తి క్షీణించును. అంగ మానస పుత్రులముగ బ్రదుకుటయే మన శిక్షణ ఫలితము గారాదు. మనదేశమును పునరుద్ధరింపవలెనని మన పసుత పతనమును గహింపవలెను. మన ప్రాచీనతను స్మరింపవలెను. విజ్ఞాన వికాసములు పాశ్చాత్యుల సొత్తే యను భావము మనలను వీడనంతదనుక, మనదేశ వ్యాపా

రాభివృద్ధి - పునర్నిర్మాణ మసంభవము. మనవస్తు నిర్మాణ తలను బహిష్కరించి పరుల పంచల నూడిగము గావించుచున్నాము. ఇది తొలగనిదే మనకు ముక్తి లేదు.

"స్వదేశి వస్తువులను, వస్త్రములను దప్ప నన్యముల నాసింప మను దీక్షను భారత స్త్రీ పురుషులు గైకొన వలెను."

—సర్ జార్జి బర్డ్‌వుడ్.

మనలను గూర్చి పాశ్చాత్యులేయిట్లు ప్రకటింప మన బుద్ధులేమైనవి? ఇది యెంత సిగ్గుమాలినతనము! ఈ విషయమున ఆంగ్ల ప్రభుత్వ విధానమును, విద్యా విధానమును గరింపకుండ నుండజాలము.

"మనదేశ ప్రజలను స్వతంత్రుల జేయుడు. వారి సంకెలలను విదలింపుడు. బురదచే బురదను కడుగ గలమా? భావదాస్యముచే సాంఘిక, ఆర్థిక దాస్యములను బారద్రోలగలమా? ఏదీ? ఒక్క నిదర్శనమును జూపుడు. సంఘము నిమిత్తము సర్వసుఖేచ్ఛలను త్యజింపగలిగిననాడు నీవు బుద్ధుడవై ప్రకాశింతువు. ముక్తుడవై వెలుగొందుదువు."

—వివేకానంద.

కార్యాలయములలో, భోజనశాలలలో, వైళ్ళలో, సర్వ విషయములలో నేడు మనము చూపుచున్న వైదేశిక పద్ధతులకు ధిక్కార తిరస్కారములు. ఇవి మనము

నేర్చిన విద్యా విధాన ఫలితములే. మన నాగరికత్తా జీవిత మునకు కళంకములే. మనము నేర్చిన విద్య పాశ్చాత్య పుస్తక ప్రకాశకులను బాగుచేయు సాధనము. భారతీయ లక్షణమింపు మృగ్యము. ఇది భారతీయ కళను వెక్కిరించుచున్నది.

భారతీయ సంస్కృతి

సంస్కృతియన నేమియో యొక్కింతయాలోచింతము.
'విపుల మాధుర్యకాంతులే సంస్కృతి.'

—మ్యాత్యూ ఆర్నాల్డు.

'భౌతిక, ఆధ్యాత్మిక జీవితమున సాంఘికముగ లీనమై యున్న పదార్థమే సంస్కృతి' —ప్రొఫెసర్ శాపిల్.

"నాగరికత యను పదార్థమునకు రూప మొసగునది సంస్కృతి" —ఆరిస్టాటిల్.

భారతీయుల భావమున నాగరికత యను సుకుమార పుష్పమందలి సువాసనయే సంస్కృతి. నాగరికతను చుట్టు ముట్టి, ఆవరించి, వికాసమున ప్రకాశింపజేయునదే సంస్కృతి.

భారతబుషులు ప్రకృతి భిన్నత్వమును ప్రేమించి, స్నేహభావముతో మెలగిరేకాని, పోరాడి పోటీలు పెంపొందించుకొన లేదు. ప్రేమమయమగు స్నేహభావముతో ఔన్నత్య మార్గమున పోటీపడిరిగాని, తమకు సేవచేయుటకు బలవంతముగ నితరులను స్వాధీనముచేసికొనుటయందుగాదు. వారు ప్రకృతిని ప్రేమించి, గడచి యద్దాని వెనుకనున్న యాత్మను సాక్షాత్కరింపజేసికొనిరి.

'అగ్నిజలములందు ప్రకాశించునట్టియు, ప్రపంచమంతటను వ్యాపించియున్నట్టియు, ఓషధులు, మూలికలందు

గలట్టియు పరబ్రహ్మకు నమస్కరింతును.' ...—శ్రుతి.

ఇంద్రుడు, వరుణుడు, అగ్ని మున్నగువారు పూర్వము బ్రహ్మను సాక్షాత్కార మొనర్చుకొనిరి. భారతీయులకు మేదిని మాత. వాయువు తండ్రి. అగ్ని సఖుడు. సముద్రము బంధువు. ప్రాకృతికశక్తులనెల్ల భజించి వాని వెనుకనున్న యాత్మయొక్క యుద్దీపనమునకే ప్రాచీన సారస్వత మంతయు బ్రబలినది. ఇదియే వేదకాలపు భారతీయుల సంస్కృతి.

వారు ఇతర నాగరకతలను ద్వేషించి నాశన మొనర్పక, వానిలన్నిటిని 'ఆర్యవిజ్ఞాన'మను మూసయందు పోతబోసి సమీకరణ మొనర్చిరి. భారతదేశము సర్వ నాగరికతలను సమన్వయ మొనర్చి సహన సఖ్యతలను బ్రదర్శించెను. భిన్నత్వమున నేకత్వమును బ్రకటించెను.

షడ్దర్శనకర్తలీదేశమున వెలసిరి. బౌద్ధజైన చార్వాక లోకాయత మతములిందు తమ తమ భావములను స్వతంత్రముగ బ్రచార మొనర్చినవి. ద్వైతాద్వైత విశిష్టాద్వైత ములిందుద్భవిల్లినవి. వీనియన్నిటియందునులీనమై,చుక్కలలో చంద్రునివలె వీని వెనుకనున్న యాత్మను వేదములు ప్రకాశింపజేసినవి. ఆదర్శ మొకటే యైన నద్దానిని ప్రాపింప జేయుటకు మార్గములు వేరుగ నుండును. వివిధ మానవులు పలుతెఱగుల యాహారములు గ్రహింతురు.

ఒకే వ్యక్తి వివిధ సమయముల వివిధాహారములు స్వీకరించును. ఆరోగ్యవంతుని ఆహారము రోగికి విషతుల్యము. రోగి పథ్యపు మెతుకులు ఆరోగ్యవంతునకు గిట్టవు. కావున మార్గములు వేరైనను లక్ష్యమొక్కటియే. మానవుని ప్రకృతిని బట్టి, సంచితకర్మములను బట్టి భిన్న మార్గము లవలంబింపబడును. భక్తి జ్ఞాన కర్మయోగము లిట్టివే. బ్రహ్మ క్షత్రియ వైశ్య శూద్ర వర్ణనియమముల మూల మిదియే. బ్రహ్మచర్య గృహస్థ వానప్రస్థ సన్యాసముల జీవిత క్రమాభివృద్ధి విధాన కీలక మిదియే. ఇందు హెచ్చు తగ్గులకు, ఉచ్చనీచతలకు దావులేదు. తమ తమ తత్త్వముల కనుగుణమగు మార్గమును స్వీకరించి గమ్యస్థానమున కందరు పయనింతురు. ఇష్టదేవతారాధనా విధానమే శాంతిని ప్రబలజేయును.

మానవుల యభిరుచులను, స్వభావములను గమనించి, పరస్పర ధర్మసహాయమునకే వర్ణము లేర్పరుపబడెను. కాని నేటి కుల తారతమ్యములకు ప్రాచీనభారత సాంప్రదాయమున, సాంఘిక జీవనమున, ఆదర్శమున తావు లేదు. నేటి కులతత్త్వములు తమ యథార్థ తత్త్వమును గోల్పోయినవి గాన నివి యనుకరణీయములు గావు. వీని నెంత త్వరితముగ నంతరింపజేసిన దేశమున కంత శ్రేయము గలుగును.

విచక్షణా వివేకములు లేని నేటి కులతత్వములే జాతి నధోగతి పాలు గావించినవి. అగ్రజాతుల యహంకారమును, పరదేశ పాలితులను 'విభజించి – పాలించు' ప్రభువుల కుత్సిత రాజనీతి సూత్రములును వీనిని విచ్చల విడిగ బ్రబలజేసినవి. స్పర్ధను వృద్ధిచేసినవి. వీనిని రూపు మాపుట యత్యవసరము.

సంస్కృతి దాత

ప్రాచీనకాలమునుండియు భారతదేశము సారవంతమగు భూములకు, భాగ్యవంతులగు ప్రజలకు నాలవాలమై, సర్వ శాస్త్రములచేతను, కళలచేతను, మతములచేతను, నాగరికత చేతను శోభితమై భూలోక స్వర్గముగ వెలుగొందినది. సామాన్య మానవు లూహింపజాల నంతటి యార్థిక నైతిక మత వికాసము గలిగి, ప్రపంచమందలి సర్వమానవులును 'కలలు గాంచు దేశము'గ నుండెను. ప్రాచీన బాలియా, ఈజిప్టు దేశములు మనదేశ వస్తువులకు ముగ్ధములై దీనితో వర్తక వ్యాపారములు గావించెను. వివిధ శాస్త్రములతో, కళలతో బెంపొంది, వస్తునిర్మాణమున సిద్ధహస్తులై ప్రపంచ జాతులనెల్ల నాకర్షింప గలిగినది భారతీయులే.

"ఇతర ప్రాంతముల నెచ్చటను లభింపని వివిధ వస్తువులను భారతీయు లమ్ముచుండెడివారు. కళాకాంతులుట్టి పడు ముత్యపు చిప్పలతో గావింపబడిన చిత్రవిచిత్ర వస్తువుల్లను, అద్దములవలె తళ తళ మెఱయు వివిధములగు రాలను, స్వచ్ఛమగు మంచువలె ప్రకాశించు శ్వేతాంబరములను, వివిధ వర్ణములతో, నమూనాలతో

నలంకృతములగు కలంకారీ వస్త్రములను, పట్టు పీతాంబ రములను విపులముగ విపణివీధుల విక్రయించెడివారు. పచ్చి మాంసమును భుజించు ననాగరికులగు ఫ్రాయనీషి యనులుగూడ భారత వస్తు సంపదను, భారతీయుల వివిధ గాథలను వినుటయే తడవుగ పేరాసతో నీ వస్తువులను గొంపోయి యూరపుతో వర్తకము గావించిరి. అర బ్బులు, పారసీకులు వీరి ననుకరించి, భారతీయుల వస్తు వులను గొని యూరపు నందు వ్యాపారము గావించెడి వారు. ఈ వస్తువులను గొంపోవు మార్గములందు భాగ్య వంతములగు పెక్కు పట్టణములు వెలసెను. ఈ మార్గ ములు మారగానే యా పట్టణము లంతరించెను. ప్రతి శములందుగూడ భారతీయుల వ్యాపారము విస్తరించెను. మారుమూలలగల చిన్న చిన్న లంకలకుగూడ భారతీయుల వివిధ వస్తువులు వ్యాపించుటచే వారు భారతీయుల సిరి సంపదలకు, సౌభాగ్యమున కచ్చెరువందెడివారు. భార తీయ వర్తకమును యూరపున కంతకు గుత్తగొనియే వెన్నిను, జినీవా వర్తకులు భాగ్యవంతులైరి. ఈ విషయ ములు దక్షిణ ఐరోపీయులు గ్రహియించుటయే తడవుగ, భారతదేశముతో వ్యాపారము సాగించుటకు కోలంబ సును భారతదేశమునకు ప్రయాణము గావించిరి. ఈయన పడమటి వైపుగ ప్రయాణ మొనర్చి, నూతన(అమెరికా)

ప్రపంచమును గనుగొని, దానినే భారతదేశ మనియు, నందలి ప్రజలే భారతీయు లనియు తలంచెను. పోర్చు గీసులు వాస్కోడిగామా నిశ్చే భారతదేశమునకు పంపగా నతడు వెడలి దక్షిణాఫ్రికాను చుట్టి మన దేశమును జేరి తన రాక నెక బంగరు పత్రముపై లిఖించి మనదేశరాజు నకు బంపెను.

"ఇది బుడుతకీచులకు పవిత్రదినము. లిస్బన్ పట్టణ మందలి గృహములన్నియు నారాత్రి దీపములతో నలంక రింపబడెను. మురుగు కాలువలుగూడ సారాయములతో బ వహించెను. వీధులకలకు వేయబడిన మంటలఫలితముగ నాకాశము - మెళ్ళకొలది - ఎఱుపుబొఱను." —రీడ్.

భారత దేశమునకు సముద్ర మార్గము నన్వేషించి, యిచటి చక్రవర్తి సద్భావమును బడసిన ఐరోపీయులలో వీరే ప్రథములు కాన నమిత్రోల్లాసమును బ్రదర్శించిరి. వీరి యానంద వినోదములకు బ్రబల కారణమేమి? వీరు భారతదేశమున గాంచినదెద్ది? ఆంగ్లేయులు మనదేశ మున తమ పాద మిడిననాడు వా రేమి గాంచిరో వీరు నదానినే గాంచిరి. ఆంగ్లేయులు మన దేశమున గాంచ గలిగిన దిదియే.

"నాగరిక ప్రపంచమున ప్రఖ్యాతిగాంచెడి ప్రతి వస్తువును సుందరకళామయమును, హస్తకౌశల నిర్మిత

మును. జీవిత వికాసముల విరజిమ్మి నిట్టి వస్తుసముదా
యము భారత దేశమున నిర్మింపబడెను. ఈ దేశము
వర్తక వ్యాపారములందు గాంచిన విఖ్యాతిని యూరపు
ఆసియా ఖండములలో మరే దేశమును గాంచలేదు.
నాగరిక ప్రపంచమం దంతటను భారతపు ప్రత్తి, ఉన్ని,
పట్టు, నార వస్త్రములు ప్రఖ్యాతి గాంచెను. స్త్రీల భూష
ణములు, వివిధ జాతుల రత్నములు, వన్నె చిన్నెల వాసి
గాంచిన పలు పాత్రలు, వెండి బంగారములతో, ఉక్కు-
లోహములతో గావింపబడిన వివిధ విచిత్ర వస్తువులతో
కన్పడెను. పట్టణములు కళాశోభితములై మిగిలిన ప్రపంచ
మును తలదన్నుచున్నవా! యనునట్లు గాన్పించెను.
ఈదేశము సముద్ర వ్యాపారమునందును, భూవ్యాపార
మునందును తక్కిన నాగరిక ప్రపంచమును ధిక్కరించి
వాసి గాంచెను." —ఒక ప్రఖ్యాత అమెరికా వాసి.

ఈ నూతన సముద్ర మార్గము బుడుతకీచులకు భారతీయులతో ప్రత్యక్ష వ్యాపారసంబంధము గల్పించెను. ఇందువలననే వెన్నిసు ప్రతిభ నశించెను. జైగ్రెసు, యూప్రెటిసు, నైలు మున్నగు పెక్కు నదీతీర పట్టణములు పాడుపడెను. భారతీయులు తయారుచేసిన పెక్కు వస్తువులకు లిస్బను పట్టనము ప్రఖ్యాత పణ్యభూమిగ మాఱెను. భారత సంబంధమే బుడతకీచుల భాగ్యమును,

ఆధిక్యమును బెంపొందించుటచే, నితర ఐరోపాజాతులు తమ దృష్టులను మన దేశమువంకకు మరల్చిరి. స్పెయిను దేశీయులు అమెరికా కేగియును భారతదేశమును మఱువ లైరి. పసిఫిక్ సముద్రము మీదుగ భారతదేశాన్వేషణ మునకు గడంగిన మ్యాగ్లను జట్టు కొన్ని లంకలుగాంచి యవియే భారతదేశమని భ్రమించెను. ఇవియే ఫిలిప్పైను లంకలు.

భారతదేశమే పేరి మనస్సులందు సర్వదా మెలగుటచే వీ రెచ్చట నే దేశమును గాంచినను భారతదేశమే యని భావించిరి. పోర్చుగీసు, స్పెయిను నావికుల ననుసరించి డచ్చి, ఫ్రాను, ఆంగ్లదేశీయులు భారతదేశమునకు ధన సంపాదనమునకై రాదొడంగిరి. వీ రెల్లర కాత్రిథ్య మొసగి, ఐశ్వర్యవంతుల గావించినది మన భారతదేశమే. కాని యిచట ధనార్జన గావింప మొదలిడుటయే తడవుగ వీరిలో వీరికి స్పర్ధలు - పోట్లీలు పెచ్చుపెరిగెను. వీరు దేశమున నానావిధ కలహాములు రేకెత్తించి ద్వేషములు పెంపొందించిరి. కాని చివరకు అదృష్టదేవత యాంగ్లేయుల నావహించెను. ఆంగ్లేయు లీదేశమునకు ప్రభువులైన విషాద గాథలలో గర్వింపదగిన యంశ మేమియు లేదుగాని యనా మకమైన యాంగ్లదేశము భారతదేశము వలననే భాగ్యవంతమై, అధికార ప్రాభవమును బడసినదనుట సత్యదూర

ముగాని, అతిశయోక్తిగాని కానేరదు. దురహంకార ముచే దీని నాంగ్లేయులు సమ్మతింపకపోవచ్చును. వారడుగు పెట్టినదాది యీ దేశమును విచ్చలవిడిగ కొల్లగొట్టి భాగ్యవంతులైరి. ఆర్థిక తృష్ణచే మదాంధులై భారత నాగరికతా సంస్కృతుల చవిజూడరైరి. వీనిని గుర్తించి నచో తామును ఉన్నత నాగరికతను బడసి ప్రపంచమును దుఃఖమయముగ, ఈర్ష్యాద్వేషముల కాలవాలముగ గావింప కుండెడివారు. ప్రపంచము పరస్పర సఖ్య సహాలతో, శాంతి భద్రతలతో విరాజిల్లెడిది.

మన సంపదలతో భోగముల ననుభవించుచు, మన రాజ్యాధికారముతో సామ్రాజ్య సంపన్నులై మనలను మాత్రము దరిద్రులుగ జేసిరి. బానిసలుగ గావించిరి. అనాగరికులని వెక్కిరించిరి. ఇదియే వీరి కృతజ్ఞత. ఇక భారతీయులో! తమ సంస్కృతీ నాగరికతలను, వివిధ విజ్ఞాన వికాసములను ప్రపంచమునం దంతటను విరివిగ విస్తరింపజేసి, ప్రపంచమునకు జ్యోతులవలె వెలుగొందిరి. ప్రాచీన గ్రీకు రోము పారసీక వాసులు భారతీయ నాగరికతా సంస్కృతులను లెస్సగ గ్రహించిరి. ఈ దేశమున కేగుదెంచి విజ్ఞాన వికాసమును బెంపొందించుకొని ప్రఖ్యాతి గాంచిరి.

"జ్ఞానారసమునకు పైథాగరసునకుముండే గ్రీకులు భారతదేశమునకు పయనమైరి." —వాల్టేరు.

పైథాగరసు, ప్లేటోలు తత్త్వ శాస్త్ర పఠనమును భారతీయులకడనే గావించిరి. లియొన్‌డిరోస్సి, లిడ్‌విగ్ బచ్‌నర్, ఎమైల్ బర్‌నాఫ్, ఆర్థర్‌లిల్లీ మున్నగువారెందరో క్రైస్తవమతమునకు ఉత్పత్తికారణము భారతీయులే యని హృదయ పూర్వకముగ విశ్వసించిరి. తరువాత మతయుద్ధముల ఫలితముగ వికృత రూపము నందనిచో క్రైస్తవమతము నేటివలె నుండెడిది గాదు.

భారతీయుల కళాశాస్త్రములు, వారి వర్తక వ్యాపార నైపుణ్యము, సారస్వతము, తత్త్వశాస్త్రములు, గణిత ఖగోళ రసాయన వైద్య శాస్త్రములు ఖ్యాతిగాంచుటయే గాక అరబ్బులు, పారసీకులు వీనిని పఠించి తమదేశము లందును, పాశ్చాత్య దేశములందును ప్రబలజేసిరి. భారతీయుల వ్యాపార వ్యవసాయ దక్షతనే యరబ్బులు నేర్చుకొని పాశ్చాత్యులకు ప్రసాదించిరి. అరబ్బులద్వారా పాశ్చాత్యులు భారతీయుల ధన ధాన్య వస్తు సంపదను, వ్యాపార విస్తరమును గ్రహించుటయే తడవుగ తమదేశ మందు నిత్యము గావించుచున్న యుద్ధములను, దోషిళ్లను, ఓడదొంగతనములను జాలించి మూకలు మూకలుగ

భారత దేశమునకు బ్రాకదొడగిరి. భారత విజ్ఞాన వికాస
ముల బడయగల పైథాగరసు, ప్లేటోల వంటి జ్ఞాన
పిపాసులనుగాక ఓడదొంగలను, దోపిడి గాండ్రను
తండోప తండములుగ పాశ్చాత్యులు భారతదేశముపైకి
పురికొల్పిరి. తమ దేశమందే పై యట్టి కృత్యములు
గావించు వీరికి భారతదేశ ఆర్థిక సంపదతోగాక వైజ్ఞానిక
సంపదతో నేమిపని?

"మొదటినుండియు దూరదృష్టియు, హృదయమును
కంపమునులేని ఘోరకిరాతులు, దోపిడి దొంగలు నీ
పోర్చుగీసువారే. ప్రథమమున వారిచర్యల బ్రశంసించు
టచేతనే వారి క్రూరకృత్యములను, అవినీతిని గాంచ
జాలని యంధులమైతిమి. కాని కొలదికాలమునకే యీ
క్రూరకృత్యముల నగ్నత - భీకర స్వరూపము స్పష్టముగ
కన్నులకు గాన్పించెను. వీరు అరబ్బులను తెఱచాపలకు
వేలగట్టి సముద్రమున బొఱలవైచిరి. పందిమాంసమును
వేడివేడిగబ్రెల్చి, వారి నాలుకల కంటించి ఘోరబాధలు
పెట్టిరి. తమ సైనికుల కానందముగూర్చు నరబ్బులను
మొసళ్ళకాహారముగ వైచిరి. ఈలవైవగనే యీ యాహా
రమునకు మొసళ్ళు తమ మోరలు నీటి పైకెత్తికొని
యుంచెడివి. అరబ్బులు దీనులై యరణ్యములందు పులులు
చాటుననో, కొండచిలువల మాటుననో దాగియుండెడి

వారు. తలులచేత బిడ్డలను రోకళ్ళతో మెత్తమెత్తగ దంపించెడివారు. భారతదేశమున కేగు పాశ్చాత్య వర్తకు లెల్లరు తమ మానవత్వమును, న్యాయమును కేప్ ఆఫ్ గుడ్ హోప్ వద్ద దాచి పోయెడివారు."—విన్ వుడ్ రీడ్.

ఇట్టివారికి మానవత్వము, న్యాయము లనునవి తమ దేశమున మాత్రమున్నవా! యని మా సంశయము. ఇక నుత్తర ఐరోపీయుల విషయ మాలోచింపుదము. "అరణ్య మృగములను, చేపలనే గాక, ప్రత్యేకముగ మానవులను గూడ వేటాడు సాగసులు, ఆంగ్లులు, జూట్లులు, స్లిజియనులు, డేనులు కత్తికటారులతో, బాకులతో ఒ మొ. ద వ శతాబ్దము వఱకు హిమమయ మైన బ్రిటిషు ద్వీపుల నెట్లు స్వాధీన మొనర్చుకొని పాలించిరో మీరు ఒకసారి స్మరియింపుడు. వికృతాకృతులగు శ్వేత శరీరములు, దయాశూన్యము లయి భయంకరము లయిన నీలికన్నులు, జనుప పీచువంటి వెండ్రుకలు, మాంసము జున్నులతో నింపి, మత్స్య సారాయములతో కాక యెక్కించిన కూళబొజ్జలు, శీతల హృదయములు, మందగమనము, మత్తుగ త్రాగి పశువులవలె గృహము లందు బడియుండు మాంద్య స్వభావము ఇవియే నేటికిని వంశక్రమానుగుణముగ, పరిస్థితుల ఫలితముగ బ్రదర్శించు వీరి లక్షణములు" —ఎడాల్ఫ్ కెయిన్.

"ఓడదొంగతనములు, మనుజుల వేట, తమ భూము
లను, స్త్రీలను బానిసల కప్పగించి సముద్ర యానములు,
యుద్ధములు, దోపిళ్ళు గావించుటయే వీరి లక్షణములు.
తమ పడవలలో సముద్రయానము గావించుచు, భోజన
కాలములందు చేయు 'భారత దేశమునెట్లు దోచుకొం
దమా'! యన్న సంభాషణలను వినినపుడే మనము (ఇంగ్లీ
షువారు) స్కాండినేవియా ఓడదొంగల సంతతివార మని
గ్రహింపగలము. శతాబ్దములకొలదిజరిగిన మన విద్యాభి
వృద్ధియు మన రక్తమును శుభ్రపరుపలేదు. భారతదేశ
మునం దొక సంస్థానాధిపతి వంకకుగాని, ఆయన రాజ
భవనము వంకకుగాని దృష్టి బ్రసరింపజేయుచు 'ఎంత
ఐశ్వర్యవంతుడీ ప్రభువు! ఎంత విలువగల దీ భవనము!'
అని దోచుకొనుటకు మన వారు కేకలిడుదురు."

—సర్ చార్లెస్ డిల్కే.

"...వీ రేతీరమున దిగినను నక్కడ గన్పించు
వారి నెల్ల జంపెడివారు. తమ దేవతల కిట్లు బలు లొస
గుచు, తామ కాల్చిన వస్తువుల యెట్టిని మంటలతో,
నచటినుండి మఱియొక ప్రాంతమున కట్టి ఘోర కృత్య
ములు గావించుట కేగెడివారు" —యం. టెయిన్.

ఈ ద్వివిధములగు దాడులకు భారతదేశము గురి
యాయెను. ఇట్టివారు భారత దేశమున భౌతిక సంపదను

గాక మరేమి గాంచగలరు? పశుకృత్యముల ప్రదర్శించుట
దప్ప మరియేమి చేయగలరు? వాస్కోడిగామా కాలము
నుండియు నిట్టి క్రూరులు, దురాశాపరులు మన దేశమున
ప్రబలిరి. వీరి చర్యల ఫలితములను వేరుగ వ్రాయవలెనా?

వీరు భారతదేశమున ప్రవేశించుటయే తడవుగ వీరి సహజ స్వభావము, క్రూర కృత్యములు దెలియని భారతీయులు తమ మృదుస్వభావముతో వీరిని హృదయపూర్వకముగ సత్కరించి యాదరించిరి. కాని వీరి క్రూర కృత్యములు బయటపడిన వెంటనే భారతీయులు విభ్రాంత మనస్కులైరి. అయ్యను వారికి పశుబలముతో జవాబీయ నెట్లగైరి. ఈ సీచభావములు మన నాగరికతకు, సాంప్రదాయమునకు దూరములుగదా!

పరదేశములందు తమ సరకులు విక్రయించుకొనుటకు భారతీయులు పశుబలమునుగాని, ఒత్తిడినిగాని ప్రయోగింపలేదు. వాని యమూల్య వస్తువుల సౌందర్య కాంతులచే నాకర్షింపబడియే పరులు వీనిని గ్రహించిరి. వీరి స్వభావములు, నాగరికతా లక్షణములు అహింసా సత్యములపై నాధారపడి యున్నవి.

"వీరు లోకములో నెల్ల నుత్తమ వణిజులు, సత్యవంతులు. ఏమిచ్చినను వీ రన్యథ మాడువారుకారు."

—మార్కోపోలో.

"భారతీయులకు సత్యమం దాదరణము గలదు. ఎట్టి వ్యవహారములందైన నింతింతనరాని విశ్వాస పాత్రులు."

—అబుల్ ఫజల్.

"సత్యసంధత కేవలము భారతీయుల సొమ్ము. సూన్యత వాక్యము నిట్లాదరించిన వా రన్యదేశములలో లేరు."

—ఫిల్లిమోరు.

భారతదేశము పాశ్చాత్య ప్రపంచమునకేగాక ప్రాగ్దేశములందును తన సంస్కృతి నాగరికతలను, విజ్ఞాన వికాసములను స్వేచ్ఛగ వెదజల్లెను. చీనా, జపాను, సయామ్, బోర్నియో, సుమత్రా మున్నగు దేశములెల్ల తమ సర్వ నాగరకతా లక్షణములు భారతీయులనుండి పడసి, వికసింపజేసికొనుటయేగాక నేటికిని భారతీయులయెడ తమ కృతజ్ఞతను ప్రకటించుచున్నవి. ప్రాగ్దేశీయులు తమకు సహన శీలత, అన్యోన్య ప్రేమ సహజమని ధ్రువపఱచుచున్నారు. భారతీయులు నేటికిని వారి హృదయముల నాచార్య పీఠము నధిష్ఠించుటచే భారతీయులయెడ వారి కింత కృతజ్ఞత గలదు.

గ్రీకులు, హూణులు, స్కిథియనులు మున్నగువారితో సంబంధ సంఘర్షణల ఫలితముగ భారతీయులు తమ నాగరికతా ప్రభావమును శాంతియుతముగ వారిపై ప్రసరింపజేసిరేగాని బలవంతముగ నంటగట్టలేదు. మహా

మ్మదీయులు భారతీయులపై బెక్కు శతాబ్దములు కత్తితో క్రూరములగు దాడులు గావించిరి. వారి పవిత్ర దేవాలయములు పాడుచేసిరి. కటడములు కూలద్రోసిరి. గ్రంథరాజములు భస్మమొనర్చిరి. కాని భారతీయులు వారికి మసీదులు గట్టిపెట్టియు, సహనభావమును బ్రదర్శించియు వారిని తమ వారుగనే చూచుకొని నాగలిని, నాగరికతను వారికి బ్రసాదించిరి. చీనా, జపాను దేశముల బుద్ధభగవానుని పవిత్ర ధర్మము - అహింసా వ్రతము ప్రబలెనేగాని కన్ఫ్యూషియను మతమునుగాని, షింటో మతమునుగాని పాఱద్రోలెనా? వానిని గర్హించి దారుణ్యమును బ్రదర్శించెనా? కాకపోగా పైపెచ్చు ఆర్యమత నాగరికతలకు వన్నెదెచ్చి శోభాయమాన మొనర్చెను.

సంస్కృతి యన సంఘమున లీనమై సర్వదా ఉన్నతిని ప్రవహించు నాచరణరూపము దాల్చిన భావ పరంపరయే గాని బలవంతముగ నంటగట్టు క్రూరకృత్యము గాదు. వాంఛల నీడేర్చు కామధేనువు గాని అరువొసగి యత్యాచారము లొనర్చు కఠోర హృదయము గాదు.

అమెరికా, ఆఫ్రికా ఖండములందలి పూర్వవాసులను పాశ్చాత్యులు నామరూపములు లేకుండ జేసిరే! తామేగిన తావులలో పరులను హింసించి, క్రూరవధలకు గురి

చేసిరే ! ఏదీ ! భారతీయు లట్లు గావించిన దృష్టాంత మొక్కటియైన జూపగలరా !

చంద్రగుప్తుడు, హర్షుడు, అశోకుడు విశాలమనస్సుతో, నైతికదృష్టితో న్యాయమును బరిపాలించి ప్రజాకళ్యాణ మును జేకూర్చిరేగాని అల్ప మనస్సుతో, పశుబలముతో ప్రజలను బంధించి హింసించిరా? సత్యము స్వయంప్రకాశ మానము. దాని కితర కాంతు లనవసరము. అవినీతికి, హేయత కిందు తావులేదు. భారతీయు లిట్టి నైతిక, ఆధ్యాత్మిక సత్యమునే ప్రబలజేసిరి. భారతదేశము పశు బల సంపన్నుల ధాటీ పరంపరల కాలవాలము గానిచో ప్రపంచము నేడు శాంతియుత జీవితముతో శోభిల్లి వర్ధిల్లెడిదే.

స్త్రీలు

పాశ్చాత్యులలో పెక్కుఁడకు భారత సంఘమును గూర్చి దురభిప్రాయములు, దురూహలు ప్రబలియున్నవి. కొలదిమంది భారతీయులును వీరి ననుకరించుచు వీరి భావములనే ప్రతిధ్వనింపజేయుట గర్హ్యము. ఇట్టి దురభిప్రాయములలో ప్రధానమైనది మన స్త్రీలను గూర్చి. సామాన్యమగు మానసిక ఔన్నత్యమును, ఔచిత్యమును గూడ బొరదోలి, నీతి దూరులై, పశుభావములను బ్రదర్శించు ననాగరికులవలె వీరు మన స్త్రీలను విమర్శించుచున్నారు. తమ కంటి యద్దములరంగు వలెనే దృశ్యములు గూడ నుండును. తాము మదాంధులుగాన ప్రపంచము గూడ మదాంధముగనే గన్పించును. తృష్ణాబుద్ధితో శారీరిక సుఖముల గోరువారికి ఆంతరంగిక సౌందర్యమెట్లు గాన్పింపగలదు? 'యద్భావమ్ తద్భవతి' 'భారతీయులు తమ స్త్రీలను బానిసలవలె నీచులుగ జూచుచుందు' రనియు, 'తుచ్ఛభోగముల కొఱకు యంత్రములవలె వినియోగించుకొనుచుందు'రనియు, 'ప్రపంచమందలి తక్కిన యన్నిజాతులకన్న భారతీయులు తమ స్త్రీలను న్యూనముగ, అగౌరవముగ జూచుచుందు'రనియు పెక్కురు

నుడివిరి. భారతీయ సంఘమును గాని, భారతీయ స్త్రీలనుగాని యేమియు నెఱుగని - తత్ స్వరూపమును దెలిసికొనలైన ప్రయత్నింపని పాశ్చాత్య లిట్లు వ్రాయుట వారికిగల యీర్ష్యాద్వేషములను, అజ్ఞానమును జూపునే గాని సత్యాన్వేషణమునుగాని, విజ్ఞానమునుగాని జూపదు. వీరి వ్రాతలనే పెక్కు రుల్లేఖించి తమ గొప్పతనమును బ్రదర్శించుకొనుచుంటలు, తమ మానసిక తృష్ణను దీర్చుకొనుచుంటట గర్వ్యము. ఈ విషయములు సహేతుకముగ విమర్శించి ఖండించుటకు పూర్వము పాశ్చాత్యులు తమ స్త్రీల నెట్లు చూచిరో తెలిసికొనుట యత్యవసరము. గ్రీసు, రోము మున్నగు దేశ వాసులు తమ స్త్రీల నెక్కుడు మర్యాదగ జూచిరని పాశ్చాత్యులు విఱువీగుచుందురు. కాన పాశ్చాత్య మహిళా సంఘ స్థితి నిచ్చట కొంత వివరింతుము.

తామొగర్వించు గ్రీకు నాగరికతలో స్త్రీల యవ్వాన్న త్యము నెచటను చరిత్ర పేర్కొనలేదు. అంతియకాదు; తద్విరుద్ధముగ ప్రాచీనకాలపు గ్రీకు స్త్రీలగతి చూపుచున్నది. "స్త్రీలు పురుషులకంటె తక్కువ. వారు పురుషుల వాంఛల నెరవేర్చుటకును, బిడ్డలను గను తల్లు లగుటకును మాత్రమే యున్నారు." —లూయిస్ డికిన్సన్.

"గుణసంపదగల స్త్రీకు స్త్రీల స్థితియు సామాన్యముగ చాల నీచముగ నుండెను. ఆమె తన్ను గన్న తల్లిదండ్రులకు బానిసగను, తన్ను బెండ్లాడిన భర్తకు నౌకరుగను, భర్త మరణించిన-చో దన బిడ్డలకు దాసిగను నుండెను."

—లేక్.

"వివాహమున బిడ్డల గనుటయే యనియు, స్పార్టాలోని వృద్ధులెల్లరును యౌవనవతులగు తమ భార్యలను బలాఢ్యులకు విడిచిపెట్టవలె ననియు, నందుఁబలన దేశ రక్షణకు వలయు బలిష్ఠులగు సైనికులు సృష్టింప బడుదు రనియు భావింపబడెను."

రోమనులు గూడ నిట్లే స్త్రీలను అగౌరవముగ జూచుచు, కామతృష్ణతో బ్రదర్శించుచు, వారి నొకకంట జాగరూకతతో గనిపెట్టి యుండవలెనని ప్రకటించిరి.

పరస్త్రీలను తమ తల్లుల వలె భావింపక వారితో యథేచ్ఛముగా విహరించు నిచ్చతోడనే కొంత విహారస్వేచ్ఛను వారి కొసగిరి. వారి దేవుడే స్త్రీతో నిట్లనును. 'నీకు దుఃఖమును, ఎక్కువమంది బిడ్డలును గలుగుదురు. దుఃఖము తోడనే నీవు బిడ్డలను గనవలెను. నీ పాంచలు నీ భర్తకొరకే. ఆయన నీపై యధికారమును చలాయించి రాజ్యము చేయును.'

—బైబిలు.

ఏసు ప్రభు తన తల్లి నెట్టి దృష్టితో చూచెనో గ్రహించి నచో స్త్రీలయెడ వారికిగల దృష్టి స్పష్టమగును.

"స్త్రీ పురుషుని కణగి మణగియుండి, నిశ్శబ్దతయందే విజ్ఞానమును బడయవలెను. స్త్రీ బోధించుటకుగాని, పురుషులపై యధికారమును చలాయించుటకు గాని నే నెప్పుకొనను. ఆమె నిశ్శబ్దముగ నుండవలెను."

—బైబిలు.

"భార్యలారా! భగవంతునికివలెనే మీ భర్తలకు గూడ లొంగి యుండుడు." "పురుషునికి శిరస్సు ప్రభువు. స్త్రీకి శిరస్సు పురుషుడు." —సెంట్ పాల్.

"మానవుని పతనము గావించిన నీచస్వభావ స్త్రీయే" యని క్వాన్‌లా వేరొకనుచున్నది. ఆమె 'దుర్బలనావ' 'వెడదిబ్బ' 'పైన దేవాలయము, క్రింద మురికికూపము' 'స్త్రీ దృష్టినుండి పారిపొమ్ము' —చర్చి ఫాదర్స్.

పాదిరీల దృష్టిలోగల స్త్రీల స్థితినింకను గమనింపుడు. "స్త్రీలు నరకద్వారములు. సర్వరోగములకు, దుఃఖాను భవములకు పుట్టినింట్లు. ఆమె తాను స్త్రీనని చెప్పుకొనుటకు సిగ్గుచెందవలెను. ప్రపంచమున కొసగిన శాపఫలితముగ ఆమె నిత్యము పశ్చాత్తప్త హృదయగనే జీవింపవలెను."

—లే.

"స్త్రీ మెఱుగు నూనెలతో కప్పబడిన ప్రకృతిలోని నీచ వస్తువు". —క్రిసోస్టమ్.

"తాము మరణించుపరకును బిడ్డలను గననిమ్మ్రి. ఇందులకే వారు సృష్టింపబడిరి." —మార్టిక్ లూథర్.

ఈయన దృష్టిలో స్త్రీలు బిడ్డలను గను యంత్రములే యనుట నిశ్చయమే గదా !

"ఆంగ్లదేశమును నార్మనులు జయించిన కాలమున నాంగ్లస్త్రీలను కొని ఐర్లెండులో మారుబేరమున కమ్మ్రి నాచార ముండెడిది. కొన్ననారు యుక్త వయస్కులగు స్త్రీలను గర్భవతులుగచేసి విపణివీధుల బెట్టి యెక్కువ ధనమును బడయుచుండిరి." —టెయినీ.

"బాక్సన్ కాలమున నాంగ్ల శాస నానుసారము స్త్రీకి వివాహానంతరము వ్యక్తిత్వమే లేదు. ఆమెకు హక్కు లనునవి లేవు. నార్మనులు జయించిన యనంతరము చాల కాలమువఱకు నామె తన భర్తకు కేవల ముంపుడు గత్తెయే. స్త్రీ తన భర్తను జంపిన-చో ఖానీనేరము క్రింద గాక తన రాజునకు ఎదురు దిరిగిన దను నేరమును మోపి శిక్షించెడివారు. ఆమెను భర్త బాధించిన-చో నామెకు 'చర్చికోర్టు' మాత్రమే శరణ్యము."
—జార్జి ఏ. డాన్సే.

పారిశ్రామిక విప్లవకాలమువలుకు నాంగ్లస్త్రీ యచ్చటి పురుషునకు బానిసయే. యంత్రాలయములు పెంపొందినకొలది వానిలో స్త్రీలు ఎక్కువ పనులను చొకగ చేయగల నైపుణ్యమును బ్రదర్శించిరి. ఆర్థికముగ నిది లాభదాయకము గాన, స్త్రీల నెక్కువగ యంత్రాలయములలోని పనులకు వినియోగించిరి. కొంతమందికి పెద్దజీతములను, పెద్ద యుద్యోగములనుగూడ వీనియందొసగిరి. ఇందువలన స్త్రీలకు కొంత ఆర్థిక సౌష్ఠవము, స్వాతంత్ర్యము లభించెను. తత్ఫలితముగ నామెకు తన హక్కులను బ్రకటించు శక్తి గలిగెను. స్త్రీలు సంఘముల నేర్పఱచుకొని, తమ హక్కులను ధైర్యముగ వెలిబుచ్చుచు వానికొఱకు పట్టుదలతో తీవ్ర కృషి గావించిరి. పురుషుల నెదిర్చి యెత్తిడి చేయసాగిరి. యంత్రాలయములందు ఆర్థిక నష్టము గలుగు ననుభీతితో పురుషులు వారికి కొన్ని కొన్ని హక్కులను క్రమముగ నొసగసాగిరి. నైతిక సాంఘిక దృష్టులతో మాత్రము పాశ్చాత్య పురుషులు తమ స్త్రీల యభివృద్ధిని వాంఛింపలేదు. అందుకు స్త్రీలు తమ హక్కుల పోరాటము గావింపను లేదు. ఈ విషయమున కేవలము ఆర్థిక రాజకీయ దృష్టులే ప్రాబల్యము వహించెను. తరువాత పురుషులతో సమానములగు హక్కులకు తీవ్రములగు పోరాటములు, బహి

ష్కరణములు చేసి పెక్కు కష్ట నష్టములకు గుఱియై
తమ హక్కులను కొలది కాలము క్రితమే పడయ
గలిగిరి.

ఇక భారతవర్షమున భారతీయ స్త్రీల విషయ మాలో
చింపుదము. వైదిక కాలమున భారతసంఘమున స్త్రీలు
గౌరవ స్థానము నలంకరించిరి. "యో భర్తా సా స్మృతాం
గనా" భర్తయే స్త్రీ యని దీని భావము. అనగా స్త్రీ
పురుషు లిరువురు సొక్కటియే. స్త్రీ యన నర్ధాంగి.
పురుషునితో సమాన ప్రతిపత్తి, గౌరవము గలది. స్త్రీ
లేనిచో పురుషుడెట్టి కర్మకాండగాని గావింపజాలడు. స్త్రీ
యతనికి సహధర్మ చారిణి.

సాంఘిక జీవనమున ప్రతి కార్యమునందును స్త్రీదే
ప్రథమ స్థానము. భార్యా భర్తలు, మాతాపితృలు,
సీతారాములు, రాధాకృష్ణులు ఇత్యాది పదములును
ఆ ప్రథమ స్థానమునే చూపును.

"ప్రాచీన భారతీయుల వివాహ పద్ధతి యందలి పవి
త్రత, గౌరవము, ఆశయము, ఆదర్శము ప్రపంచము
నందలి మరి యే దేశమునగాని, మతమునగాని గాంచ
జాలము. సతీమణుల పాతివ్రత్య ప్రభావమును, మాతృ
దేవతల స్వార్థరహిత త్యాగాలంకృత జీవిత మహిమను

లోకమున మటెచటను గానము. స్త్రీ గృహమునకు పవిత్ర దేవత. గృహమునకు ప్రకాశవంతమగు జ్యోతి. గృహాలక్ష్మి."

—ఆనిబిసెంటు.

"ప్రాచీన కాలమునం దే దేశమునను స్త్రీ లింత యున్నత స్థానము నందియుండలేదు. వారు మత ధర్మ ములన్నిటి యందును పురుషులతో సమాన స్థానము నలంకరించిరి. భారతీయుల వేదములందును పురుషుల వలెనే స్త్రీలు గూడ పెక్కు మంత్రములకు 'దృష్ట'లుగ నున్నారు. ఈ స్త్రీలను బ్రహ్మవాదినులు (బ్రహ్మను బ్రకటించువారు) అని నుడివెడినారు. వీరు మతమును గూర్చి తర్కించి విమర్శించుటకును, ఇతరుల కద్దానిని బోధించుటకును సర్వ స్వాతంత్ర్యములు గలిగి యుండిరి."

—విల్సన్.

"ఇమం మంత్రమ్ పత్నిపఠేత్" —శ్రౌత సూత్రము.
"బ్రహ్మచర్యేణ కన్యా యువానం విందతే పతిమ్"
——అథర్వము.

వివాహ కాలమున భార్యా భర్త లిరువురును వైదిక మంత్రములను స్వయముగ నుచ్చరింపవలెను.
"భార్యాభర్త లొకే పదార్థమునందలి రెండు భాగములు. కావున వారు ప్రతి విషయమునందును సమానులే.

ఐహికాముష్మిక విషయములన్నిటి యందును ఉభయులు సమముగ కృషి గావింపవలెను." --సాయనాచార్యులు.

పురుషుడు యజ్ఞ ప్రధానుడు గాన లౌకిక వృత్తులన్నిటి యందును పాటుపడవలెను. స్త్రీ తపః ప్రధాన గాన ఆత్మ నిగ్రహము, ధర్మ త్యాగములందు ప్రాధాన్యము వహించును. మైత్రేయి, గార్గి మున్నగు స్త్రీ రత్నములు మత చర్చలలో, బ్రహ్మజ్ఞాన విచారణలో పురుషులతో సమానముగ తర్క వితర్కములు గావించి విషయ నిర్ణయముల నొనర్చిరి. బ్రహ్మచర్య వ్రతము స్త్రీ పురుషులకు సమానము. లోపాముద్ర, అపాలకన్య, గార్గి, మైత్రేయి మున్నగువారు వేదముల బఠించి మునివృత్తిని బూనిరి. వాచహ్నవి, బడబ, ప్రాతిధేయి, సులభ మున్నగు స్త్రీ లాచార్య పీఠము నధిష్ఠించిరి.

"భార్య తన భర్తను ప్రేమించుట యాతని దేహము కొరకు గాక దాని యందలి యాత్మ కొరకే. భర్త భార్యను ప్రేమించుట యాశరీరము కొఱకు గాక దాని యందలి యాత్మమూలమునే" యని యాజ్ఞవల్క్యుడు తన భార్యయగు మైత్రేయికి బోధించెను.

ఆనాటి స్త్రీలు బ్రహ్మవిద్యనేగాక శస్త్రమునుగూడ బ్రదర్శించి, పెక్కు యుద్ధములు గావించి, శత్రువుల

నోఁచి రనుటకు ఋగ్వేదమునందు బెక్కు ఆధారములు గలవు. పురాణ కాలమునగూడ స్త్రీలు ఉన్నత స్థానము నధిష్ఠించిరి.

"ఆమెకు స్వవిషయము లన్నిటియందును పరిపూర్ణ స్వాతంత్ర్యము గలదు. స్వాతంత్ర్యమునందు నేటి స్త్రీ పలవరించు విపరీత స్వప్నములకంటె మేలుగ నాటి కాంత పురుషునితో సమానమగు హక్కులు గలిగి యుండెను." —ప్రిన్సిపాల్ జార్జి హావెల్స్

రామాయణమునందలి సీత, భారతమునందలి దమయంతి ప్రవర్తనములను గూర్చి యమ్. ఎల్. బారన్ గ్వేరర్ డి చమాస్టు ఇట్లు నుడివెను.

"గ్రీకులు, రోమనులు — మహాకవులగు హోమర్ గాని, వర్జిల్ గాని — యూహింపజాలని స్త్రీల యౌన్నత్యమును, ప్రాశస్త్యమును, సౌకుమార్యమును తమ తమ రచించిన సంస్కృత సారస్వతమునందు భారతీయ కవులు వర్ణించి యుండిరి. భారతీయ సంఘమునందు స్త్రీల కిటి పవిత్ర స్థానమే లేనిచో నీకవులట్లు లిఖియించియే యుండ జాలరు. దీనిని నమ్మకుండుట మూర్ఖత్వము. అవివేకము. భగవంతుడు శూన్యమునుండి తన సృష్టి నెట్లు గావింప లేదో అట్లే యేమియు లేనిదే యీ కవులు గూడ నిట్లు లిఖియించి యుండజాలరు."

సంఘమున కవుల వర్ణనలకు పాత్రములయిన యిట్టి సత్ప్రవర్తనలు వారికి హక్కులు, బాధ్యతలు, ధర్మములు లేకయే కల్గునని వచియింపనగునా? విధి బాధ్యతలు లేకయట్టివారు సంఘమున సృష్టియగుదురా? క్షత్రియ స్త్రీలు ధనుర్వేదము నభ్యసించి యుద్ధములు గావించుటకును నైపుణ్యము బడసి యుండిరి. కైకేయీ సత్యభామాదులు చేసిన రణముల మాట నెక్కడ మారు స్మరియింపుడు.

కుంతీదేవి తన కుమారులగు పాండవులను జూచి పలికిన పల్కులు గమనింపుడు.

"క్షత్రియ స్త్రీ తన కుమారులగని పెంచిన దింపులకే. (ధర్మయుద్ధములు గావించుటకే) కావున వీరులవలె శత్రువులతో యుద్ధము చేసి జయమును బడయుడు."

ఇట్లే గాంధారీదేవి తన పుత్రుడగు దుర్యోధనున కెన్నియో నీతులను, సలహాల నెసగెను. భారతీయులు తమ స్త్రీల నున్నత స్థానమున నునిచి, సమాన గౌరవ మర్యాద లొసగనిచో తమ దేవతలతోబాటు స్త్రీల నున్నత శిఖరమున నుంచజాలరు. కాళికాదేవి ఆదిశక్తి. లక్ష్మి సిరిసంపదల కధిష్ఠాన దేవత. సరస్వతి విద్యా దేవత. ఆదర్శ జ్ఞానమూర్తి. మానవుని జీవితమునందు శక్తి,

సంపద, విజ్ఞానములు నమూల్యములుగదా! ఈ సంపద లన్నియు స్త్రీలవే యన్న నిక స్త్రీల యౌన్నత్యమును వేరుగ వచియింపవలయునా! స్త్రీకి శక్తిసామర్థ్యములు, గౌరవ మర్యాదలు లేనిచో సంఘము నం దిట్టి యున్నత స్థానములను పురుషులచే బడయుట యసంభవముగాదా!

మనుస్మృతి స్త్రీ స్వాతంత్ర్యములో కొంత జోక్యము గలిగించుకొన్నదనుట వాస్తవమే. కాని ఆ మనువే "స్త్రీలు గౌరవింపబడు తావులందే దేవతలు సంతసింతురు. వీరిని గౌరవింపనిచో మతకర్మము లన్నియు నిష్ఫలములు. స్త్రీలు దుఃఖించు కుటుంబములు త్వరలోనే నశించును. వారు సుఖించు కుటుంబములు సుఖసంపదలతో తులదూగును."

"నూరు తప్పులు గావించిన భార్యనుగూడ భర్త పుష్పములతో నైనను కొట్టజనదు."

"వేయిమంది తండ్రులకన్న మిన్నగ తల్లిని పూజింప వలెను."

"భారతీయునకు మాతృదేవతను మించిన దేవతలేదు."

"జననియు, జన్మభూమియు స్వర్గమునకన్న మిన్నలు."

అని యిట్లు పెక్కువిధముల ఘంటాపథముగ జెప్పి యున్నాడు. కనుకనే స్త్రీ స్వాతంత్ర్యమును కుంచించుచు

మనువు పేరనున్న శ్లోకములు సంకుచిత బుద్ధు లెవరో తరువాత చేర్చియుందురని పండితులు కొందరు చెప్పు చుండుట వాస్తవమే యయి యుండవచ్చును.

పవిత్రాదర్శములకు ఆలవాలములు, ఆదర్శ చరిత్రలు నగు సీత, సావిత్రి, దమయంతి మున్నగు మహా పతివ్రత లీ భారత దేశమున నెందరెందరో యుద్భవిల్లిరి.

బుద్ధుని కాలమునను, బౌద్ధమతమునను స్త్రీలు పురు షులతో సమానోన్నత స్థానము నలంకరించి రాణించిరి.

"బాలికలకు సామాన్య విద్య, శాస్త్రములు, కళలు గూడ నేర్పెడివారు. గృహములు, రాజభవనములు వీరిచే చిత్రింపబడి, యలంకృతములై నృత్య గాన కళలతో నానందమును వెదజల్లుచుండెడివి." —క్లారిసే బేడరు.

"కాళిదాసు దేవకళ నొక స్త్రీకి బోధించెను."

—శ్రుతబోధ.

ఖన్నా లీలావతులు జగత్ప్రఖ్యాతిని గాంచిరి. ఖన్నా రచియించిన ఖగోళశాస్త్రము, లీలావతి గణితశాస్త్రము నేటి శాస్త్రవేత్తలచే గూడ పఠింపబడుచున్నవి. మండన మిశ్రునితో నాత్మవిషయమున శంకరాచార్యులు వాదింప బూనినపుడు తమ జయాపజయముల నిర్ణయింప మండన మిశ్రుని భార్య యగు 'విద్యాభారతి' (ఉభయభారతి)నే

మధ్యవర్తినిగ నియమించిరి. ఇంతటి పరమ గూఢమగు తాత్త్విక విషయమును జర్చించు మహాసమావేశమునకు న్యాయమూర్తిగ నొక స్త్రీని నియమించుటను ప్రపంచమున మరేదేశమునందైన గాంచగలమా!

ఆ కాలమున నాటక కళను స్త్రీలే పోషించిరి. ప్రాచీన కాలమున సాంఘిక జీవిత నాటకములు ప్రదర్శించుటలో గౌరవ కుటుంబముల స్త్రీలు పాల్గొని నటించినది ఒక్క భారతదేశమున మాత్రమే. ఈదేశమున ఆర్థికముగగూడ స్త్రీది యగ్రస్థానమే. పాడి పశువుల పోషణయు, వాని వలన లభించు పాలు, పెరుగు, నేయి మున్నగు వస్తువులును స్త్రీ స్వాధీనములు. గృహపరిశ్రమలు, పూల తోటలు స్త్రీ యధీనములు. రాట్నము స్త్రీ హస్తగతము. పాడి పశువులును, రాట్నములును ఏనాడు స్త్రీ హస్తగతములో ఆనాడే ఆర్థిక సంపద స్త్రీ స్వాధీనమున నుండక తప్పదు. 'కదురాడినను, కవ్వమాడినను కఅవు లేదు' అను సామెత జగద్విదితము. ఋతుధర్మములు సక్రమముగ నడుపక పోయినను, కాలమానము సరిలేక పంటలు పండక పోయినను, పాలు మాత్రమే గ్రోలి ఆరోగ్యవంతమగు సుఖ జీవితమును గడపవచ్చును గదా! ఇట్లే ఎట్టి భోగములు లేకపోయినను, రాట్నచక్రముచే లభించు నూలు తోడ నేసిన కొల్లాయులైన ధరించి

మానము గాపాడుకొనవచ్చును. కాబట్టి మానప్రాణ ముల గాపాడు నీ రెండువృత్తులును స్త్రీ చేతి కొప్పగింప బడుటలోని భావ విశేషమును గమనింపుడు. కుటుంబ జీవిత నిర్వహణము, తద్గారవపోషణము స్త్రీ హస్తమున నుంచుట యందలి భారతీయుల పవిత్రాదర్శము ప్రశంస నీయము గాదా!

'అర్థస్యసంగ్రహేచైనాం,వ్యయేచైవనియోజయేత్' మనువు

"గృహదేవాలయమున త్రికాలములందును పూజలు, నిత్యకర్మములు, దానాది సత్క్రియలు జరపును. కుటుంబభారమును పత్నియే తలదాల్చును. ఆదాయము నెఱిగి, దానికనుగుణముగ వ్యయ మొనర్చును. దైనికా దాయ వ్యయముల నెప్పటికప్పుడు సరిచూచుచుండును.

పతి తన యాదాయమునకు మించిన వ్యయమొనర్చి నచో సతి గృహమున హానిని మందలించి నిరోధించును. అవసరమగు సంభారముల నెల్ల సేకరించి, కూడబెట్టి సక్రమముగ వినియోగించుచుండును. గృహనిర్వహణ కార్యమందామె సిద్ధహస్త. ఆమె స్వీయగృహ పరిచార కుల జీతములు చెల్లించి, సేద్యమునకు వలయు వ్యవస్థయు సలిపి, పశువులను లెస్సగ గాపాడి పెంపుడు పిట్టలను, జంతువులను జాగ్రత్తగ పోషించును. ఇంటి తోటను

క్రమముగ పాలించి ఫలదాయకముగా జేయును. తన పతి యింటలేనపుడతని వ్యాపారములన్నెల్ల చక్కదిద్దును. యజమాని లేని లోప మేమాత్రమును గలుగనీయదు. ఇంట మిత వ్యయమొనర్చును. క్రయ విక్రయములు పరిచారికల సహాయముతో సలిపి యాదాయమును వృద్ధి చేయును. వంటయింటి పనిని మాత్రము తానే జరుపుకొనును. తీరిక వేళలందు నూలువడుకును. బట్టలు నేయును. ఆర్థికముగ, మానసికముగ, నైతికముగ, ఆధ్యాత్మికముగ పరిపూర్ణత్వమునందిన సీమంతినీ చూడామణి అమెయే."

—వాత్స్యాయనుడు.

మహమ్మదీయుల కాలమునగూడ భారతీయ స్త్రీలు తమ పురుషులతోబాటు పౌరుష, సాహసముల బ్రదర్శించి యుద్ధములు గావించిరి. జయము గల్గుదాక — లేక — ప్రాణములున్నంత దనుక వెన్నుజూపక శత్రువులతో యుద్ధములు గావింపుడని తమ భర్తలకు ప్రబోధము గావించి ప్రోత్సహించినది స్త్రీలే. యుద్ధమునుండి వెనుదిరిగి వచ్చిన రణతిక్కనకు అతని భార్య యొసగిన సమాధానమును స్మరింపుడు. అక్బరు నెదిర్చి అహమ్మదు నగరపు కోటను రక్షించిన చాందు బీబీ పౌరుషము నెఱుగమా? ఝాన్సీ యాంగనలు తమ మానరక్షణార్థము తమ ప్రాణములను నగుమోములతో జోహారులర్పించిన గాథలు పెక్కు

గలవు. జిజియాబాయి శివాజీ పౌరుషము నుగ్గుబాలతో పోషించి పెంపొందింపలేదా? కాని దురదృష్టవశమున రానురాను మహమ్మదీయుల దాడుల, క్రూరకృత్యముల ఫలితముగనే కాబోలు హిందువులలో కొందరు స్త్రీలకు ముసుగువేయు నాచారమునకు లోనైరి. ఇది కేవలము స్త్రీల తాత్కాలిక రక్షణమునకే గాని వారి నవనత స్థితికి దింపుటకు మాత్రముగాదు. క్రమముగ పాశ్చాత్యులీ దేశమున ప్రవేశించి దేశము నాక్రమింప మొదలిడిరి. ఆ సమయమునగూడ ఝాన్సీ లక్ష్మీబాయి వంటి వీర వనితలు చూపిన యభిమానోన్నత్యమును మన మెరుగుదుముగదా! బెనెటిక్ ప్రభువు రంజిత సింగును జూచుటకు పంజాబున కేగినపుడు డెబ్బదివంది స్త్రీలు పసుపు పచ్చని చీరలు ధరించి, హస్తములందు పాత్రములుపూని యొక స్త్రీ నాయకత్వమున స్వాగత మొసగిరి. భారతీయ జీవన పథము, జీవిత వికాసము, చరిత్ర కేవలము పురుషులవలననేగాక స్త్రీ పురుషు లుభయుల వలనను ఉన్నతి నందినవి. స్త్రీలు పురుషుల ననుకరించుటగాని, వారితో పోటీపడుటగాని భారత సాంప్రదాయమున గానము. నేటికిని సర్వ విషయములందును పురుషులతో బాటు స్త్రీలును అభివృద్ధినొంద కృషి గావించుచునే యున్నారు. ౧౯౧౯ సం॥ న ఆంగ్లప్రభు

వులు తమ స్త్రీలకు స్వల్పాధికారములుగల సంస్కరణ భిక్ష పెట్టిరి. కాని యందు స్త్రీలకు సమ్మతుల నెసగు సరతయు లేదు. దీనిని గరించుచు భారతీయ స్త్రీ పురుషు లెల్లరు పెక్కు విజ్ఞప్తి 'లాంగ్ పార్లమెంటు'నకు బంపిరి. వీని ఫలితముగ నాంగ్లేయులు తాము మాత్రము తమ స్త్రీలకు 'ఓటు హక్కు' నీయ మనియు, భారతీయుల కిష్టమైనచో వారి స్త్రీల కిచ్చుకొనవచ్చుననియు నొక శాసనమును భారతీయ పురుషుల బరీక్షించుటకో యను నట్లు గావించిరి. వెంటనే యొక సంస్థానాధిపతి తన సమ్మతిని బ్రకటించెను. తరువాత రాష్ట్ర శాసనసభలు, నితర సంస్థానములు స్త్రీల యర్హత నంగీకరించుచు శాసనముల గావించెను. ఈ సందర్భమున ఆంగ్లదేశపు గ్యాడ్‌సన్ కన్య తన యాశ్చర్యము నిట్లు ప్రకటించెను.

"అత్యల్ప కాలమున – పదునెకండు వత్సరములలో భారతీయ స్త్రీలు తొమ్మిది రాష్ట్రములందును, నాలుగు సంస్థానములందును తమ సమ్మతుల నెసగు నధికార మును బడసిరి."

భారత స్త్రీలు తమ పురుషులయెడ నసభ్య ప్రచార మునుగాని, ఆందోళనమునుగాని సలుపలేదు. పురుషు లును వెంటనే హృదయపూర్వకముగ స్త్రీ సమానత్వ

మామోదించిరి. ఈ విజయమునుగాంచి గ్యాడ్‌సన్ కన్యా యిట్లు నుడివెను.

"హిందూమహమ్మదీయ మతములు తమ స్త్రీల యెడల బ్రకటించిన పవిత్ర ప్రేమ, స్త్రీ దేవతలకు పురుషు లొసగిన ప్రాధాన్యము, బ్రాహ్మణులు తమ భార్యలతో సహా క్రతువులు గావించుట ఘోషాలోగూడ గూఢ మగు పవిత్రతను బ్రకటించుటయే."

ఆంగ్లపాలనాఫలితముగ దేశము అజ్ఞానమయమా యెను. భారత విజ్ఞానమును బ్రదర్శించు సహజప్రేమను ఆంగ్లప్రభువులు నిరాదరణ దృష్టితో జూచిరి. వారు మనకు సక్రమ విద్య నెసగలేదు. ఈ విద్యను బడయుట కైనను అత్యల్పావకాశమును మాత్రమే యొసగిరి. ఇట్టి నిరాకృతస్థితియందును మన స్త్రీలు ఉన్నత విద్యల నభ్య సించి, వైద్యురాండ్రుగ, న్యాయవాదినులుగ, కవయిత్రు లుగ నున్నారు.

ఒక స్త్రీ చెన్నరాష్ట్ర శాసన సభకు ఉపాధ్యక్షురాలుగ (శ్రీమతి రుక్మిణీలక్ష్మీపతి) ఎన్నుకొన బడెను. వేరొక స్త్రీ సంయుక్త పరగణాలలో మంత్రిణి (శ్రీ విజయలక్ష్మీ పండిట్) యూయెను. శాసనసభల సభ్యురాండ్రుగ, స్థానిక సంస్థల సభ్యురాండ్రుగ బెక్కురు స్త్రీలు గలరు. గౌరవ

కుటుంబములకు జెందిన స్త్రీరత్నములు పురుషుల కేమియు తగకుండ - వేలకు వేలు - మహాత్ముని నాయకత్వమున కాంగ్రెసు ఆదేశాను సారముగ నడుపబడిన సహాయ నిరాకరణోద్యమమున తీవ్రముగ పాల్గొని, పర ప్రభుత్వ ముచే నీచముగ హింసింప బడియు కారాగారముల నలంక రించిరి.

భగల్పూరు సంస్థాన వాసినియగు నొక సతీమణి తక్కు ఫర్డునందు ఉన్నత విద్యను బడసి పెక్కు పాశ్చాత్య దేశ ముల పర్యటన మొనర్చి, స్త్రీ సంఘములందు కృషి గావించి తన యనుభవముల నిట్లు ప్రకటించెను.

"భారత జాతీయ జీవితమునందును, తద్వికాసము నందును తమ స్త్రీలు పాల్గొని, కృషి గావించుట సహజ మని మా పురుషులు భావింతురు. పాశ్చాత్యులవలె స్త్రీలను తమకు ప్రతిస్పర్ధులుగ మా పురుషులు దలంపరు. భారతీయులకు స్త్రీలు సహధర్మ చారిణులు. ప్రతి కార్య మును స్త్రీతో గూడ గావింపవలెను. స్త్రీల కృషికి, ఔన్నత్యమునకు మహాత్మాగాంధిచే నడపబడిన జాతీ యోద్యమము చక్కని సక్రమ ప్రోత్సాహము నొసగినది. గాంధీజీయుద్యమము స్త్రీలను రాజకీయరంగమునదింపెను. గృహపరిశ్రమలను పునరుద్ధరించి, యభివృద్ధికి దెచ్చుటకు

కృషి గావించినది స్త్రీలే. వారే పౌరధర్మమును నిర్వహించుచు, తమ బాధ్యతను గమనించుటయే తడవుగ ముందంజవైచి తమ దేశమును తాము చక్కగ పాలించుకొనగలమని ప్రకటించిరి. స్త్రీలు పరిపాలనా దక్షత గలిగి, తన్నిర్వహణమునకు బూననిదే యేదేశముగాని యభివృద్ధి బడయజాలదని విశ్వసించుమారిలో భారతీయుల గ్రస్థానము నలంకరింతురు. మేము శాసనసభలకు సమ్మతులిచ్చునర్హత బడసితిమి. ఒక సంవత్సరములోనే ఆస్తి, విద్యలందలి తారతమ్యముల బాటిద్రోలి సంపూర్ణాధికారములు పురుషులతో సమానముగ గలిగి యుందుము. దేశమున నేడు ఏబదికిమించిన స్త్రీల సంఘములు గలవు. ఇవియెల్లను అ. భా. స్త్రీ సంస్థలోబడి యద్దాని యభివృద్ధికి దోహదమొసగుచున్నవి. సాంఘిక సభలందు లలిత కళలు, వివాహ సమస్యలు, కార్మిక స్త్రీలయు, వారి పిల్లలయు సమస్యలు చర్చించి పరిష్కరింప బడుచున్నవి. మాలో డాక్టర్లు, కళాకోవిదలు, కవయిత్రులు గలరు. ఇదంతయు భారతీయ స్వాతంత్ర్యమునకు, అభ్యుదయమునకు, వికాసమునకు స్త్రీ యొసగుచున్న దోహదము. ఇది శుభచిహ్నము."

స్త్రీలయెడ భారతీయులు చూపు గౌరవాదరాభిమానములకు పై వాక్యము లద్దములు.

భారతీయులకు మాతయే పరమ దైవము. అమెయే పూజనీయ. 'జనసీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసీ' 'నమాతుః పరదైవతమ్' 'మాత్రుదేవోభవ' ఇవియే మన ఉత్కృష్టాదర్శములు. శిశువులను బాల్యమున లాలించి పాలనచేయునది మాతయే. అడలుపాటున గాక ఆద రానురాగములతో జీవితమును వికసింపజేయు విశాల హృదయము మాతృదేవతదే. ఉన్నత భావము లను, ఆలోచనములను, ఆదర్శములను గోరు ముద్దలుగ దినిపించునది మాతృదేవియే. మాతృగర్భము ఆనందము నకు గంగోత్తరి. 'ఊయెల నూపుచేయియే యుర్వీమండ లము నూపును.'

పాశ్చాత్య స్త్రీలు తమ పురుషులతో పోరాడి, పోటీ పడి తమ రాజకీయ స్వత్వముల బడసిరి. కాని భారతీయ స్త్రీలో! తమ పురుషుల పరస్పర సహన సహకారము లతో సమానత్వమును బడసిరి. ఇదియు కేవలము పాశ్చాత్య స్త్రీలవలె రాజకీయము గాక నైతికము. నైతికపు పునాదియే జీవితమున కాయువుపట్టు.

సంఘమున వ్యక్తి స్వతంత్రించి నిలువజాలడు. పర స్పర సహకార మవసరము. ఈ సహకార వికాసము భారతీయులకు ప్రాచీన కాలమునుండియు వంశ పరంపరా

గతము. పరస్పర స్నేహ సహనములుగల-చోట హైన్యము లేదు. హైన్యములేక అసమానత్వము ఎట్లుండగలదు? అసమానత్వములేని తావున సమానత్వపు ప్రశ్నకే తావులేదు. ఇక పాశ్చాత్యులలో స్త్రీ పురుష సమాన భావము నిన్న మొన్నటిది. ఇదియును హక్కుల సిద్ధాంత ముపై నేర్పడెను. నీతికన్న రాజకీయమునకు ప్రాధాన్య మొసగు పాశ్చాత్య సంఘమునందు మానవ సంబంధము లొక యొడంబడిక వంటివి. పరస్పర వైరుధ్యమును బాపుకొని రక్షణకు దోడ్పడు భావమే యింపు గలదు. ఇది యున్నత నాగరికతను బ్రదర్శించదు.

స్త్రీ పురుషులు సహజ ప్రేమచే నాకర్షింపబడుటయే నిక్కువమగు నాగరికత. స్త్రీ లేని పురుషుడును, పురుషుడులేని స్త్రీయు నసంపూర్ణతను బ్రకటింతురు. ప్రకృతి స్త్రీ పురుషుల నొకే పదార్థమునుండి సృష్టించెను.

'నీవు నాకది చేసిన నేను నీకిది చేసెద' నను వ్యాపార సమస్యకిందు తావులేదు. వీరిరువురి యైక్యమే ప్రకృతి సహజ లక్షణము. వీరి పరస్పర సమ్మేళనమే సంఘ జీవన తత్వము. ఈ సమ్మేళనము ప్రేమచేతనే సాధ్యమగును. ప్రేమ తత్వముచే బంధింపబడినవారు హక్కులకు దేవు లాడక ధర్మమును నిర్వహింప నభిలషింతురు. స్వార్థ

త్యాగమునకు ప్రేమయే మూలము. నాగరిక సంఘము ధర్మ సిద్ధాంతముల మీదనే యాధారపడి యుండును. ధర్మసిద్ధాంతమున కాధారము విశాల ప్రేమయే గదా!

'వీసికేమి? భారతీయ సంఘమున నేటి స్త్రీ స్థితి యేమి? ఆమెను పురుషుడు హీన్యముగ జూచుటలేదా? తన సౌఖ్యమునకు సాధనముగ వినియోగించుకొనుట లేదా? పురుషులు స్త్రీల నణగద్రొక్కుచున్నపుడు వారు తమ హక్కులకు బోరాడవలదా? ఇది న్యాయము గాదా?' అని నవీనులు ప్రశ్నింతురు. ఇది యుచితమే. దురదృష్ట వశమున నేటి భారతీయ సంఘము హీనస్థితికి దిగి స్త్రీని తక్కువగ జూచుచున్నది. ఏమాత్ర మింగిత జ్ఞానము గలవారుగాని, హృదయ వికాసము గలవారు గాని యీ స్థితి నామోదింపరు. నేడు పెక్కురు పురుషులు తమ తప్పిదమును గ్రహించి స్త్రీల సమానత్వమునకు కృషి గావించుచున్నారు. కేవలము స్త్రీలే కృషి గావించి సమానత్వము బడయుట కష్టము. పరస్పర సహకారములు వాంఛనీయములు. కాని రాజకీయాధికారములు పడసినంత మాత్రముననే సమానత్వము వర్ధిల్లదు. సంఘమున నెన్నియో సమస్యలు గలవు. ఇవి యెల్లను సంస్కరింపబడి క్రమముగ పరిష్కరింప బడవలెనన్న పరస్పరాను రాగమత్యవసరము. ఈ యసమానత్వ

మును బరిష్కరింప గలిగినది - రూపుమాపగలిగినది నీతియే - ధర్మమే. నీతికి - ధర్మమునకు ప్రేమ యత్యవసరము, మూలాధారము. ఇది ప్రబలిన వెంటనే యసమానత్వము పటాపంచలై ఐక్యభావము దేదీప్యమాన ముగ వెలుగొందుననుటలో సందియము లేదు. అప్పుడు భారతము ఉన్నతి దిశకింకొక మెట్టెక్కినట్లగును.

త్రివేణీ సంగమము

గంగా యమునా సరస్వతీనదులు మూడును ప్రయాగ వద్ద కలియుచోటును త్రివేణి యందుము. ఇందు గంగా యమునలు ప్రత్యక్ష ప్రవాహాములు. జీవము శరీరమునందు నిక్షిప్తమై దాని కతీతముగ నుండునట్లు సరస్వతీ నదియు నంతర్వాహినియై స్థూలదృష్టికి గానరాక యుండును. అది కంటికి గన్పింపకపోయినను దాని యునికి విశదమే. ఇందు గంగ జ్ఞాన ప్రధానము. యమున భక్తి ప్రధానము. ఈ జ్ఞానభక్తులకు గమ్యస్థానము - సంగమ స్థానము ఆత్మయే. అనగా సరస్వతియే యన్నమాట. ఆత్మ స్థూలదృష్టి కగోచరము. ఇంద్రియాతీతము. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల భాగములే సరస్వతీ యమునా గంగలు. బ్రహ్మ-ఆత్మ-సర్వాంతర్యామియేకాక, ఆయన భార్య సరస్వతియు నంతర్యామినియై స్థూలదృష్టి కగోచరముగ నున్నది. గంగ శివుని భార్య. జ్ఞాన ప్రాధాన్యమునుసూచించును. అనగానద్వైత దృష్టిని బ్రదర్శించుచు స్వరూపైక్యమును బోధించును. విష్ణువు పోషకమూర్తి, ప్రేమస్వరూపుడుగాన లోక కళ్యాణార్థమై అవతరించుచుండును. అదియే యమునాస్వరూపము. యమున విశిష్టై

క్యమును బోధించును. వీని గాథలు భారతీయుల భక్తి తత్త్వమును బ్రకటించును. ఇవి స్వచ్ఛతర రజిత వర్ణ మగు హిమాలయములనుండి తళతళలాడు కాంతులతో పృథ్వీతలమున బ్రవహించుచున్నవి. ఈ ప్రకృతి సుందర దృశ్యము భారతీయుని మానస వికాసమును పెల్లడించును.

పవిత్ర గంగానది భారతీయ విజ్ఞానమును, ఋషుల యమోఘ తపఃఫలమును బ్రదర్శించును. పెక్కురు ఋషు లీ నదీతీరమున కృతాగ్నులయిరి. వారిచట తమ తీవ్ర తపో మహిమచే ప్రత్యక్ష మొనర్చుకొన్న పెక్కు సత్యములను ప్రకటించిరి. ఇవియే ఋక్కులు. ఋషులు మంత్ర ద్రష్టలు. వా రున్న తాలోచనా ప్రపంచమున తదేక నిష్ఠాజీవితములు గడపి, తమ జీవితములందు వానిని సాక్షాత్కరించుకొని ప్రతిఫలింప జేసికొనిరి. శ్రుతులను వెలుగొందజేసిన యీ పవిత్ర ఋషులకు పవిత్ర గంగా తీరమే యాశ్రయము. ఈ శ్రుతులయు, ఋషులయు, గంగాదినదులయు పవిత్రతయే భారతీయుని జీవి తాదర్శము. జీవితజ్యోతి. కాని ప్రాచీన ఋషుల జీవితచరిత్రలు లక్ష్యములే నేటికిని నిలిచియున్నవి గాని, గంగానది మాత్రము తన భౌతిక శరీరముతో పవిత్ర వాహినిగ బ్రవహించుచునే యున్నది. కోట్లకొలది భారతీయుల కామె పవిత్ర మాత. నేటికిని పెక్కురు భారతీయులు

తమ జీవితముల నీ పునీత గంగాతీరముననే గడప నుత్స హించుటయే గాక తమ దేహములను గూడ నీ నది యందే గలుప వాంఛింతురు.

గంగానది అద్వైత విజ్ఞానోత్పాదకము, పోషకమును. నివృత్తి దాయకము. గంగాతీరము వైద్యాలయముల కాల వాలము. విశ్వేశ్వరాలయము, కాళికాలయము మున్న గున పీపవిత్ర నదీతీరముననే యున్నవి. గంగ జ్ఞాన ప్రదా యిని గాన నింవ హృదయ వికాసమును, ప్రేమయు తక్కువ. ఈమెను దెచ్చుటకు భగీరథ ప్రయత్న మవసర మాయెను. గరళము కంఠమున దాల్చిన శివు నంతటివాని శిరమున నీమె గాపుర మొనర్చెను. తానుగన్న బిడ్డలను సయితము హృదయమును రాయి చేసికొని తృణప్రాయ ముగ జంపుటకు జంకలేదు.

యమునయో! భక్తిప్రదాయకము. దీనికి హృదయ వికాసము పరిపూర్ణము. ఇది యితరుల ప్రయత్నము లేకయే ప్రజా కళ్యాణార్థము స్వయముగ నవతరించెను. యమున ప్రవృత్తి ప్రధానము. వైష్ణవమత సాంప్రదా యకము. మధురా బృందావ నాది పుణ్యక్షేత్రము లీ పవిత్ర వాహినీ తీరమున గలవు.

అవతారములలో పూర్ణావతారమగు కృష్ణ భగవాను డీ పవిత్ర నదీతీరముననే యవతరించెను. ఇచటనే వివిధ

భక్తి మార్గములు : శాంత, దాస్య, సఖ్య, వాత్సల్య, మధుర భావములు విలసిల్లెను. కృష్ణభగవానుని భక్తి లీలలు వేరుగ నుడువ నవసరము లేదు. మఱియు పశు పక్ష్యాది సర్వజీవులు భక్తియందే లీనమైనవి. కృష్ణుని మురళీగాన మాధుర్యమును గోపికలు, గోవులు, పక్షులు సర్వజీవులు చవిగొనెను. భక్తిరసమును గ్రోల్చి జీవులను తన్మాయత్వ మొంద జేసిన దీ పవిత్ర వాహినీ తీరకమే. రాస క్రీడలలో, వ్రజలీలలలో గోవులు, యశోదానందులు, ఉద్ధవుడు మున్నగువారీ భక్తిరసమునుగ్రోలి తరించినవారే. యమునను స్మరియించినంతనే కృష్ణ భగవానుడు, గోపికలు, రాధాదేవి మున్నగువారు మనస్సున దగులుదురు. జీవితవికాసము నొసగి యానంద సాగరమున నోలలాడించు భక్తిరసమున కీమెయే జనయిత్రి. భార్యా భర్తల మధుర భక్తిని బ్రదర్శించు తాజ్‌మహలీ పవిత్ర నదీతీరమునసే వెలయుట సముచితముగనే యున్నది.

పవిత్ర గంగా యమునలు కొంతవఱకు భిన్న భిన్న మార్గముల బ్రవహించి తమ గమ్యస్థానమును, ఆత్మ రూపమును నగు సరస్వతితో ప్రయాగయందు లీనమగు చున్నవి. కేవల విజ్ఞానము రసరహితము. భక్తి యెడ తెగని మధుర రసప్రవాహము. భక్తి లేని జ్ఞానము హృదయ కాఠిన్యమును ప్రబలజేయును. జ్ఞానము లేని

భక్తి యంధత్వమును బ్రేరేపించును. జ్ఞానము స్పష్టముగ చూచు వస్తువును భక్తి-విశ్వాసము దూరము నుండియే పసిపట్టును. చిత్రించుకొనును. విశ్వాసము భగవంతుని కొరకు సర్వదా పోరుసలుపును. జ్ఞానము తత్సిద్ధికై వేచి యుండును. జ్ఞానార్జనమున కైనను విశ్వాస మావశ్యకము.

భారతీయు లీపవిత్ర నదులను కేవల జలప్రవాహము లుగ గాక, అవాఙ్మానస గోచరములగు పలువిధ శక్తు లను లీన మొనర్చుకొన్న ప్రభావ ప్రవాహములుగ భావింతురు. ఈ సత్యము నవీన ప్రకృతి శాస్త్రజ్ఞులకు గూడ విశ్వసించి ప్రశంసింపక తప్పదయ్యెను.

"ఇప్పటికిని - మనము విస్పష్టముగ వివరింపజాల నప్పటికి-ఒక విచిత్ర సత్యమేమన గంగా యమునా జలములలో కలరా రోగక్రిములు రెండు మూడు గంటలలో మరణించును. ఈ నదులందు సర్వదా పెక్కు మురికి కాల్వలు కలియుచుండును. వేన వేల శవములను వీనిలో విడిచిపెట్టుదురు. కలరా మున్నగు వ్యాధి క్రిములు, శవములు కుళ్ళి దుర్గంధము వెలివఱచుచుండును గదా! ఈ నదులందు వేలకొలది జనులు స్నానమాడుదురు. వీని జలము స్వచ్ఛమైన దనియు, అపవిత్రత నొంద జాలదనియు, నిర్భయముగ, నుల్లాసముగ నెల్లరు స్నాన

మాడి నీటిని గ్రోలవచ్చు ననియు తలచు భారతీయుల దృఢ విశ్వాసమును ప్రకృతి శాస్త్రమెంత దృఢముగ బ్రకటించుచున్నది! యమున నీటినికాచి వేడిచేసినచో నీ క్రిమి సంహారశక్తి నశించును. ఈ నదీ ప్రాంతపు బావుల నీటియందు కలరా క్రిములు బాగుగ విస్తరించును."

—డాక్టరు: యఫ్. సి. హారిసన్.

"కలరా, విరేచనములు మున్నగు వ్యాధులచే చచ్చి-గంగలో బడియున్న శవములను బరీక్షించితిని. కళేబరము లకు కొలది యడుగుల దిగువ అనగా నీ వ్యాధుల క్రిములు విపరీతముగ నుండదగుచోట పరీక్షింపగా కలరా, విరేచన క్రిములే గాన్పింపలేదు. తరువాత నీ వ్యాధులు గలవారి నుండి క్రిములను తీసి గంగాజలమున వైచితిని. వెంటనే యా క్రిములన్నియు చచ్చెను."

—డాక్టర్. డి. హెరెల్ (ఫ్రెంచి ఫిజిషియన్.)

"కలకత్తానుండి యాంగ్లదేశమునకు ప్రయాణమొనర్చు పొగయోడలు గంగాశాఖయగు హుగ్లీ నదిలో మంచినీటిని నిలువచేసికొనిపోవును. కాని యింగ్లండునుండి కలకత్తాకు వచ్చు పొగయోడలు ఇంగ్లాండులో నైకొను జలము బొంబాయివచ్చు వరకైన నుండక చెడిపోవును. లండను నుండి కలకత్తా కింకను వారము దినముల ప్రయాణ ముండగనే వీరు ఎఱ్ఱసముద్ర తీరమందలి పోర్టుసెడ్ లేక

సూయజ్ కాలువలోనో, ఏడెను తీరములోనో తిరిగి
క్రొత్త నీటిని గైకొందురు."
—డాక్టర్. సి. యి. నెల్సన్ F. R. C. S. (బ్రిటిషు ఫిజిషియన్.)

తఱచు భారతీయ సంప్రదాయమును గౌరవింపని పాశ్చాత్యుల మాట లివి. అట్టిచో భారతీయు లీ నదీ ప్రవాహములను శక్తి మంతములుగ—పవిత్ర వంతములుగ భావించుటలో నాశ్చర్య మేమున్నది? శాస్త్రజ్ఞులు పై జెప్పిన విచిత్ర సంఘటనల బేరొకొనవచ్చునుగాని శాస్త్ర మున కతీతములగు శక్తు లీ జలముల యందు గలవు.

వాని స్థూల శక్తులను ప్రకటించు శాస్త్రకారుని విజ్ఞానమునకు మన మాశ్చర్యమును ప్రకటింపవచ్చును గాని యీ శక్తుల మహిమను—ఆంతర్యమును స్పష్ట పరుప నెవరితరము? కావున భారతీయులకు గంగా యమునలు కేవలము నదీ ప్రవాహములుగావు; పవిత్ర జలదేవతలు. వీని నంటినంతనే మనుజుడు పునీతుడగునని వారి విశ్వాసము. భారతీయు లెచ్చట స్నాన మొనర్చు చున్నను వీని పవిత్ర నామములు జపింపక యుండ మునుకవేయడు. మరియు నీ పవిత్ర నదుల జలములు పాత్రల నింపికొని వచ్చి తమ పానీయ జలములుండు కొంచెము కలిపికొని పవిత్ర భావమున పుచ్చుకొనును.

భారతదేశ సందేశము

భావిభారతస్థితినిగూర్చి నేడు పెక్కురు తీవ్రాలోచనలు గావించుచున్నారు. కొందఱిదివరకే తమ భావములను స్పష్టముగ బ్రకటించినారు. భారతీయ జీవిత మార్గమునుగూర్చి తీవ్రాలోచనములు, వివర్శనములు జరుగుచుండుట శుభసూచకము. వీనిని గూర్చి కొంత విపులముగ చర్చింతము.

భారతీయు లభివృద్ధిని గాంచవలెనన్న సంఘజీవితమును ఆర్థికాధారములపై నిర్మింపవలెననియు, ఎల్లరికి సమానార్థిక సాంఘిక జీవిత విధానముండవలెననియు కొందరు భావించుచున్నారు. వీరిదృష్టి యిది. 'భారతీయుల సమస్య యాహార సమస్యయే. కడుపునిండ తిండి, ఒంటినిండ బట్ట యున్నచో భారతీయులు సుఖింపగలరు. మతము, ఆధ్యాత్మిక దృక్పథములు మన సాంఘికాభివృద్ధి కాటంక దాయకములు, హానికరములు కావునవీనినివిసర్జింపవలెను.'

'ప్రాచీనత చెక్కు చెదరక, యే మాత్రమును మార్పు నొందకుండుటయే భారతీయ ధర్మ'మని కొందరు సనాతనులు భావించుచున్నారు. వీరి దృష్టిలో ప్రాచీనాచారములు, ప్రాచీన పద్ధతులు కరుడుగట్టి సంఘమును

గట్టిగ నంటిపెట్టుకొని యుండవలెను. ఏ స్వల్ప పరిణామ మయినను భారతీయత్వమును జెఱచునట.

కొలది మంది మాత్రము 'పరదేశీయుల యాగమన ఫలితముగ వారి సంబంధమువలన నేర్పడిన ఆ యా నాగరికతల సమ్మేళనమునుండియే భావి భారత ముద్భరింపబడు' నని వాదింతురు.

'ప్రాచీనాదర్శములు, సిద్ధాంతములు సుస్థిరములగు పునాదులుగా జేసి నవీనానుభవ ఫలితములతో పునరుద్ధరింపబడిన భారతమును నిర్మింపవలెను. కాని గ్రామములకు మరలుడు. ప్రకృతి కభిముఖులుగండు. ప్రాచీన వైదిక సూత్రముల యుత్కృష్టతాదిశకు దిరుగుడు. ఈ సుదృఢములు, శాశ్వతములు నగు పునాదులపై మన భావి భారత సౌధమును నిర్మింపుడు. ఆధ్యాత్మిక జీవిత పథము నందే భారత సాంఘిక, ఆర్థిక, నైతికాభివృద్ధి గలదు. మన సంఘ సౌష్ఠవము, పూర్ణత ఆత్మబలముపై నిర్మింపవలెనేగాని ఱుణికములగు పూతమెరుగుల భౌతిక సంపదలపై, పశుబలమున కూడిగ మొనర్చు నాగరికతపై నిర్మింపజనదు. ఇది మన సహజ వికాసమునకు విరుద్ధము' అని ప్రాక్పశ్చిమ విధానములు సమగ్రముగ విమర్శించిన పెద్దలు, నాయకులు, మహాత్ములు నుపదేశించున్నారు. వారి వారల భావములు, దృక్పథము లెట్లున్నను ఎల్లరు

దేశహిత బుద్ధితో - సంస్కృతి ప్రేమతో ఉద్దీప్త మగు భారతమును వాంఛించుట శుభచిహ్నము. కాని మన ప్రాచీనత నంతటిని తుడిచిపెట్టి, కేవల పాశ్చాత్య నాగరికతపై భావి భారతమును నిర్మింపవలె ననుభావములు మాత్రము వాంఛనీయములుగావు. ఇట్టి వారు నిరంతరము భారతీయ నాగరికతా సంస్కృతుల గర్హించుచు, పాశ్చాత్యుల నెల్ల విషయముల ననుకరించుచు దానినే నాగరికత, అభివృద్ధి, సంస్కృతి యని విపరీతముగ ప్రచార మొనరించుచున్నారు.

"తమ తమ మానసిక విశ్వాసములపై భావి సంతతికి నూతనవిధానములనునిర్మింప నుద్ధాతలుగావు వారు తద్విచుగ విషమిళిత నియంత్రృత్వమునకు గురియచున్నారు. క్రొత్త వని తామ సగర్వముగ నుద్ఘాటించు పెక్కు భావములు ౫౦౦ వత్సరములనాటివే యను విషయమును వారు మఱచుచున్నారు. సింధు నదీ లోయలలో ౫౦౦౦ వత్సరముల క్రితము నిర్మింపబడి, భూగర్భగతములయిన పట్టణములు మురుగుపోవు చక్కని మార్గములతో క్రమ నిర్మాణము గలిగియున్నవి. ప్రతి పెద్ద గృహమున నొక స్నానపు గది యున్నది. ప్రాచీన వైదిక విజ్ఞానముచూపు వేదికలు ప్రాజ్ఞతను, సామాన్య విజ్ఞానమును ప్రదర్శించుచు, భవన నిర్మాణ వైభవమునందును, పౌర పాలనము

నంచును ప్రాచీన భారతీయుల ప్రతిభను ప్రదర్శించుచున్నవి. నేటి సమస్యలు పరిష్కరించునప్పుడు ౫౦౦౦ సంవత్సరముల పూర్వపు సింధు నదీ ప్రాంత పౌర నాగరికత గాంచినచో దానికి నమూలముగాక తప్పదు. యూరపులో నేడు మరఫిరంగులకు గురియై పాడైన మనపట్టణములను పునర్నిర్మాణము గావించుటలో భారతీయుల కృషియు, నోర్పును, విజ్ఞానమును మనము గ్రహింపనగును."

—బి. యస్. బ్రౌనరో, బ్రిటిష్ గృహనిర్మాణ కేంద్రసంఘ సభ్యులు.

భారతదేశము సర్వదా ఆధ్యాత్మిక ప్రజ్ఞే తన జీవిత పథమున ప్రకటించి ప్రబలజేసెను. ఇంతియగాక యది యమృత సత్యములతో - ఆధ్యాత్మికానుభవములతో నిర్మాణ మొనర్చిన సంస్కృతిని, జీవిత సౌష్ఠవమును, సర్వాంగ సౌందర్యమును జేకూర్చు నాగరికతను నిర్మించెను. కావున భావి నాగరికత యెట్టుండవలెనని తలంచునపుడు ప్రధానాత్మసత్యమును త్రోసిపుచ్చ వీలులేదు. ఇండే భారత జీవశక్తి సదా ప్రవహించి, ప్రపంచమును వికాసవంత మొనర్చి ప్రఖ్యాతి గాంచినది. ప్రాచీనాధ్యాత్మిక తపస్సు నుండియే భావి భారత పరిణామమును, వికాస శక్తిని విస్పష్టముగ - కళాశోభతో మూర్తిభవింప జేయవలెను.

తమ నాగరికత మానవ మానసికౌన్నత్యమును గలి
గించుచున్నదని పాశ్చాత్యులు తరచు ప్రకటించుచుందురు.
అయ్యున్ను నేటి తమ భౌతిక నాగరికత, పశుబల ప్రదర్శ
నములే తమ సర్వస్వమును వినాశమొనర్చుట గాంచి
వారు విస్మయము జెందుచున్నారు.

పాశ్చాత్యులు శాస్త్రముల నభివృద్ధికి దెచ్చిరి.
యంత్రములు నిర్మించి వ్యాపారము బెంచిరి. సామ్రాజ్య
ములు స్థాపించిరి. ప్రపంచమంతటను వ్యాపించి ప్రబలిరి.
ఐనను ఆయుధాగారములు, సైనిక నిర్మాణములు,
సామ్రాజ్య స్థాపనములతో నర్థసంపాదనమునకు గడంగు
నేటి పాశ్చాత్యసభ్యత్వము జాతీయ దురహంకారముతో
తాండవమాడుచున్నది. కాని యిందు శాంతి ప్రేమలకు
తావులేదు. దుర్బల జాతులకు స్థానములేదు. ధర్మ దూర
మైన విజ్ఞానము, హద్దుమీరిన భోగలాలస, ఈర్ష్యాస్పర్ధల
కాలవాలమగు నర్థసంపాదనము, దుర్బల జాతులను
దాస్య పాశములచే బంధించు రాజ్యాంగము, ఆత్మ వినా
శము జేకూర్చు దురహంకారము, ప్రజాపీడన మొనర్చు
శోసనాధికారము, పర ధనాపహరణ మొనర్చు వ్యాపార
సరళి, పెక్కుర వినాశముతో కొలది మందికి భోగములు
చేకూర్చు జీవిత పథము, పాశ్చాత్య సభ్యతను భగ భగ

మండుచున్న యగ్ని పర్వతముపై వాస మొనర్పజేసి ప్రలయమునకు రాచబాటలు నిర్మించెను.

'నేనే భగవంతుడను నేనే సర్వము' నను దురహంకార ముతో పాశ్చాత్యుడు పంచభూతములను బంధించినాడు. సర్వజాతుల నణంచినాడు. శాస్త్రకారులు మారణ యంత్రములను, మరఫిరంగులను నిర్మించి ప్రజాపీడనము నకు, నాశనమునకు దోడ్పడుచున్నారు. విపుల ధనార్జన మునకు, వ్యాపార విస్తారతకు సామ్రాజ్య విస్తృతిని తోడుచేయుచున్నారు. రాజ్య తంత్రజ్ఞులు నూతన సామ్రాజ్యములకు వలలు పన్ను చున్నారు.

పాశ్చాత్యనాగరికత విజృంభించి గొప్ప శక్తిని ప్రపం చముపై ప్రసరింపజేసినది. ధనార్జనమునకు విపుల సాధనములను విస్తరింపజేసినది. అది కొంత వికాసమును, అభివృద్ధిని గాంచినమాట వాస్తవమే. కాని నీతిని దూర మొనర్చి, ధర్మమును మఱుగుపఱచి, భౌతిక భోగ తృష్ణను, తత్సాధన సామగ్రిని బెంపొందించుటచేతనే తాను విజృంభింపజేసిన శక్తియే అసురిక శక్తిగ మారి భస్మాసుర వరమువలె తన యునికికే మోసము దెచ్చుచు న్నది. తానార్జించిన ధనమే విపుల దారిద్ర్యమునకు దారి దీసినది. తాను సృష్టించిన దావాగ్నియే తన వారిని దగ్ధి మొనర్చుచున్నది. ప్రపంచమున భీకర యుద్ధముల

బ్రబలజేసి, ఆత్మ నాశమును, పరులవినాశము నెనర్చుచు
వికటాట్టహాసములు గావించుచున్నది. అది దైవమును
కాలదన్ని సైతానును తలదాల్చుచున్నది. ఈ సందు
చూచుకొని క్రైస్తవమత ప్రచారకులు మాత్రము
సప్తసముద్రములుదాటి సకల ప్రపంచమున విస్తరించిరి.
ఎడారులనక, అరణ్యములనక, పర్వతములనక సర్వ
ప్రాంతముల బ్రవేశించిరి. సమస్త జాతులందును బ్రవే
శించి ప్రార్థనామందిరములు నెలకొల్పిరి. విద్యాలయ
ములు స్థాపించిరి. వైద్యాలయములు నిర్మించిరి. శరణా
లయము లేర్పరచిరి. భీకర సంగ్రామముల మధ్య – మర
ఫిరంగులమధ్య – రెడ్ క్రాసు సంఘ చిహ్నములతో ఘత
గాత్రుల సేవలు గావించుచున్నారు. ఇన్నియును క్రీస్తు
బోధలగు ప్రేమ సహనభావములను మారు మూలకునెట్టి
పశుబలము నుపాసించుచు గావించుటచే, ఆసభ్యత తన
ధర్మశక్తి యణగారి పశుబల ప్రేరితమగు ప్రభుశక్తికి
లొంగిపోయినది. శాస్త్ర విస్తరణమున క్రైస్తవ
ధర్మము గానరాదు. యంత్రనిర్మాణములందు దీని కాస్ప
దము లేదు. సామ్రాజ్య సభలలో, విపణివీధులలో, శస్త్ర
గారములలో దీనికి తావులేదు. విజ్ఞాన చర్వినియోగము,
దురాశ, స్పర్ధ, అశాంతి విచ్చల విడిగ తాండవమాడు
చున్నవి. ఇట్లు యూరపు ఖండ మగ్ని పర్వతమువలె

బ్రదలై లోకమును దగ్ధమొనర్చుచున్నది. కాని భారతీయుని యాదర్శము పరబ్రహ్మము. ఆత్మ వానికిలక్ష్యము. దృక్పథము దైవము. ఆత్మ సత్యములే వాని యాశయములు.

"మర్త్యులలో నమరత్వముగలదియు, సత్యము నావిర్భవించునదియు దైవమే. ఇదియే మన యంతరంగమున నాత్మశక్తిగా దైవశక్తులను విజృంభింపజేసినది.

"ఓ మహాశక్తీ! నీవు విజృంభించి సర్వావరణములను జించివైచుము. దైవము వైపునకు దారిదీయు సర్వశక్తులను మాలో మూర్తీభవింపజేయుము." —ఋగ్వేదము.

అనంత సత్యముకొఱకు కృషి గావించి యద్దానిని నుద్దీపింపజేయుటయే భారతీయ నాగరికత, సంస్కృతుల పరమావధి. ఇదియే భారతీయుని స్వధర్మము. ఆధ్యాత్మిక స్వాతంత్ర్యమే వాని యున్నత లక్ష్యము. దీని నలవరచుకొనుట కేర్పడిన క్షేత్రము జీవితము. తన జీవశక్తిని విజృంభింపజేసికొని, యాంతరంగిక వికాసమును జేకూర్చికొని, దానిని సంఘమున సర్వవిషయములందు విస్తరించి వికసింపజేయుటయే భారతనాగరికత. ఇది మానవుని కతీతమగు వివిధ దైవశక్తులను గాంచెను. ఆ వివిధముల వెనుక బ్రహ్మమును (పరమాత్మను) కనుగొనెను. బ్రహ్మము లోనే తన యస్తిత్వమును, సనాతనత్వమును బ్రకటించెను.

మానవ జీవితమునకు మిన్నయైన జీవిత దృక్పథములు చూచెను. ఈ లోకమునుగాక పెక్కు లోకములనుగూడ దర్శించెను. మన భౌతిక మనస్సునకు మించిన మానసికా వస్థల ననుభవించెను. వాని యన్నిటికిని మిన్నయై జ్యోతివలె ప్రకాశించు నాత్మను గాంచెను. తన విజ్ఞా మును వికసింపజేసి, మనస్సును స్వాధీనమొనర్చుకొన్నచో వానినెల్ల మానవుడు జయింపగలడని ధైర్యముగ ప్రక టించెను. ఈ మానసిక దృక్పథముల నెల్ల జయించి తానే భగవంతుడు కాగలడనియు, తానే ఆత్మయనియు నెలు గెత్తి చాటెను. ఇదియే భారతీయ జీవిత ద్వారము దెఱచు తాళపుచెవి. ప్రాచీనకాలము నుండియు దీని యాధ్యాత్మిక శక్తులే వివిధ రూపములుగ ప్రవహించి, జీవనదులను సృష్టించి లోకకళ్యాణమును జేకూర్చెను. ఉన్నతపదముల నుండి సత్యబీజములను గొనివచ్చి ఫలవంతమగు నీ భూమి యందు నాటి రుచ్యఫలముల నొసగెను. ఈ సత్యబీజములే దీని శాస్త్రములయందు, కళలయందు, రాజకీయములందు, ఆధ్యాత్మిక తత్త్వశాస్త్రములందు, సారస్వతమునందు, మతమునందు అంకురించి, క్రమాభివృద్ధినంది, పుష్పించి వికసించెను. ఈ మాత్మానుభవము పవిత్రమగు దీని భావి నింకను పవిత్రవంతముగ - ఇంకను వికాసవంత ముగ - ఇంకను విశాలకీర్తిమంతముగ గావింపగలదనియే

మా దృఢ విశ్వాసము. ఇదియే భారత చరిత్ర చాటిన సారాంశము.

కాని పాశ్చాత్య విద్యావ్యామోహితులు, పాశ్చాత్య సాంప్రదాయముల ననుకరించువారు, పాశ్చాత్య సభ్యత నలవఱచుకొన్న కొలదిమంది భారతీయులును పాశ్చాత్యులకన్న గట్టిగ 'ప్రాచీన భారతదేశము వినాశ మొందినది. దాని జీవిత జ్యోతిని ప్రకాశింప జేసిన తైలము పూర్తి యైనది. ఇక నది జీవించుటకే శక్తిలేదు. గతమంతయు గర్హింపదగినదే. కావున నవీనత నలవఱచుకొన్న నవీను లుగ మాత్రమే మన ముండవలెను.' అని నుడువు చున్నారు. భారతీయుల ప్రాచీన జీవితరహస్యములకన్న-ఆధ్యాత్మిక శక్తులకన్న - పాశ్చాత్యుల భావములు, ఆచారములు, సంప్రదాయములు వీరికి మిన్నలు. అలవఱచుకొన్న సుసాధ్యములు. వీరిది యంత్రయుగము. యంత్రవేగముతో వీరి మనసులు పరుగిడును. యంత్ర వేగముతో వీరు ప్రయాణములుగావింతురు. 'మన మన స్సులో! మందగమనములు. మన ప్రయాణములు ఒంటెద్దు బండి ప్రయాణములు. మన నాగరికత కుటీర నాగరికత' అని మన సర్వము నీసడించుటయే వీరి నవీనతా లక్ష్యము. కావున 'భారతదేశ మభివృద్ధి గాంచవలెనన్న పాశ్చాత్యుల మార్గముల నలవరచుకొని వారి ననుకరింపవలెను.

వారి ననుకరించుట వలననే మన నాగరికత వికసించును'
అనుచు తమ్మో నీచపరచుకొనుచు పరులను ప్రశంసించు
చుండుటయే వారి దినచర్య.

పాశ్చాత్యులే మన నాగరికతను, సంస్కృతిని, వేద
విజ్ఞానమును ప్రశంసించి, వీనిని తమ జీవితములందు
జీర్ణింపజేసికొనుచున్న యీ కాలమున భారతీయులలో
గొందరిట్లు గుడ్డిగ పాశ్చాత్యుల డాంబిక జీవితముల
ప్రశంసించుచు, నలవరచుకొనుచుండుట విచారకరము,
గర్హ్యము. కాని పాశ్చాత్యులవలె వీరభివృద్ధియందొక్క
యడుగైనను వైచుచున్నారా? యని మాసంశయము.
మొన్న పాశ్చాత్యులు వర్జించినవానిని నేడు వీరు స్వీక
రింతురు. పాశ్చాత్యులు ధరించి మాసినవని, చిరిగినవని
త్రోసివైచిన దుస్తులు వీరు నూతన వస్త్రములని పరిగ్ర
హింతురు. ఒకప్పుడు పాశ్చాత్యులు మంచివనిభావించి,
అనుభవముచే పనికిమాలినవని త్రోసివైచిన భావములు,
జీవిత లక్ష్యములు వీరు వరప్రసాదములుగ స్వీకరించి వాని
నలవరచుకొన ప్రయత్నింతురు.

భారతీ యాదర్శములు శాశ్వతములు. అవి ప్రాచీన
స్వచ్ఛంద విజ్ఞాన ప్రవాహ జలమును గ్రోలి యమృతత్వ
మును బడసెను. భారత నాగరికత యనాది గావున నాశ
నము నెఱుగదు. ఆ యాదర్శములు తమ సహజ దృఢ

శక్తిచే పరుల క్రూరములగు దాడులను, బెక్కు గండము
లను గడవగలిగెను. ప్రాచీనములగు గ్రీకు, రోము,
ఈజిపు దేశములు నామరూపములు లేక నశించినను
భారతీయులు మాత్రము నేటికిని విపుల విజ్ఞాన కాంతుల
బ్రసరింపజేయుచు నాత్మ శక్తిని బ్రకటింపజేయుచునే
యున్నారు. భారతము ప్రాచీన సంప్రదాయానుసారముగ
తన సంస్కృతిని జూపుచునే యున్నది. గ్రీకులు, పార్థి
యనులు, హూణులు, ముసల్మానులు, ఆంగ్లేయులు తమ
వికార చేష్టలతో, క్రూరములగు దాపులతో నిందు
విచ్చల విడిగ తాండవించినను వారి చేష్టలు తాత్కాలిక
ములై నశించినవేగాని దీనిని నాశమొనర్పజాలకపోయెను.

ఇందు వైదిక ఋషులు సాధించిన యాత్మ విజ్ఞానము
నేటికిని వికసించుచునే యున్నది. ఈనేలపై గావింపబడిన
ప్రతి దండయాత్రను ఆవిజ్ఞానముత్కృష్ట పూర్వకముగనో,
ఆధ్యాత్మికము (సత్యాగ్రహము) గనో యెదుర్కొని తాను
నిలిచి జీవింపగలిగెను. ఇది యాధ్యాత్మిక నిర్మాణ శక్తి
సంఘటనా - ప్రతిక్రియ శక్తులచే నిర్మలమొర్కని దొన్న
త్యము బడయగలిగెను. తన యాధ్యాత్మిక శక్తిచే
జీర్ణించుకొనవలసినదానిని జీర్ణించుకొని, విసర్జనీయమగు
దానినెల్ల విసర్జించి, తుష్టిని, పుష్టిని జేకూర్చుకొని యభివృద్ధి
గాంచగలిగెను. ఇట్లు జీవశక్తిని విజృంభింపజేసి, ప్రచండ

సామ్రాజ్యవాదులను ప్రసన్నులుగ గావించికొని ప్రజలకు కళ్యాణమును జేకూర్చెను. పరిష్కరింపరాని సమస్యల వారిని తనలో లీన మొనర్చుకొని యున్నతస్థితికి దెచ్చెను. నేటికి నిల్చి యీ దేశము మనకన్నుల యెదుట గావించు చున్నది.

భారతమాత తన నాకరికతా శక్తి ప్రభావముచే, ఆత్మ విజ్ఞాన తేజః పుంజములచే బాహ్య సైకతముల పైగాదు; ఆంతరంగికములగు సుస్థిరాధారములపై సుందర సౌధ నిర్మాణము గావించెను. "ఏకం సద్విప్రా బహుధా వదంతి" యను ఆత్మ సత్యత సీనశ్వర ప్రపంచమునకు ప్రకటించి మానవ సౌభ్రాతృత్వమును బయల్పఅచెను.

'భారతదేశము ప్రాచీనకాలమున తన సందేశము నెసగినది. ప్రస్తుతము భారతీయ సంస్కృతి యెసగగలిగిన దేమియులేదు. దాని పునర్నిర్మాణము నూతన పద్ధతులపై గావింపవలసినదే'యని పలుకుట భారతీయ యథార్థ చరిత్రను అభ్యసఅచుటో లేక పెడదారుల నడచుటో యని నుడువదగినదే. భారతీయ సంస్కృతి కేంద్రమును, చరిత పరిణామమును గమనింపనివారి మాట లివి.

ఆధ్యాత్మిక శక్తివికాసము, ఉత్తేజవంతమగు జీవశక్తి బాహుళ్యమేగాక జీవాత్మను పరమాత్మ సన్నిధికి జేర్చు ఉన్నతాచరణమే దీని సంస్కృతి సారము.

'మనయందలి సత్తే సత్యమనియు, జీవక్రమక్రమాభివృద్ధియే మనజీవిత వికాసమనియు, జీవాత్మయే ప్రకృతియందలి దైవమనియు, భగవంతుడే ఉత్తముడనియు నిదిగుర్తించును. క్రమాభివృద్ధియు, ఆత్మోద్దీపనమును భారతీయుని జీవిత వికాసము. మానవ జీవిత లక్ష్యము."

దీని తత్త్వ వేదాంత నాగరికతల ప్రధాన లక్ష్యము మానవుని దేవత్వమునకు జేర్చుటయే. వైదిక కాలమున భారతీయుని భౌతిక మనోదృక్పథము సహజముగ ఆత్మావంకకు ప్రేరేపింపబడెను. కాని కొంత కాలమునకు ఉన్నతాధ్యాత్మిక సత్యమార్గములు బాహ్యమత పూజలతో ముగిసిపోయెను.

పౌరాణిక, తాంత్రిక యుగములందు మతము మానవుని భౌతిక మానసిక తత్త్వములపై తన బాహ్యాచారములను ప్రకటించి దైవత్వమును బ్రదర్శించెను. బాహ్యాంతరములందు ఉన్నత తేజఃపుంజములను ప్రభవిల్లజేసెను. బ్రహ్మతేజము ప్రజ్వరిల్లి ఆధ్యాత్మిక వికాసము విస్తరించెను. నవీన భారత దేశముగూడ తన సహజధర్మమగు నాధ్యాత్మికశక్తిని పాశ్చాత్యదేశముల మీదను, ప్రపంచమునందంతటను ప్రసరింపజేయుచునే యున్నది. ఈదేశమింకను జీవించియే యున్నది. జీవించి మానవాభివృద్ధికి

తన సందేశము నెసగవలసి యున్నది. ప్రాచీన భారత వర్షము మతము, ఆధ్యాత్మికములందు ప్రఖ్యాతిని గాంచి నను రాజకీయ ఆర్థిక విధానములు త్రోసివైచి, తాను పతనము నొందెనని కొందరు నేడు నుడువుచున్నారు. కాని యిందు సత్యము లేదు. భారతీయ పతన కారణములు వేరుగనున్నవి. భారతదేశము ఋషులను, అవతారపురుషు లను, మత స్థాపకులను, స్మృతికర్తలను, ఆచార్యులను, కవులను, శాస్త్రవేత్తలను, కళాకోవిదులను, గాన నిపుణు లను శారీరిక, మానసిక, నైతిక పటుత్వముగల మాన వోత్తములను గని యుండెను. రాజాధి రాజులను, మంత్రు లను, అర్థశాస్త్ర నిపుణులను గాంచి సుస్థిరములగు పునా దులతో ప్రజాకల్యాణమును జేకూర్చుచు మోక్షదా యక మార్గముల నలవరచుకొనెను. భారతీయులు వీరులై యుద్ధములు గావించిరి. ప్రజారంజకముగ పాలించిరి. ప్రపంచమున మూల మూలలతోడను న్యాయ ప్రవర్తన ముతో, నీతితో వర్తక వ్యాపారములు గావించిరి. సంఘ నిర్మాణము నెనర్చిరి. ప్రజాభివృద్ధికి దోడ్పడు సర్వ విషయములందును విశాల విజ్ఞానమును, ఉన్నతాభివృద్ధిని బడసిరి.

పాశ్చాత్య దేశములతోడి భారతీయుల సంబంధము ఉభయులకును కొంత లాభము జేకూర్చక పోలేదు. భార

తీయులు పాశ్చాత్య శాస్త్రవృష్టితో తమ సత్యములను, ఉన్నత సిద్ధాంతములను విస్పష్టముగ ప్రకటించి, పాశ్చాత్యులపై ప్రసరింపజేయుటయేగాక తమ ప్రజలయందును చైతన్యమును బెంపొందించుకొనిరి. కాని భారతదేశము కేవలము గ్రుడ్డిగ పాశ్చాత్యుల ననుకరింప నిచ్చగింపదు. కొలది మందికి మాత్రమీ కోర్కె ప్రబలముగ నున్నను నది దీని సహజధర్మమునకు విరుద్ధముగాన నది వ్యర్థముగాక తప్పదు. అంధానుకరణము బొనిసతనమును బ్రకటించును. అది యీ యనుకర్తల దుర్బలత్వమును, మానసిక దారిద్ర్యమును మాత్రమే ప్రదర్శించును. ఏ దేశమునందును లేని రహస్య శక్తిని ప్రకోపింపజేయుటయే భారతమాత వాంఛించునది. అట్టి జీవశక్తి విస్ఫురణమును తిరిగి యీమె విజృంభింపజేయుచుండుట శుభసూచకము. ఆమె ప్రపంచమునకు శాంతిని, దాంతిని నెసగి తీరును.

రాజకీయోద్యమ విజృంభణము ఆధ్యాత్మిక శక్తి వికాసముతో లీనముగాక తప్పదు. భారతాత్మ నేటికిని విస్పష్టముగ ప్రకాశించుచునే యున్నది. పండితులు దీనిని గాంచుచునే యున్నారు. విజ్ఞాన కోవిదులిద్దానిని స్పష్టముగ వివరించుచునే యున్నారు. దయానందసరస్వతి, రామకృష్ణ పరమహంస, వివేకానంద, రామతీర్థ, అర

విందఘూోషు, మహాత్మా గాంధి మున్నగు ఆత్మోద్దీపకులీ సత్యమును ప్రపంచమునకు ప్రకటించియే యుండిరి.

ఇందు రామకృష్ణుని మహిమ ప్రత్యేక విలక్షణత్వమును, సహజ సౌభాగ్యతేజఃపుంజమును ప్రకాశింపజేసినది. అక్షరజ్ఞాన శూన్యుడగు నీ యవతారమూర్తి పాదారవిందములకడ నాంగ్లేయ విద్యాధురంధరులు వినమ్రులై, దోసిలియొగ్గి భక్తులైరి. వివేకానందుని ప్రాక్పశ్చిమ సంచార ప్రచారములు భారతదేశ యథార్థతత్త్వమును ప్రకటించుటయేగాక ప్రపంచమును భారత భావముచే జయించెనని నుడువుటయందతిశయోక్తిగాని, యసత్యమువానిలేదు. వివేకానందుని శక్తిప్రభావము నేటికిని వికసించి నృత్యమొనర్చుచునే యున్నది. భారతమాత యాత్మయందు - భారతీ యాత్మ యందు నేటికిని వివేకానందుడు జీవించియే యున్నాడు. అరవిందుడు 'వందేమాతరం' మంత్రప్రబోధముతో రాజకీయ కదనరంగమున దుమికియు, నిష్పాడాధ్యాత్మిక - ఆంతరంగిక వికాసానంద సాగరమున నోలలాడుచున్నాడు. ఓ భారతీయ సోదరులారా! మీ గతమును విస్పష్టముగ గ్రహించి భావి యభ్యున్నత్యమునకు వినియోగింపుడు. ప్రథమమున భారతీయులుగనుండి మీ పైతృక సంపత్తిని. గ్రహింపుడు. ఆర్యాలోచనములను, క్రమశిక్షణమును, ధర్మ ప్రవర్త

నమును, సంస్కృత జీవితమును పునరుద్ధరింపుడు. అదియే భారతీ యాధ్యాత్మిక సాధనము, వికాసము. తపోజ్ఞాన శక్తులే మనలను స్వతంత్రులుగను, గొప్ప వారుగను గావించును. ఇవియే భారతీయులకు తారకము. భారతీ యులకే యనలేల ? మానవకోటికే యివి తారకము. అదియే భగవదుద్దేశము. భగవంతుడే మనలను గమ్య స్థానమునకు జేర్చును. తన సహజ ప్రకృతి ననుసరించి, తన్ను తాను తెలిసికొన్ననాడే భారతదేశము అభివృద్ధి యయి మానవాభివృద్ధిని గావింపగలదు.

ఈ కార్యక్రమమును సమగ్రముగ నెఱవేర్చుటకు అరవిందుడు మూడు ప్రధానవిషయములను తెలిపెను.

(అ) ఆర్యత్వము: ప్రాచీనాధ్యాత్మిక శక్తిని సర్వతోముఖ ముగ, సమగ్రముగ వికసింపజేసి పునరుద్ఘాటించుట.

(ఆ) ఈ శక్తిప్రభావమును వేదాంత శాస్త్రమునందు, ప్రకృతి శాస్త్రములయందు, కళలయందు, సాహిత్యము నందు స్వతంత్రముగ–నిరంతరముగ ప్రవహింపజేయుట.

(ఇ) స్వతంత్రశక్తితో, నవీన విజ్ఞానప్రభతో ప్రాచీనా ధ్యాత్మిక జ్యోతి నుద్దీపింపజేసి, ప్రాక్పశ్చిమ జ్ఞానవిజ్ఞాన సమ్మేళనమును, మానవ కళ్యాణమును జేకూర్చుట.

అయిన-చో, భారతీయాంతరంగిక న్యాయమును, స్వధర్మ మును గనుగొని ప్రకటించుటెట్లు?

తర్కమును, హేతువాదమును, ప్రాకృతిక వస్తు విషయికమగు విజ్ఞానమునే ప్రకటించును. కాని భారతీయ స్వధర్మమో! నైతిక రహస్యమును, దాని జన్మస్థానమును దెలిపి యాచరణమునం దుంచును. వస్తువిజ్ఞానమును ఆత్మోద్దీపనమును, అనుభూతిని బడయవలయును. ఈ విధానము మాత్రమే దేదీప్యమానముగ ప్రకాశించు భారతీయాత్మను ప్రకటింపగలదు. కేవలము మనస్సుచే, విజ్ఞానముచే బడయజాలని యాత్మానుభూతిని నవీనులు, పాశ్చాత్య నాగరికతా సంపన్నులు నగువారు శాస్త్ర దృష్టితో బడయవాంఛింతురు. ఆధ్యాత్మిక జ్ఞానమును కేవల మానసిక వికాస చిహ్నమగు శాస్త్రజ్ఞానముచే బడయజాలము. భారతీయ సంస్కృత జీవిత పథమునకు మూలాధారములను గాంచుట కే పాశ్చాత్య విధానమును తోడ్పడజాలదు.

కాని భారతీయులు తమ ప్రాచీనతకే యంటిపట్టుకొని కాలానుగుణములగు మార్పుల నిచ్చగింపకుండుట తగదు. ప్రాచీన పవిత్ర సత్యములు భాస్వభివృద్ధికి సాధన సంపత్తిగ నుండవలెను. ప్రాచీనకాలమునుండియు భారతీయులు ఆత్మ వికాసమునకు, ధర్మమునకు ప్రాధాన్యము నొసగిరి. శారీరిక, మానసిక, జీవితాభివృద్ధిని గోరు తత్వమునే వాంఛించిరి. పూర్వపు ఆత్మీయమగు పునాదిపైనెలకొల్ప

బడిన నేటి మనచరిత్రయే భావిని సత్సలితములనెసగును. నూతన వికాసముగల మన ప్రతి ప్రయత్నము ఉత్తమాభివృద్ధికి తోడ్పడును.

ఆత్మపథము భారతీయ జీవిత విలక్షణ లక్ష్యము. భారతీయ సర్వప్రయత్నము ఆధ్యాత్మికోన్నతికే సోపానమయినది. సర్వము నా వైపునకే పయనించినది. భారతీయ మనఃప్రవృత్తి యాత్మసత్యత్వమును, దాని పూర్ణతను కనుగొనుటకు దారితీయసలయును. కాని నేటివారు దీనిని బాగుగ జీర్ణించుకొనజాలకపోవుటయే మన పతన హేతువు. కావున భారతీయ ,సంఘ లక్ష్యములు సర్వతో ముఖ మగు నాత్మాభివృద్ధి దాయకములుగ నుండవలెను. ఇదియే ప్రపంచ సమస్య. కేవల ప్రాపంచిక భావమునబడి కొట్టుకొనుట వలననే వీరికి పతన స్థితి యేర్పడెను. మాయా వాదము సత్యమును గప్పిపుచ్చి, బాహ్య వేషములకు తావొసగినప్పుడే పాశ్చాత్య ప్రభుత్వమిందు కాలిడ గలిగెను. తాత్కాలికములగు తళుకు బెళుకులుగల పాశ్చాత్య నాగరికత యందలి మోహముచే నా యథార్థ స్వరూపము మరుగు పడెను.

భౌతిక వాంఛల నీడ్చేర్చు వ్యక్తిగతమగు పాశ్చాత్య భౌతిక నాగరికత ప్రబలసాగెను. ఈ నాగరికత భగవంతునకు, మానవునకు మధ్య పెద్ద యగాధము నేర్పరచెను.

మతములన్నియు నాధ్యాత్మికాదర్శమునందే జనించినవి. కాని మత సంస్థ మతముకన్నను తనకే ప్రాధాన్యమునిచ్చుకొనుటయే తడవుగ నా మతము క్షీణింపసాగును. ప్రజా బలములేనిదే యే సంస్థయు వరిలజాలదు. కావున మతము వరిలవలెనన్న సామాన్య ప్రజల మతవాంఛల నీడేర్ప వలెను. ప్రజా బలమును జేకూర్చుకొనుటకు ప్రజల నిత్యజీవి తావసర వస్తువులను సమకూర్చి యందింపవలయునుగదా! ఇందువలననే మతమునందు విగ్రహారాధనములు, పూజలు, ఆచారములు తోడు గావింపబడినవి. దాని యాధ్యాత్మిక జ్యోతిని మాత్రము ఋషులు, మహాత్ములు సర్వదా వెలుగొందునట్లు చేయుచునే యుండిరి. కాని సామాన్య ప్రజలలో ననవసరములగు బాహ్యచిహ్నములు ప్రధానములై, నైతికములగు పునాదులు సడలుటచేతనే మతములు పతన మార్గముల బట్టినవి. నీతి సడలినది. 'నీతియే మతము, ఆధ్యాత్మిక' మను భ్రమ ప్రజలయందు వ్యాప్తమైనది. ప్రతి మతమునందును నీతియుండుట నిజమే. ఆధ్యాత్మిక వికాసమున కది సాధనమగుటయు నిజమే; కాని దానికంటె నిది వేరయిన దనవచ్చును.

"కొన్ని మానసిక నియమములతో, బాహ్య ప్రవర్తనమును శాసించు ప్రయత్నమే నీతి. అనగా మానసి కాద

ర్మములలో మానసిక నియమములను గావించి నడవడిని యేర్పఱచుకొనుటయే నీతి" తన లోపలను, ఇతరుల లోప లను గల యాత్మను వికసింపజేయుటకు గావింపబడిన ప్రయత్నఫలమే యాధ్యాత్మికము. ఆత్మసత్యత్వము నందే జీవించి దాని వికాసమునకు కృషి గావించుటయే యాధ్యాత్మికము. బాహ్యాంతరముల కతీతమగుదాని ననుభూతి గావించుటయే యాధ్యాత్మికము. భారతదేశ మున మతము వికసించి విజృంభించుట కిదియే పునాదియై నది. వైదిక మతమున విశాల దృక్పథము, సహనశక్తి, సేవా త్యాగములు ప్రబలి మానవ వికాసమున కెక్కు డుగ తోడ్పడినవి. ప్రాచీనులు, యోగులు, సన్యాసులు దీని కంటిపెట్టుకొని యిండే జీవించిరిగాన భారతీయ సంఘము, మతము తన విశాల సందేశమును విశాల ప్రపంచమున వెదజల్లగలిగినది. కాని నేడో! ఆ గుణములు లోపించుట కతననే భారతీయులు పతితులైరి.

పాశ్చాత్యులు రాజకీయాదర్శములద్వారా బాహ్య స్వాతంత్ర్యమును, శాంతిని బడయుటకు కృషి గావించిరి. కాని నేటి ప్రపంచమున నా శాంతిగాని, స్వాతంత్ర్యము గాని యెక్కడ? నేటి పాశ్చాత్య స్వతంత్ర దేశములవారు విజ్ఞానశాస్త్రశక్తిని, రాజకీయ సైనిక బలమును జేకూర్చు కొని యధికార ప్రమత్తులై పరుల దోచుకొనుచున్నారు.

తమ స్వార్థమును, తృష్ణను ప్రబలజేసికొనుచున్నారు. ఈ లక్ష్య సిద్ధికే దేశసంపత్తిని, మానవశక్తిని పూర్తిగ బలిగావించుచున్నారు. ఎటుచూచినను యుద్ధఘోషయే. యుద్ధ భయము లేని కాలమునగూడ సైనిక సంపత్తితో గూడిన శాంతియే. ఇట్టి శాంతి యుద్ధమునే ప్రదర్శించునుగదా! కాన పాశ్చాత్యులు సదా యుద్ధ జీవితమునే గడపుచున్నారు. అధికార ప్రాపకమునకు ప్రాకులాడు దేశములందు స్వాతంత్ర్యమెట్లు వరిలగలదు? మరియు యంత్రమూలమున మానవసమస్యల బరిష్కరింప బూనుట మానవ జీవితాభివృద్ధికి, వికాసమున కెట్లు తోడ్పడ గలదు? విశాల హృదయులు, ఉదార స్వభావులు, నీతి మంతులు నగు వారి హస్తగతమగు రాజ్యమునందే స్వాతంత్ర్య శాంతులు వరిలగలవు.

ప్రాచీన భారతదేశము గ్రామమయమై పరిపూర్ణ ప్రజాపాలనము గలిగియుండెను. కేంద్ర ప్రభుత్వము రాజుల హస్తగతమైనను త్యాగధనులగు ఋషుల సలహాలతో నడపబడెను. ఆధ్యాత్మిక వికాసము సత్ప్రవర్తనకును, స్వార్థ రహిత పరిపాలనమునకును సోపానమయ్యెను. నేటి శాస్త్ర విజ్ఞాన వికాసము భౌతిక పదార్థ విజ్ఞానమును బెంపొందించినది, మానవుని నూతన మానసిక వికాసమును విస్తరింపజేసినది. కాని యీవిశాల విజ్ఞాన

మును మానవుడు తన స్వార్థముకొఱకు దుర్వినియోగ మొనర్చుకొనుటచే శాస్త్ర విజ్ఞానము మానవ శాంతి, రక్షణలను గూపాడజాలకున్నది. ఇది నైతిక వికాసము నకు దోడ్పడలేదు. విషవాయువులు, మరఫిరంగులు మానవుని వినాశకర పద్ధతులకే యూపొందినవిగాని మాన వాభివృద్ధికి దారి తీయలేకపోయెను. అశాంతి, అసంతృప్తి నేడు ప్రబలినవి. ఈ విపరీత పరిస్థితులందు అసంతృప్తియే యున్నతమార్గమునకు దారితీయవచ్చును. మానవుని యహంకారమే నేటి పతనమునకు కారణము. మతవిధాన మున నిట్టి యహంకారమే ప్రత్యేక సంప్రదాయ ప్రాబల్య మునకు దారి దీసి కలహములకు మార్గదర్శక మాయెను. రాజకీయమున నిరంకుశాధికారమే పరదేశముల స్వాతం త్ర్యమును హరించి దోపిడిని బెంపొందించినది. శాస్త్ర విజ్ఞానమున తన మానసిక వికాస పరిశోధనలే ప్రబల ప్రమాణములని భావించి యితర విద్యాభివృద్ధుల తిర స్కరింపజేసినది. తన భౌతిక దృష్టికి మించినది లేదను నహంకారమే యీ పతనమునకు కారణము.

పాశ్చాత్య భావదాసులకు పాశ్చాత్యు లాదరించిన యీ పాశవిక కృత్యములు స్ఫురించినవి. రక్తప్రవాహ మూలకములగు విప్లవమార్గములకు దేశమున బీజములు

నాటబడినవి. యుద్ధములే తరణోపాయములుగ నుద్దే శింపబడినవి.

ఈ కారణమువలన భారతదేశము ఒక్క విధముగ కాదు - రాజకీయముగ, ఆర్థికముగ, ధార్మికముగ, సార స్వతికముగ పతనమయినది. ఈ పరిస్థితినుండి పునరుద్ధరింప బడుటకు మార్గములేమా! యని పలువురు పలువిధము లుగ నాలోచించినారు.

కాని భారతీయ సంస్కృతి ప్రభావము సామాన్యము గాదు. ఆ సంస్కృతిచ్ఛాయలలో బెరిగినవారి కాయ్యను రిక కృత్యములు నచ్చలేదు. వారు తమ నాగరికత కను కూలమైన మార్గములకు తహ తహ లాడినారు ఆ భావ ప్రాబల్యమే గాంధిమహాత్ముని రూపమున ప్రకటమయినది.

సత్యాహింసల ప్రభావము సన్నగిల్లిపోయిన దని చాటుచు వచ్చినవారికి దిగ్భ్రాంతి కలుగునట్లుగ సత్యా గ్రహాద్యమము ఆసేతు హిమాచలము వెల్లివిరిసినది. అది యొక మహాయజ్ఞము. అం దపవిత్రతకు తావులేదు. పవిత్రీకరణమే పరమలక్ష్యము. స్వీయ పాశవిక భావ ములను సత్యాగ్నిహోత్రమునందు ప్రేల్చుటయేగాని పరునిమీద పరకయైన నెత్తరాదు. అంతదాకనేల? పర పక్షమువాని నొక్కపలుకైనను పల్లెత్తి పలుకరాదు.

భావమునందైనను కట కట పడరాదు. ఇది యసిధారా వ్రతము. ఈ కఠోర వ్రతము నెక్క భారతీయులు మాత్రమే పూని నిర్వహింపగలరు. వారట్లాయజ్ఞమును సాంగముగ – సమగ్రముగ నెరవేర్ప బూనిరి.

ఇచ్చట నీ యజ్ఞకార్యము సంపన్నమగుచుండగా దీని పవిత్రత కాంగ్లదేశము అట్టుడికిన ట్టుడికిపోయినది. అధికార పిశాచావిష్టములైనవారి హృదయములలో త్యాగ భావము తావుచేసికొన్నది. భారతదేశస్వాతంత్ర్యమునకు వాగ్దానముచేసి తద్రూప సిద్ధికై తగిన సన్నాహములు చేసినారు. ఇది సత్యాహింసల సత్ఫలమాహాత్మ్యము.

భారతదేశము స్వరాజ్యమును సంపాదించుకొన్నది. సమాఖ్యరూపమునుగూడ సంతరించుకొన్నది. ఒక్క నెత్తుటి బొట్టునైన చిందనీయక యింతటి మహావిప్లవమును సాధించిన భారతీయ సంస్కృతికి, భారతీయ ప్రతిభకు సర్వప్రపంచము జోహారులర్పించుచున్నది. విపరీతనాగరికతలో పుట్టి పెరిగిన విదేశీయులకు ఈ సంస్కృతి లభ్యమగుట సామాన్యముకాదు. అయినను ప్రయత్నించి పాటు పడినచో నలభ్యమమాత్రము గాదు.

భారతదేశముపై నిప్పుడొక పెద్దబాధ్యతపడియున్నది. తాను తన సనాతన సంస్కృతీ సంపత్తును సముద్ధరించు

భారతదేశ సందేశము

కొనుటయేగాక ప్రపంచమునకంతటికి శాంతిభిక్ష పెట్టవల
సిన సమయమాసన్నమయినది. భయసంభ్రమములతో
ప్రతి క్షణమును ప్రాణములు గుప్పిటబట్టుకొనియున్న
ప్రపంచమునకు - ఉన్నతాదర్శములేక కేవల ప్రాపంచిక
భోగములకే ప్రాకులాడుచున్న ప్రపంచమునకు - అర్థ
సంగ్రహమే పురుషార్థముగ భావించి నానా అకార్య
ములు చేయుచు, స్పర్ధలతోడి సమర సన్నాహములలో
నితమతమగుచున్న ప్రపంచమునకు భారతదేశము కళ్యాణ
మార్గమును చూపవలసియున్నది.

భారతజాతి లక్ష్యమును కాళిదాసమహాకవి తన
కావ్యములో నొకచోట సూత్రప్రాయముగ నిట్లు వక్కా
ణించి యున్నాడు.

"శైశవేభ్యస్త విద్యానాం యౌవనే విషయైషిణాం।
వార్ధకే ముని వృత్తినాం యోగేనాంతే తనుత్యజాం"

శైశవమునందు తమ జీవితాభివృద్ధి కవసరములగు
విద్యలను చక్కగ నేర్వవలయును. యౌవనమునందు
ఆర్థిక, రాజకీయాది విషయములను సమకూర్చుకొని
యిష్టోపభోగముల ననుభవింపవలయును. ముసలితనమున
లౌకికములగు జంజాటములనుండి తొలగి జ్ఞానవృత్తితో
మెలగవలయును. అట్లు నిండు నూరువర్షములు సుఖ

భారతీయ ప్రతిభ.

ముగా జీవించినపిమ్మట యోగముచే – స్వచ్ఛందముగా – దేహయాత్రను జాలింపవలయును. ఇది భారతీయుల జీవన క్రమము. ఈ క్రమతత్త్వమునే ధర్మమందురు. "యతోఽ భ్యుదయ నిశ్రేయస సిద్ధి స్సధర్మః" ఈ జీవితమునను, జీవితానంతరమునను సుఖసమృద్ధులతో శాంతిపూర్వక ముగ జీవించుటయే భారతీయ సందేశము. దీనికి ప్రధాన సాధన విధానము పురుషార్థములు: ధర్మార్థకామమోక్ష ములు. ఇవి యొక దానికొకటి వ్యతిరేకములు, విఘ్నకర ములు గానీక సమన్వయరూపముతో సంతరించుకొను టయే భారతీయుని విధి. ఈ విధానమునే భారతదేశము ప్రపంచమునకు చేయెత్తి చాటుచున్నది.

జై భారత్

తెనాలి, భారతీ ముద్రాక్షరశాలయందు ముద్రింపబడెను. 1950.

'సందేశమాల' యితర గ్రంథములు

నాల్గవ పుష్పము

గౌ. శ్రీ. చంద్రమౌళిగారిచే రచింపబడిన

రామాయణ సుధాలహరి

వెల రు. 2-0-0 (బాలకాండము) 200 పుటలు

రామాయణ కావ్యమును రకరకములుగా రచియించినవారు, రచియించుచున్నవారు పెక్కురున్నారు.

కాని యీ పుస్తకమొక యపూర్వమగు ఫక్కిలో, ననన్య సామాన్యమగు భాషలో ప్రాయబడినది.

ఇందు వాల్మీకి వైశిష్ట్యమును, రామాయణ రామణీయకతను, రసవదఘటముల యౌచిత్యమును పరామర్శించిన నైపుణ్యమును; ప్రస్తుత కాలమునకు సమన్వయించిన చాకచక్యమును ప్రస్తుతి పాత్రములు.

పత్రికలు, వ్యక్తులు; పండితులు, పామరులు మెచ్చుకొన్న గ్రంథరాజము.

మచ్చునకు ఆంధ్రలోకమునకు సాహిత్య క్షేత్రమున - ఆచార్య స్వరూపులగు శ్రీ రామలింగారెడ్డిగారి యభిప్రాయమును ప్రక్కపుటలో మీరు చూడవచ్చును.

ఆంధ్రలోక మిచ్చిన ప్రోత్సాహము వలన క్రమముగా తక్కిన కాండములును వచ్చి మీ కానందమును గూర్చనున్నవి.

చిక్కని కాగితము, చక్కనిముద్రణము, ముచ్చటైన త్రివర్ణ చిత్రము, ఇతర చిత్రములు.

UNIVERSITY OF MYSORE

C. R. REDDY
Pro-Chancellor

WEST LAKE
YELWAL ROAD
MYSORE,
10th May, 1950

My Dear Chandramouli ,

Really it is the greatest pleasure and, if you won't get offended, a bit of a surprise also, to me:— your presentation of the immortal Ramayana. I congratulate you on your profound scholarship without pedantry, the uniform good taste and the excellent classical style of your Balakanda. I am beginning to think that a first-rate man of letters has been lost in a Politician, though even there he has deserved more or less well of the country, but not so well!

But perhaps I may add that, as an exponent of Higher Criticism, I may not be able to agree with all the views expressed. If you are interested in the principles of my Higher Criticism, please read my preface to the Andhra University Edition of Gona Buddha

Reddy's"Ranganatha Ramayana."The key-note points are brought out there. I had no idea that in spite of your European Education, you were so choke-full of orthodoxy and the సాంప్రదాయక mode of treating these subjects. But in this wide world, where the sun shines on all alike, there is room for both schools of thought and both types of personality- - and indeed for innumerable more schools of thought and types of personality. Your book will be valued as literature and fist-rate literature at that.

With my cordial congratulations and best wishes,

Yours sincerely,
(Sd.) C. R. REDDY.

మొదటి పుష్పము

వెల రు. 1_8_0 **సఫలత** 150 పుటలు

ఒకానొక కార్యమును సాధించి సఫలత నెందుట కవ సరములగు గుణగణములను సోదాహరణముగా జర్చించి సాఫల్య మార్గమును జూపిన గ్రంథరత్నము.

ఎంత యసమర్థునకును ఉత్సాహము నీయగల విషయ ములు, సరలము రసవంతమునగు భాష. ఆంధ్రమున నిట్టి విషయమును బోధింప బూనిన యేకైక గ్రంథము.

ఆంధ్ర విశ్వకళాపరిషత్తు చే ఇంటర్ మీడియేట్ విద్యార్థులకు కొన్ని యేండ్లపాటు పాఠ్య గ్రంథముగా నిర్ణయింపబడ్డది. ఎల్లరచే ప్రశంసల నందినది.

రెండవ పుష్పము

'బుకర్ — టి — వాషింగ్టన్'

వెల రు. 1_0_0 (ఆదర్శ విద్యార్థి) 112 పుటలు

అమెరికాలో అతి దీనదశనుండి యత్యున్నత దశకు వచ్చిన యొక నీగ్రో వాని జీవిత చరిత్రము.

ప్రయత్నించినచో మానవుని కందరాని స్థానము లేదని నిరూపించు మనోహర పుస్తకము.

ప్రతి భారతీయుడు తప్పక చదివి తీరవలసినదని గాంధి మహాత్ముడు మనకు చూపిచన్న చరిత్ర.

మనోహరమగు సులభ శైలి. హైస్కూళ్లలో హైయర్ ఫారములకు ఉపవాచకముగా పెక్కు బుక్కు కమిటీచే సంగీకరింప బడినది.

దొరకుచోటు:— 'సందేశమాల', తెనాలి.

V30

030